# శ్రీమద్భగవద్గీత

## సరళానువాదము

## శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ

ప్రచురణ:
**అవధూత దత్తపీఠము**
శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమము
దత్తనగర్, ఊటీరోడ్డు
మైసూరు-570025

శ్రీమద్భగవద్గీత

ప్రథమముద్రణ: **2016, డిసెంబర్ 27న** కురుక్షేత్రంలో సద్గురుదేవుల సన్నిధిలో గీతాపారాయణ సందర్భముగా సమర్పణ.

వెల- **100/-**

అక్షరదోష సవరణ- దత్తపీఠ ఆస్థాన్ విద్వాన్- బ్రహ్మశ్రీ రాణీ సుబ్బయ్య దీక్షితులు

ముఖచిత్రము - శ్రీసోమ్ గంగాధర్

డి.టి.పి - రామ్ జీ

ప్రతులకు : రాగరాగిణీ ట్రస్ట్
అవధూత దత్తపీఠము
శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమము
దత్త నగర్, ఊటీ రోడ్డు
మైసూరు - 570 025

*Ph* : 0821-2486486
*Fax* : 0821-2487487
*Internet* : www.dattapeetham.com



## గురు వాణి

శ్రీకృష్ణాయ పరమాత్మనే నమః

ప్రతివాడూ తన గురించి తనకు 'బాగా తెలుసు' నని అనుకొంటూ ఉంటాడు. కానీ అసలు సిసలైన 'పరీక్షా సమయం' ఎదురైనప్పుడే నీరు కారిపోయి సంకటస్థితిలో పడిపోతాడు. ఈ పరిస్థితి ఎవరికి, ఎప్పుడు, ఏ సమయంలో సంభవిస్తుందో తెలియదు.

అందుకే భగవంతుడు సార్వకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, ప్రతివాడూ ఉద్ధరించబడాలని మనస్సులో సంకల్పం చేసుకొన్నాడు. అర్జునుడిని నెపంగా పెట్టుకొని, మంచి-చెడుల పోరాటంలో మంచిని గెలిపించాలని రణభూమిలో మరొక అవతారమెత్తాడు. అదే వాగ్రూపం! అదే భగవద్గీత!!

యుగాలు గడిచినా, తరాలు మారినా, ప్రపంచంలో ఎలాంటి మార్పులు సంభవించినా, భగవద్వాణి చెవులలో గింగురులు తిరుగుతూనే ఉంది. నాలుకలపై నానుతూనే ఉంది. హృదయాలలో ప్రకాశిస్తూనే ఉంది.

పురుషులను, స్త్రీలను, బాలలను, యువకులను, వృద్ధులను, రాజులను, ప్రజలను, ఉపాధ్యాయులను, శిష్యులను, ధనికులను, దరిద్రులను, విద్యావంతులను, విద్యాహీనులను, సమస్త విశ్వాన్నీ ఉద్ధరించింది, ఉద్ధరిస్తూనే ఉంటుంది. అదీ భగవద్గీత మాహాత్మ్యము.

కొంతమంది 'ఈ భగవద్గీత తురీయాశ్రమం వారికే లేదా వయసు మళ్లినవారికే సంబంధించినది' అనే అపోహలో ఉన్నారు. అది తప్పు. దానిని విడిచి పెట్టండి. అర్జునుడు పెళ్లి చేసుకొన్నవాడు, వయసులో ఉన్నవాడు, సంసారి. ఆయన గీతను విని ఉద్ధరించబడ్డాడు కదా!

గీత వేరు, నిత్య జీవితము వేరు కాదని గ్రహించండి. మీ వ్యాపారంలో, మీ వృత్తిలో, మీ పలుకులో, మీ భాషలో, మీ సంపాదనలో, మీ భోజనంలో, ప్రతి చిన్న వ్యవహారంలోనూ గీత సమ్మిళితమై ఉంది. కనుక గీత మిమ్మల్ని ప్రేమించి, పాలించి, బోధించి, శాసించి, హితోక్తులను గరపి, మహాపురుషుడిగా తీర్చిదిద్దుతుంది. కనుక గీతను తెలుసుకొని రాతను మార్చుకోండి.

మేము గీతా పారాయణ యజ్ఞాన్ని చేయించటంలో ఒక రహస్యముంది. అర్జునుని టెక్కెముపై మన హనుమత్స్వామి ఉన్నాడు కదా! ఇది ఆయనకు

కూడా ఎంతో ప్రియమైనది కదా! అందుకనే గీతా పారాయణ యజ్ఞం చెయ్యాలని సంకల్పించాము.

విదేశాలలో విజయ యాత్ర చేస్తున్నప్పుడు, డల్లాస్ నగరంలో శ్రీకార్యసిద్ధి ఆంజనేయస్వామివారిని ది. 23.7.2015 తేదీన ప్రతిష్ఠించిన సందర్భములో మేము చెప్పిన మాటను పట్టుకొని 40 మంది పిల్లలు, పట్టుదలతో పూర్తిగా భగవద్గీతను కంఠస్థం చేసి, ఈ సంవత్సరం జులైలో చక్కగా పారాయణ చేసి, వినిపించి, మా మనస్సును గెలుచుకొన్నారు.

మేమా గీతాపారాయణను విని మంత్రముగ్ధులమై పోయాము. ఆ పిల్లలతో ధ్వనిముద్రణ చేయిస్తున్నాము.

పరమాత్మ అనుగ్రహం పిల్లలు, పెద్దలు, సమస్త జగత్తుమీద ప్రసరించాలని పవిత్రక్షేత్రమైన కురుక్షేత్రంలో గీతా పారాయణ జరిపించాలని సంకల్పించాము. ఆ సందర్భంగా గీతా ప్రసాద రూపంలో ఈ భగవద్గీతా పుస్తకాన్ని అందిస్తున్నాము. అందుకోండి.

ఈ గీతను ప్రతి ఇంటిలోనూ ఉంచుకొని, పారాయణ చెయ్యండి. మీ జీవితంలో ఊహించని మంచి మార్పును మీరు చూస్తారు. శ్రీకృష్ణ పరమాత్మ అనుగ్రహంతో మీ సమస్యలు తీరి, మీకు శాంతి, సుఖసంతోషాలు లభించుగాక! అని ఆశీర్వదిస్తూ.....

మీ

స్వామీజీ


1. అర్జున విషాద యోగః
2. సాంఖ్యయోగః
3. కర్మయోగః
4. జ్ఞానయోగః
5. కర్మసంన్యాస యోగః
6. ఆత్మసంయమయోగః (ధ్యానయోగః)
7. జ్ఞాన విజ్ఞానయోగః
8. అక్షర పరబ్రహ్మయోగః (అభ్యాసయోగః)
9. రాజవిద్యారాజగుహ్యయోగః
10. విభూతియోగః
11. విశ్వరూప సందర్శనయోగః
12. భక్తియోగః
13. క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగః
14. గుణత్రయ విభాగయోగః
15. పురుషోత్తమ యోగః
16. దైవాసుర సంపద్విభాగయోగః
17. శ్రద్ధాత్రయ విభాగయోగః
18. మోక్షసన్న్యాస యోగః

## భగవద్గీతా ధ్యాన శ్లోకములు

శ్రీగణపతి సచ్చిదానంద సద్గురుభ్యో నమః

ఓం పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం
వ్యాసేన గ్రథితాం పురాణ మునినా మధ్యే మహాభారతమ్।
అద్వైతామృతవర్షిణీం భగవతీ మష్టాదశాధ్యాయినీం
అంబ త్వామనుసందధామి భగవద్గీతే భవద్వేషిణీమ్।।

నమోఽస్తుతే వ్యాస విశాలబుద్ధే ఫుల్లారవిందాయత పత్రనేత్ర।
యేన త్వయా భారత తైలపూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః।।

ప్రపన్న పారిజాతాయ తోత్రవేత్రైకపాణయే।
జ్ఞానముద్రాయ కృష్ణాయ గీతామృతదుహే నమః।।

వసుదేవసుతం దేవం కంసచాణూర మర్దనమ్।
దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్।।

భీష్మద్రోణతటా జయద్రథజలా గాంధారనీలోత్పలా
శల్యగ్రాహవతీ కృపేణవహనీ కర్ణేన వేలాకులా।
అశ్వత్థామ వికర్ణఘోరమకరా దుర్యోధనావర్తినీ
సోత్తీర్ణా ఖలు పాండవై రణనదీ కైవర్తకః కేశవః।।

పారాశర్య వచః సరోజమమలం గీతార్థగన్ధోత్కటం
నానాఖ్యానకకేసరం హరికథా సంబోధనాబోధితమ్।।
లోకే సజ్జన షట్పదైరహరహః పేపీయమానం ముదా
భూయాద్భారతపంకజం కలిమల ప్రధ్వంసి నః శ్రేయసే।।

మూకం కరోతి వాచాలం పంగుం లంఘయతే గిరిమ్।
యత్కృపా తమహం వందే పరమానంద మాధవమ్।।

శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం
విశ్వాధారం గగన సదృశం మేఘవర్ణం శుభాంగమ్।
లక్ష్మీకాంతం కమలనయనం యోగిహృద్ధ్యానగమ్యం
వందే విష్ణుం భవభయహరం సర్వలోకైకనాథమ్।।

యం బ్రహ్మావరుణేంద్ర రుద్రమరుతస్తున్వంతి దివ్యైః స్తవైః
వేదైస్సాంగపదక్రమోపనిషదైర్గాయంతి యం సామగాః।
ధ్యానావస్థిత తద్గతేన మనసా పశ్యంతి యం యోగినో
యస్యాంతం న విదుస్సురాసురగణా దేవాయ తస్మై నమః।।

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్।।

సచ్చిదానందరూపాయ కృష్ణాయాక్లిష్టకారిణే।
నమో వేదాంత వేద్యాయ గురవే బుద్ధిసాక్షిణే।।

సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః।
పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్।।

* గీతాశాస్త్రమిదం పుణ్యం యఃపఠేత్ ప్రయతఃపుమాన్।
విష్ణోః పదమవాప్నోతి భయశోకాదివర్జితః।।

* ఏకం శాస్త్రం దేవకీ పుత్రగీతం
ఏకో దేవో దేవకీ పుత్ర ఏవ।
ఏకో మంత్ర స్తస్య నామాని యాని
కర్మాప్యేకం తస్య దేవస్య సేవా।।

* ఈ రెండు శ్లోకాలను కొంతమంది పారాయణలో కలుపుకొని పఠిస్తున్నారు. కొంతమంది పఠించటం లేదు.

ఓం శ్రీకృష్ణాయ పరమాత్మనే నమః

## శ్రీమద్భగవద్గీత
## అథ ప్రథమోఽధ్యాయః - అర్జున విషాద యోగః

**ధృతరాష్ట్ర ఉవాచ:**

**1.** **ధర్మ క్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః।**
**మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ?।।**

ధృతరాష్ట్రుడు ఇలా పలికాడు - సంజయా! పుణ్యభూమి అయిన ఈ కురుక్షేత్రంలో యుద్ధం చేయాలనే కోరికతో ఉన్న నా కుమారుడైన దుర్యోధనుడు మొదలగు వారు, పాండు మహారాజ పుత్రులైన ధర్మరాజు మొదలగు వారు, ఏమి చేశారు?

**సంజయ ఉవాచ:**

**2.** **దృష్ట్వా తు పాండవానీకం వ్యూఢం దుర్యోధనస్తదా।**
**ఆచార్యముపసంగమ్య రాజా వచనమబ్రవీత్।।**

సంజయుడిలా పలికాడు - యువరాజైన దుర్యోధనుడు యుద్ధ వ్యూహములో ఉన్న పాండవ సైన్యాన్ని చూచి, ద్రోణాచార్యుడి వద్దకు వెళ్లి ఈ విధముగా అన్నాడు.

**3.** **పశ్యైతాం పాండుపుత్రాణాం ఆచార్య! మహతీం చమూమ్।**
**వ్యూఢాం ద్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా।।**

గురుదేవా! బుద్ధిమంతుడు, మీ యొక్క శిష్యుడు, ద్రుపద మహారాజు యొక్క పుత్రుడైన ధృష్టద్యుమ్నుడు ఇట్టి యుద్ధ వ్యూహాన్ని ఏర్పాటు చేశాడు. పాండవులయొక్క సైన్య సమావేశమును కూడా చూడండి.

**4.** అత్రశూరా మహేష్వాసాః భీమార్జునసమా యుధి।
యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః।।

**5.** ధృష్టకేతుశ్చేకితానః కాశిరాజశ్చ వీర్యవాన్।
పురుజిత్ కుంతిభోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః।।

**6.** యుధామన్యుశ్చ విక్రాంతః ఉత్తమౌజాశ్చ వీర్యవాన్।
సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః।।

ఈ పాండవ సేనలో భీమార్జునులతో సమానమైన సాత్యకి, విరాట మహారాజు, మహారథుడైన ద్రుపదుడు, శిశుపాలుడి పుత్రుడైన ధృష్టకేతువు, యదువీరుడైన చేకితానుడు, శక్తిమంతుడైన కాశీరాజు, పురుజిత్తు, కుంతిభోజుడు, నరశ్రేష్ఠుడైన శైబ్యుడు, పరాక్రమశాలి అయిన యుధామన్యుడు, మహాబలవంతుడైన ఉత్తమౌజుడు, సుభద్రా పుత్రుడైన అభిమన్యుడు, ద్రౌపదీ పుత్రులైన ఉపపాండవులు మొదలైన మహావీరులెంతోమంది ఉన్నారు. వీరందరూ మహారథులే.

**7.** అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ!।
నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్ బ్రవీమి తే।।

బ్రాహ్మణోత్తమా! మన పక్షమున ఉన్న వీరులను, సేనాపతులను తెలుసుకోండి. మీకు తెలియచేయుటకై వారి వివరాలను మనవి చేస్తున్నాను.

**8.** భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః।
అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తిస్తథైవ చ।।

మన పక్షాన ఉన్నవారిలో యుద్ధవిశారదులైన మీరు, భీష్మాచార్యుల వారు, కర్ణుడు, యుద్ధవిజయుడైన కృపాచార్యుడు, మీయొక్క కుమారుడు అశ్వత్థామ, వికర్ణుడు, సోమదత్తుడి కుమారుడైన భూరిశ్రవుడు, మొదలైన ప్రముఖులు ఎంతోమంది ఉన్నారు.

**9.** అన్యే చ బహవ శ్శూరాః మదర్థే త్యక్తజీవితాః।
నానాశస్త్ర ప్రహరణాః సర్వే యుద్ధవిశారదాః।।

నా కొరకై ప్రాణములను కూడా విడిచిపెట్టుటకు సిద్ధంగా ఉన్నవారు ఎంతోమంది ఉన్నారు. వీరందరూ శస్త్రవిద్యలో నిపుణులు. యుద్ధవిద్యలో విశారదులు.

**10.** అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభి రక్షితమ్।
పర్యాప్తం త్విదమేతేషాం బలం భీమాభిరక్షితమ్।।

భీష్మాచార్యులవారిచేత రక్షించబడుచున్న మనయొక్క సైన్యబలం పరిమితంగా ఉంది. భీమునిచే రక్షించబడుతున్న పాండవసైన్యం ఎక్కువగా ఉంది. (కౌరవసైన్యం సంఖ్య పాండవ సైన్యం కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ, దానికి వ్యతిరేకముగా ఇక్కడ దుర్యోధనుడు మాట్లాడుతున్నాడు. ఎందువలననగా భీష్మపితామహుడు ఉభయపక్షపాతి. భీముడు ఏకపక్షపాతి. కనుక దుర్యోధన బలం కంటే పాండవుల బలమే ఎక్కువ)

**11.** అయనేషు చ సర్వేషు యథాభాగమవస్థితాః।
భీష్మమేవాభిరక్షంతు భవంత స్సర్వ ఏవ హి।।

కావున మీరందరూ సైన్య సమూహములయొక్క ప్రారంభ ద్వారములలో మీ మీ స్థానములలో ఉండి, భీష్మపితామహుడిని కాపాడండి. భీష్ముడి బలమే మన ప్రాణములను రక్షిస్తుంది.

**12.** తస్య సంజనయన్ హర్షం కురువృద్ధః పితామహః।
సింహనాదం వినద్యోచ్చైః శంఖం దధ్మౌ ప్రతాపవాన్।।

గౌరవ పూర్వకములైన దుర్యోధనుడియొక్క మాటలను విని, కురు కులవృద్ధుడు, ప్రతాపవంతుడు, పితామహుడు అయిన భీష్మాచార్యులవారు

పెద్దగా సింహగర్జన చేసి, శంఖాన్ని పూరించారు. దుర్యోధనుడి యొక్క హృదయం ఆనందంతో పొంగిపోయింది.

**13.** తత శ్శంఖాశ్చ భేర్యశ్చ పణవానక గోముఖాః।
సహసైవాభ్యహన్యంత స శబ్దస్తుములోఽభవత్।।

భీష్ముడియొక్క యుద్ధోత్సాహం యుద్ధములో ఉన్న ప్రతిసైనికుడినీ ఉత్సాహపరిచింది. శంఖములు, భేరులు, మృదంగములు, డోళ్లు, కొమ్ముబూరలు ఒక్కసారిగా మ్రోగసాగాయి. అన్ని ధ్వనులు కలిసిపోయాయి.

**14.** తత శ్శ్వేతైర్హయైర్యుక్తే మహతి స్యందనే స్థితౌ।
మాధవః పాండవశ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః।।

అదే సమయంలో తెల్లని గుఱ్ఱములతో కూడిన గొప్పరథంలో కూర్చొన్న శ్రీకృష్ణుడు, పాండవ కుమారుడైన అర్జునుడు కూడా తమయొక్క దివ్యశంఖములను పూరించి, యుద్ధానికి సన్నద్ధులయ్యారు.

**15.** పాంచజన్యం హృషీకేశః దేవదత్తం ధనంజయః।
పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః।।

హృషీకేశుడు పాంచజన్యమనే తనయొక్క శంఖాన్ని పూరించాడు. అర్జునుడిగా ప్రసిద్ధి చెందిన ధనంజయుడు దేవదత్తమనే తన శంఖాన్ని పూరించాడు. యుద్ధ భయంకరుడైన భీముడు పౌండ్రమనే శంఖాన్ని పూరించాడు.

**16.** అనంతవిజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః।
నకుల స్సహదేవశ్చ సుఘోషమణిపుష్పకౌ।।

కుంతీతనయుడైన ధర్మరాజు అనంత విజయమనే శంఖాన్ని పూరించాడు. నకులుడు సుఘోష అనే శంఖాన్ని, సహదేవుడు మణిపుష్పకమనే శంఖాన్ని పూరించారు.

**17.** కాశ్యశ్చ పరమేష్వాసః శిఖండీ చ మహారథః।
ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకిశ్చాపరాజితః।।

**18.** ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే।
సౌభద్రశ్చ మహాబాహుః శంఖాన్ దధ్ముః పృథక్ పృథక్।।

ఓ ధృతరాష్ట్ర మహారాజా! ధనుర్ధారి అయిన కాశీరాజు, మహారథుడైన శిఖండి, ధృష్టద్యుమ్నుడు, విరాట మహారాజు, అజేయుడైన సాత్యకి, ద్రుపదమహారాజు, ద్రౌపదీ పుత్రులైన ఐదుగురు ఉపపాండవులు, మహాభుజుడైన అభిమన్యుడు మొదలగు వారు కూడా నాలుగు దిక్కుల నుండి తమ శంఖములను పూరించారు.

**19.** స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్।
నభశ్చ పృథివీం చైవ తుములో వ్యనునాదయన్।।

ఈ విధముగా భయంకరములైన శంఖముల ధ్వనులతో భూమి, ఆకాశాలు దద్దరిల్లి ప్రతిధ్వనించాయి. దుర్యోధనాదుల హృదయములను అదరగొట్టాయి.

**20.** అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః।
ప్రవృత్తే శస్త్రసంపాతే ధనురుద్యమ్య పాండవః।।

**21** హృషీకేశం తదా వాక్యం ఇదమాహ మహీపతే!।

ఓ మహారాజా! ఆ సమయంలో ధ్వజముపై హనుమంతుడు గుర్తుగా గల అర్జునుడు, యుద్ధసన్నద్ధులైన ధృతరాష్ట్ర కుమారులను చూచి, తన యొక్క ధనుస్సును ఎక్కుపెట్టి, శ్రీకృష్ణుడితో ఈ విధముగా అన్నాడు.

**అర్జున ఉవాచ:**

సేనయో రుభయోర్మధ్యే రథం స్థాపయమేఽచ్యుత!।

**22.** యావదేతాన్ నిరీక్షేఽహం యోద్ధుకామానవస్థితాన్।
కైర్మయా సహయోద్ధవ్యం అస్మిన్ రణసముద్యమే।।

**23.** యోత్స్యమానానవేక్షేఽహం య ఏతేఽత్ర సమాగతాః
ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధేః యుద్ధే ప్రియచికీర్షవః।।

అర్జునుడు ఇలా అన్నాడు - యుద్ధం చేయుటకై వచ్చిన వీరందరినీ నేను చూస్తున్నాను. ఈ మహాయుద్ధంలో ఎవరు ఎవరితో పోరాడవలసి ఉంటుందో గ్రహించాను. దుష్టుడైన దుర్యోధనునికి మంచి చేయాలనే కోరికతో యుద్ధం చేయుటకు వచ్చిన వీర పురుషులనందరినీ ఒక్కసారి చూడాలని ఉంది. కాబట్టి శ్రీకృష్ణా! రెండు సైన్యములయొక్క మధ్యభాగంలో నా రథాన్ని ఆపి ఉంచు.

సంజయ ఉవాచ:

**24.** ఏవముక్తో హృషీకేశః గుడాకేశేన భారత!।
సేనయో రుభయోర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్।।

**25.** భీష్మ ద్రోణ ప్రముఖతః సర్వేషాం చ మహీక్షితామ్।
ఉవాచ పార్థ! పశ్యైతాన్ సమవేతాన్ కురూనితి।।

సంజయుడు చెప్పాడు -ధృతరాష్ట్రుడా! గుడాకేశుడైన (నిద్రను జయించిన) అర్జునుడు ,శ్రీకృష్ణుడితో ఇలా చెప్పగా, శ్రీకృష్ణుడు కురు పాండవ సేనలయొక్క మధ్యభాగంలో భీష్మద్రోణాది మహీపతుల యెదుట, తన యొక్క రథమును నిలిపి, ''అర్జునా! యుద్ధం చేయుటకు సన్నద్ధులై వచ్చిన ఈ కౌరవ మహావీరులను ఒక్కసారి చూడు''- అన్నాడు.

**26.** తత్రాపశ్యత్ స్థితాన్ పార్థః పితౄనథ పితామహాన్।
ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీంస్తథా।।
శ్వశురాన్ సుహృదశ్చైవ సేనయో రుభయో రపి।

అప్పుడు అర్జునుడు రెండు సేనల యొక్క మధ్యలో నున్న గౌరవనీయులైన, పితృసమానులైన, భూరిశ్రవుడు మొదలగువారిని, భీష్మాది పితామహులను, ద్రోణాది ఆచార్యులను, శల్యాది మేనమామలను, దుర్యోధనాది సోదరులను, లక్ష్మణాది పుత్రస్థానీయులను, అశ్వత్థామాది మిత్రులను, కృతవర్మాది ఆత్మీయులను, పౌత్రులను అందరినీ చూశాడు.

**27** తాన్ సమీక్ష్య స కౌంతేయః సర్వాన్ బంధూనవస్థితాన్।
కృపయా పరయాఽవిష్టః విషీదన్నిదమబ్రవీత్।।

అర్జునుడు అచట నున్న బంధువులందరినీ చూచి, దయతో నిండిన మనస్సు కలవాడై దుఃఖంతో కూడినవాడై ఈ విధంగా అంటున్నాడు.

అర్జున ఉవాచ-

**28.** దృష్ట్వేమం స్వజనం కృష్ణ! యుయుత్సుం సముపస్థితమ్।
సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి।।

**29.** వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే।
గాండీవం స్రంసతే హస్తాత్ త్వక్చైవ పరిదహ్యతే।।

అర్జునుడిలా అడిగాడు- శ్రీకృష్ణుడా! యుద్ధము చేయుటకై వచ్చిన నాయొక్క ఆత్మీయ బంధువులనందరినీ చూచి, నా శరీరావయవములన్నీ పట్టుతప్పిపోతున్నాయి. నోరు ఎండిపోతోంది. శరీరము వణికిపోతోంది. చేతి నుండి గాండీవం జారిపోతోంది. చర్మం మండిపోవుచున్నట్టుగా ఉంటోంది. వెంట్రుకలు నిక్కపొడుచుకొంటున్నాయి.

**30.** న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః।
నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ।।

శ్రీకృష్ణా! నేను స్థిరముగా ఉండలేక పోతున్నాను. నా మనస్సు చంచలమై పోతోంది. అమంగళ సూచకములైన అపశకునాలను నేను చూస్తున్నాను.

**31.** న చ శ్రేయోऽనుపశ్యామి హత్వా స్వజనమాహవే।
న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ।।

శ్రీకృష్ణా! యుద్ధంలో ఇంతమంది బంధువులను చంపుట వలన లభించే శుభమేమిటో నాకు తెలియటం లేదు. యుద్ధంలో జయాన్ని కానీ, రాజ్యభోగములను కానీ, సుఖానుభవములు కానీ నేను కోరుట లేదు.

**32** కిం నో రాజ్యేన గోవింద కిం భోగైర్జీవితేన వా।।

**33.** యేషామర్థే కాంక్షితం నః రాజ్యం భోగా స్సుఖాని చ।
త ఇమేऽవస్థితా యుద్ధే ప్రాణాంస్త్యక్త్వా ధనాని చ।।

**34.** ఆచార్యాః పితరః పుత్రాః తథైవ చ పితామహాః।
మాతులా శ్శ్వశురాః పౌత్రాః శ్యాలా స్సంబంధినస్తథా।।

గోవిందుడా! మనకు ఈ రాజ్యంతో కానీ, సుఖభోగాలతో కానీ, నిరర్థకమైన జీవితంతో కానీ ప్రయోజనం ఏముంది? ఎవరి కొరకైతే రాజ్యాన్ని, రాజ్యభోగములను, సుఖములను కోరుతున్నామో, ఆ గురువులు, అట్టి తండ్రులు, పుత్రులు, పితామహులు, మేనమామలు, మామలు, మనుమలు, బావలు, ఇతర బంధువులు, తమ ప్రాణాలపై ఆశ వదలి ఈ యుద్ధానికి వచ్చారు.

**35.** ఏతాన్న హంతుమిచ్ఛామి ఘ్నతోऽపి మధుసూదన।
అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిం ను మహీకృతే।।

ఓ మధుసూదనా! ముల్లోకాధిపత్యం కొరకైననూ నేను ఎవరినీ చంపను. ఇక ఈ భూమండల విషయమై చెప్పనేల? అలాగే వీరిలో ఎవరైనా నన్ను చంపబూనిననూ నేను మాత్రం వీరిని నేను చంపలేను.



**36.** నిహత్య ధార్తరాష్ట్రాన్నః కా ప్రీతి స్స్యాజ్జనార్దన।
పాపమేవాశ్రయేదస్మాన్ హత్వైతానాతతాయినః।।

జనార్దనా! దుర్యోధనాది బంధువులను చంపుట వలన నాకు కలుగు సంతోషమేముంటుంది? ఆతతాయుడైన వీరిని చంపటం వలన మనకు లభించేది పాపమే కదా! (ఇంటికి నిప్పు పెట్టేవాడు, విషాన్ని ఇచ్చేవాడు, చంపుటకై ఆయుధాన్ని చేతపట్టినవాడు, ధనమును దొంగిలించేవాడు, భూమిని దొంగిలించినవాడు, భార్యను దొంగిలించినవాడు - ఈ ఆరుగురినీ ఆతతాయులంటారు. ధర్మశాస్త్రం ప్రకారం ఆతతాయులను సంహరించుట దోషం కాకపోయినా, తాతముత్తాతలను వధించుట దోషమని అర్జునుడి అభిప్రాయము.)

**37.** తస్మాన్నార్హా వయం హన్తుం ధార్తరాష్ట్రాన్ స్వబాంధవాన్।
స్వజనం హి కథం హత్వా సుఖిన స్స్యామ మాధవ।।

కాబట్టి దుర్యోధనాదులను, వారి బంధువులను చంపుట నాకు న్యాయం కాదు. బంధువులను చంపి మనం ఏ విధంగా సుఖాన్ని అనుభవిస్తాము?

**38.** యద్యప్యేతే న పశ్యంతి లోభోపహత చేతసః।
కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్।।

**39.** కథం న జ్ఞేయమస్మాభిః పాపాదస్మాన్నివర్తితుమ్।
కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భిర్జనార్దన!।।

వీరందరూ రాజ్యలోభం కారణంగా తమ వివేకాన్ని విడిచిపెట్టి కులక్షయము వలన కలిగే దోషాన్నీ, మిత్రదోహము వలన కలిగే పాపాన్ని తెలుసుకోలేకపోతున్నారు. శ్రీకృష్ణా! వంశనాశనం వల్ల కలుగు దోషాన్ని నేను గుర్తించగలుగుతున్నాను.

**40.** కులక్షయే ప్రణశ్యంతి కులధర్మా స్సనాతనాః।
ధర్మే నష్టే కులం కృత్స్నం అధర్మోఽభిభవత్యుత॥

కులనాశనము వలన ప్రాచీనమైన ధర్మాలన్నీ నశించిపోతాయి. ధర్మం నశిస్తే కులాచారం నశిస్తుంది. ధర్మము అధర్మముతో కప్పివేయబడుతుంది.

**41.** అధర్మాభిభవాత్ కృష్ణ! ప్రదుష్యంతి కులస్త్రియః।
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ! జాయతే వర్ణసంకరః॥

శ్రీకృష్ణా! అధర్మము వలన కులస్త్రీలు నాశనమైపోతారు. కులస్త్రీలు చెడిపోయినచో వర్ణసాంకర్యము ఏర్పడుతుంది.

**42.** సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ।
పతన్తి పితరో హ్యేషాం లుప్తపిండోదక క్రియాః॥

వర్ణసాంకర్యమైతే కులఘాతకులు, కులజనులు, అందరూ నరకం లోనికి నెట్టివేయబడతారు. శ్రాద్ధ తర్పణ పిండప్రదాన మొదలైన కర్మలు లేకపోవుట వలన, కర్మ చేయు వారు కూడా లేకపోవుట వలన, పితృపురుషులు కూడా నరకంలోనే ఉండిపోతారు.

**43.** దోషై రేతైః కులఘ్నానాం వర్ణసంకర కారకైః।
ఉత్సాద్యంతే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః॥

వర్ణసంకరమునకు కారణములైన ఈ దోషముల వలన సనాతనధర్మాలు, కులధర్మాలు, ఆశ్రమధర్మాలు సమూలంగా నశించిపోతాయి.

**44.** ఉత్సన్న కులధర్మాణాం మనుష్యాణాం జనార్దన!।
నరకే నియతం వాసః భవతీత్యనుశుశ్రుమ॥

కులధర్మభ్రష్టులు నరకంలో నివసిస్తారని మనం వింటున్నాము.

**45.** అహో బత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్।
యద్రాజ్య సుఖలోభేన హంతుం స్వజన ముద్యతాః॥

శ్రీకృష్ణా! మనం మహాపాపములను చేయుటకు ప్రారంభిస్తున్నాము. రాజ్యం వలన లభించు సుఖమునకు ఆశపడి బంధువులను చంపుట పాపమే కదా!

**46.** యది మామప్రతీకారం అశస్త్రం శస్త్రపాణయః।
ధార్తరాష్ట్రా రణే హన్యుః తన్మే క్షేమతరం భవేత్॥

ప్రతిఘటించకుండా, ఆయుధం లేకుండగా ఉన్న నన్ను, దుర్యోధనాదులు ఆయుధములతో వచ్చి యుద్ధములో నన్ను చంపినా చంపవచ్చును. అట్టి మరణం ఈ మరణం కంటే కూడా నాకు మంచిది.

**సంజయ ఉవాచ:**

**47.** ఏవముక్త్వాఽర్జున స్సంఖ్యే రథోపస్థ ఉపావిశత్।
విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః॥

సంజయుడు చెప్పాడు- అర్జునుడు ఈ విధముగా పలికి, ఎక్కుపెట్టిన తన యొక్క విల్లును క్రిందకు పడవేసి, దుఃఖించుచున్నవాడై రథముయొక్క మధ్యభాగములో కూలబడిపోయాడు.

**ఇతి శ్రీ మద్భగవద్గీతాసూపనిషత్సు, బ్రహ్మవిద్యాయాం, యోగశాస్త్రే, శ్రీకృష్ణార్జున సంవాదే, అర్జునవిషాదయోగో నామ ప్రథమోఽధ్యాయః**

# అథ ద్వితీయోऽధ్యాయః

## సాంఖ్యయోగః

సంజయ ఉవాచ:

1. తం తథా కృపయాऽऽవిష్టం అశ్రుపూర్ణా కులేక్షణమ్।
విషీదంతమిదం వాక్యం ఉవాచ మధుసూదనః।।

సంజయుడు చెప్పాడు- అర్జునుడు దుఃఖించుచున్నవాడై, దయతో కూడినవాడై, కన్నీరు కార్చుచుండగా శ్రీకృష్ణుడు అతనితో ఈ విధముగా అన్నాడు.

శ్రీ భగవానువాచ

2. కుతస్త్వా కశ్మల మిదం విషమే సముపస్థితమ్।
అనార్యజుష్టమస్వర్గ్యం అకీర్తికరమర్జున!।।

అర్జునా! ఇట్టి కష్టసమయంలో ఆర్యులకు తగనిది, స్వర్గము పొందుటకు ప్రతిబంధకమైనది, అపకీర్తిని తెచ్చునది అయిన ఇట్టి వ్యామోహము నీకు ఏ విధముగా వచ్చింది?

3. క్లైబ్యం మా స్మ గమః పార్థ! నైతత్త్వయ్యుపపద్యతే।
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప।।

అర్జునా! పిరికితనం నీకు తగదు. శత్రువులను తపింప చేయువాడా! నీ మనస్సులోని దుర్బలత్వాన్ని విడిచిపెట్టు. యుద్ధం చేయుటకు సన్నద్ధుడవు కా. లెమ్ము.

అర్జున ఉవాచ:

4. కథం భీష్మమహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన!।
ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హావరిసూదన!।।

అర్జునుడు ఇలా పలికాడు- శత్రువులను మర్దించు మధుసూదనా! యుద్ధమునకు భయపడి, 'నేను యుద్ధము చెయ్యను' అని అనుట లేదు. 'అధర్మమైన, అన్యాయమైన యుద్ధమును నేను చేయనని' మాత్రమే చెపుతున్నాను. భీష్మద్రోణాదులు నాకు పూజ్యులు. వారితో వాగ్యుద్ధమే నేను చెయ్యకూడదు. ఇక బాణములను ఏవిధముగా వెయ్యగలను?

5. గురూనహత్వా హి మహానుభావాన్
శ్రేయో భోక్తుం భైక్ష్య మపీహ లోకే!
హత్వాऽర్థకామాంస్తు గురూనిహైవ
భుంజీయ భోగాన్ రుధిరప్రదిగ్ధాన్।।

వారిని వధించకపోతే, నీ స్థితి యేమిటి? అంటావా? మహానుభావులైన భీష్మద్రోణాదులను వధించకుండగా, భిక్షాటన చేస్తూ జీవించిన నాకు మేలు జరుగుతుంది. అంతేకానీ వారిని చంపి, ఆ నెత్తురుతో తడిసిన ధన ధాన్యాదులను, కామ్యభోగములను నేను అనుభవించలేను కదా!

6. న చైతద్విద్మః కతరన్నో గరీయః
యద్వా జయేమ యది వా నో జయేయుః।
యానేవ హత్వా న జిజీవిషామః
తేऽవస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః।।

అధర్మదోషాన్ని అంగీకరించి, యుద్ధం చేసినా, యుద్ధములో జయము వారిదో, మనదో, రెండింటిలో ఏది మంచిదో, నాకు తెలియుట లేదు. యుద్ధములో నేను జయించినా, అది నాకు పరాజయముతో సమానము. ఎవరిని వధించి జీవించటానికి ఇష్టపడనో వారే నాయెదుట ఉన్నారు.

**7.** కార్పణ్యదోషోపహతస్వభావః
పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢ చేతాః।
యచ్ఛ్రేయ స్స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్।।

శ్రీకృష్ణా! దైన్యముతో నాలోని శౌర్యము తగ్గిపోయింది. నా మనస్సు నిండా ధర్మసందేహములు పెరుగుతున్నాయి. నేను నిన్ను ప్రార్థిస్తున్నాను. నాకేది శుభమో, అది నీవే నిశ్చయం చేసి చెప్పు? నేను నీ శిష్యుడిని. నీ దాసుడిని. నీ శరణాగతుడిని. నన్ను శాసించు.

**8.** న హి ప్రపశ్యామి మమాపనుద్యాత్
యచ్ఛోక ముచ్ఛోషణ మింద్రియాణామ్।
అవాప్య భూమావసపత్నమృద్ధం
రాజ్యం సురాణామపి చాధిపత్యమ్।।

శత్రువులే లేనట్టి సర్వసమర్థమైన భూలోక రాజ్యమునే కాదు, స్వర్గాధిపత్యమును పొందినా కూడా ఇంద్రియ సంతాపకరమైన ఈ దుఃఖమును పోగొట్టు ఉపాయాన్ని తెలుసుకొనలేక పోవుచున్నాను.

**సంజయ ఉవాచ:**

**9.** ఏవముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతపః।
న యోత్స్య ఇతి గోవిందం ఉక్త్వా తూష్ణీం బభూవ హ।।

సంజయుడు ఇలా పలికాడు- శత్రుతాపనుడు, జితనిద్రుడు అయిన అర్జునుడు శ్రీకృష్ణుడితో 'ఈ విధముగా నేను యుద్ధము చేయను' అని పలికి మౌనంగా ఉండిపోయాడు.

**10.** తమువాచ హృషీకేశః ప్రహసన్నివ భారత!।
సేనయోరుభయోర్మధ్యే విషీదంతమిదం వచః।।

ఓ ధృతరాష్ట్రమహారాజా! రెండు సేనల మధ్యభాగంలో నిలిచి, విషాదగ్రస్తుడైన అర్జునుడిని పరిహసిస్తూ శ్రీకృష్ణుడీ విధముగా అన్నాడు.

శ్రీ భగవానువాచ:

**11.** అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే।
గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః।।

భగవంతుడిలా పలికాడు- శోకింప దగనివారిని గూర్చి నీవు ఏడుస్తున్నావు. ఈ మోహము నీకు ఏవిధముగా వచ్చింది? అయినా నీవు జ్ఞాని వలె మాట్లాడుతున్నావు? మరణించినవారిని గురించి గానీ, జీవించి ఉన్నవారిని గురించి గానీ, జ్ఞానులు దుఃఖమును పొందరు.

**12.** న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః।
న చైవ న భవిష్యామః సర్వే వయమతః పరమ్।।

నీవు దుఃఖించవలసిన అవసరం లేదు. నీవు, నేను, ఈ రాజులు, పూర్వకాలంలో లేరు కదా! శరీరాధారణకు పూర్వం మనందరం ఆత్మస్వరూపములో ఉన్నాము. ఈ దేహమును విడిచిపెట్టిన తరువాత కూడా మనం ఆత్మస్వరూపములోనే ఉంటున్నాము. భవిష్యత్తులో కూడా ఉంటాము. కావున దేహము నశించునది కానీ, జీవుడు నశించడు కదా!

**13.** **దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా।**
**తథా దేహాంతర ప్రాప్తిః ధీరస్తత్ర న ముహ్యతి॥**

దేహాభిమాని అయిన జీవుడికి ఈ శరీరములో బాల్యము, యౌవనము, వార్ధకము అను అవస్థలు కలుగుచున్ననూ, జీవుడిలో ఎట్టి మార్పూ లేదు. మార్పులన్నీ దేహానికి సంబంధించినవే. కావున దేహమును విడిచిపెట్టినా, జీవునికి ఎట్టి మార్పూ ఉండదు అని జ్ఞానవంతులు మరణమును చూసి దుఃఖించరు.

**14.** **మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణ సుఖదుఃఖదాః।**
**ఆగమాపాయినోఽనిత్యాః తాంస్తితిక్షస్వ భారత॥**

అర్జునా! విషయేంద్రియ సంయోగము వలననే శీతోష్ణములు, సుఖదుఃఖములు, సంయోగ వియోగములు ఏర్పడుతున్నాయి. కానీ ఇవన్నీ అనిత్యములైనవి. ఉత్పత్తి, వినాశము కలవి. వీటినన్నిటినీ నీవు సహించాలి సుమా!

**15.** **యం హి న వ్యథయంత్యేతే పురుషం పురుషర్షభ।**
**సమదుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే॥**

ఎందువల్లననగా, ఏ ధీరుడైతే సుఖ దుఃఖాలను సమానముగా స్వీకరిస్తూ, చలించకుండగా జీవించుచూ, శీతోష్ణములు మొదలైన ద్వంద్వములచేత బాధపడకుండగా ఉంటాడో, అతడే అమృతత్వమును (మోక్షము) పొందుటకు అర్హుడు.

**16.** నాసతో విద్యతే భావః నాభావో విద్యతే సతః।
ఉభయోరపిదృష్టోఽంతః త్వనయోస్తత్త్వదర్శిభిః॥

శీతోష్ణములు సహించుటకు చాలా కష్టమైనవి. వీటిని ఎలా సహించగలను? సహించినప్పటికీ ఆత్మ వినాశమే కలుగును కదా! అను అనుమానం మంచిది కాదు. ఎందువల్లననగా తత్త్వవిచారముతో శీతోష్ణములను మనం సహించగలము. 'అసత్తకు స్థానం లేదు. సద్వస్తువుకు వినాశమూ లేదు' అని తత్త్వవేత్తలు సత్, అసత్‌లయొక్క యథార్థ స్వరూపాన్ని తెలుసుకొన్నారు.

**17.** **అవినాశితు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్।**
**వినాశ మవ్యయస్యాస్య న కశ్చిత్ కర్తుమర్హతి॥**

ఏ వస్తువైతే సర్వప్రపంచమునూ, సాక్షిరూపంతో వ్యాపించి ఉన్నదో, అదియే ఆత్మవస్తువు. అదియే వినాశము లేనిది అని తెలుసుకో. ఎందువల్లననగా అవ్యయమైన ఆత్మను ఎవరూ నాశనం చెయ్యలేరు.

**18.** **అంతవంత ఇమే దేహాః నిత్యస్యోక్తా శ్శరీరిణః।**
**అనాశినోఽప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత॥**

ఆత్మ అనునది ప్రత్యక్షాది ప్రమాణములకు దొరకదు. అది వినాశము లేనిది. నిత్యమైనది. కానీ ఆత్మ స్వీకరించు శరీరాలు వినాశము కలవి. కాబట్టి యుద్ధం చెయ్యి. క్షాత్రధర్మాన్ని నిలబెట్టు.

**19.** **య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతమ్।**
**ఉభౌ తౌ న విజానీతః నాయం హంతి న హన్యతే॥**

ఎవరు ఈ ఆత్మను హంతగా అంటే చంపునదిగా తలచుచున్నారో, ఎవరు ఈ ఆత్మను నిహంతగా అంటే చంపబడు దానినిగా తలుచుచున్నారో, వారిరువురికీ కూడా ఆత్మస్వరూపం తెలియదు. ఆత్మ దేనినీ చంపలేదు. దేనిచేతా చంపబడదు. ఇది ఎట్టి వికారము లేనిది.

**20.** న జాయతే మ్రియతే వా కదా చిత్
నాయం భూత్వా భవితా వా న భూయః।
అజో నిత్య శ్శాశ్వతోఽయం పురాణః
న హన్యతే హన్యమానే శరీరే॥

ఈ ఆత్మ పుట్టుట లేదు. మరణించుట లేదు. పూర్వకాలంలో ఉండకుండగా, తరువాత కాలంలో ఉండుటకే జన్మ అని పేరు. పూర్వకాలంలో ఉండి, తరువాత కాలంలో లేకపోవుటకు మరణము అని పేరు. ఆత్మకు ఈ రెండింటిలో ఏ ఒక్కటీ లేదు. అనగా ఆత్మకు జననము లేదు, మరణము లేదు, వృద్ధి లేదు, క్షయము లేదు. శరీరము నశించినా, ఆత్మ నశించదు.

**21.** **వేదావినాశినం నిత్యం య ఏనమజ మవ్యయమ్।**
**కథం స పురుషః పార్థ! కం ఘాతయతి హంతి కమ్।।**

పార్థా! ఈ ఆత్మను అవినాశి అని, నిత్యమని, అజం అంటే పుట్టుక లేనిదని, అవ్యయమని తెలుసుకొనిన వ్యక్తి ఎవరిని ఎలా చంపుతాడు? ఎవరిని ఎలా చంపిస్తాడు?

**22.** **వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి।**
**తథా శరీరాణి విహాయ జీర్ణాని అన్యాని సంయాతి నవాని దేహీ।।**

మానవుడు చిరిగిన వస్త్రములను విడిచిపెట్టి, కొత్త వస్త్రములను ధరించినట్లుగా జీవాత్మ కూడా జీర్ణించిన శరీరములను విడిచిపెట్టి నూతన శరీరాలను స్వీకరిస్తాడు. కర్మలను అనుభవించుటయే శరీరముయొక్క ధర్మము కాబట్టి నీవు దుఃఖించవలసిన అవసరము లేదు.

**23.** **నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః।**
**న చైనం క్లేదయంత్యాపః న శోషయతి మారుతః।।**

ఎట్టి ఆయుధమైనా, ఈ ఆత్మను ఛేదించ లేదు. అగ్ని దహించ లేదు. నీరు తడప లేదు. గాలి ఎగురగొట్ట లేదు.

**24.** **అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయం అక్లేద్యోఽశోష్య ఏవ చ।**
**నిత్య స్సర్వగత స్థాణుః అచలోఽయం సనాతనః।।**

ఈ ఆత్మ ఛేదించుటకు శక్యము కానిది. తడుపుటకు శక్యం కానిది. దహించి వేయుటకు శక్యము కానిది. ఎండగొట్టుటకు శక్యము కానిది. ఇది నిత్యమైనది. సర్వవ్యాపి. స్థిరము. అచలము. సనాతనమైనది.

**25.** **అవ్యక్తోఽయమచింత్యోఽయం అవికార్యోఽయముచ్యతే।**
**తస్మాదేవం విదిత్వైనం నానుశోచితుమర్హసి।।**

ఈ ఆత్మ అవ్యక్తము, అచింత్యము, అవికారి అని శాస్త్రములు చెపుతున్నాయి. అందువలన నీవు ఆత్మ స్వరూపాన్ని తెలుసుకొని దుఃఖమును విడిచిపెట్టు.

**26.** **అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్।**
**తథాఽపి త్వం మహాబాహో! నైవం శోచితుమర్హసి।।**

శరీరము పుట్టినప్పుడే ఈ ఆత్మ పుట్టుచున్నదని, శరీరము నశించినప్పుడే ఈ ఆత్మ నశించుచున్నదని, నీవు భావించినప్పటికీ, ఈ శరీరము కొరకై నీవు దుఃఖించవలసిన అవసరము లేదు.

**27.** **జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ।**
**తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి।।**

ఎందువలననగా, పుట్టినవారికి మరణం నిత్యం. మరణించినవారు తాము చేసిన కర్మఫలమును అనుసరించి తిరిగి జన్మించుట సత్యమే. కావున తప్పించుటకు శక్యము కాని ఈ విషయమును గురించి నీవు దుఃఖించుట తగదు.

**28.** **అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత!**
**అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా।।**

అర్జునా! జీవుల శరీరములు ఉత్పత్తికి పూర్వము అవ్యక్తములు. వర్తమాన కాలంలో మాత్రమే వ్యక్తములు. అనగా పైకి కనిపిస్తాయి. మరణించిన తరువాత కూడా అవ్యక్తములే. దీనికి దుఃఖించుట ఎందుకు? అనగా జ్ఞానులకు జగత్తు అంతా స్వప్నము వలె కనిపిస్తుంది.

**29.** **ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనం ఆశ్చర్యవద్వదతి తథైవ చాన్యః।**
**ఆశ్చర్య వచ్చైనమన్యశ్శృణోతి శ్రుత్వాఽప్యేనం వేద న చైవ కశ్చిత్॥**

ఒకడు ఈ ఆత్మను ఆశ్చర్యమైనదానినిగా చూస్తాడు. మరియొకడు విస్మయముతో చూస్తాడు. మరియొకడు విస్మయముతో వర్ణిస్తాడు. మరియొకడు వింటాడు. మరొకడెవడో దానిని చూసి, చెప్పి, విని, సత్యమును తెలుసుకోలేకపోతున్నాడు.

మరొక అర్థము-

ఈ ఆత్మను దర్శించువాడే ఒక ఆశ్చర్యము. అనగా దుర్లభుడు. ఈ ఆత్మను గురించి చెప్పేవారు, వినేవారు కూడా దుర్లభులే. ఈ ఆత్మ గురించి చెప్పినా, వినినా, అందరికీ ఆత్మజ్ఞానము లభించదు. కావున ఆత్మజ్ఞానము దుర్లభము.

**30.** **దేహీ నిత్యమవధ్యోఽయం దేహే సర్వస్య భారత!।**
**తస్మాత్ సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి॥**

అర్జునా! అన్ని ప్రాణులయందు దేహములతో ప్రకాశిస్తున్న ఈ ఆత్మను ఎవడూ చంపలేడు. కావున ప్రాణులయొక్క దేహనాశములను గురించి నీకు దుఃఖించుట తగదు.

**31.** **స్వధర్మమపి చావేక్ష్య న వికంపితు మర్హసి।**
**ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే॥**



స్వధర్మాన్ని బట్టి చూస్తే, నీకు మనస్సు చలించుట తగదు. ఆత్మ అవినాశి. అనగా అది దానియొక్క ధర్మము. యుద్ధము క్షాత్రధర్మము. ధర్మయుద్ధము కంటే క్షత్రియునికి మరొక ధర్మకార్యము లేదు కదా!

**32.** **యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వార మపావృతమ్।**
**సుఖినః క్షత్రియాః పార్థ! లభంతే యుద్ధమీదృశమ్॥**

పార్థా! అనాయాసంగా లభించునది, స్వర్గద్వారమును తెరిచి యుంచునదైన యుద్ధము అదృష్టవంతులైన క్షత్రియులకు మాత్రమే లభిస్తుంది.

**33.** **అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి।**
**తతస్స్వధర్మం కీర్తిం చ హిత్వా పాప మవాప్స్యసి॥**

అయినా నీవు యుద్ధము చేయుటకు తిరస్కరించినచో, స్వధర్మ ఫలమును, కీర్తినీ పోగొట్టుకొని స్వధర్మత్యాగమనే పాపమును కూడా సంపాదించినవాడవు అవుతావు.

**34.** **అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తేఽవ్యయామ్।**
**సంభావితస్య చాకీర్తిః మరణాదతిరిచ్యతే॥**

అంతేకాదు, నీయొక్క అపజయాన్ని చూచి, జనులందరూ చాలాకాలం నిన్ను ద్వేషిస్తారు. సమస్త ప్రజలచేత కీర్తించబడుతున్న నీకు అపకీర్తి మృత్యువు కంటే దుఃఖం కదా!

**35.** **భయాద్రణాదుపరతం మంస్యంతే త్వాం మహారథాః।**
**యేషాం చ త్వం బహుమతః భూత్వా యాస్యసి లాఘవమ్॥**

మహారథులైన కర్ణాదులు నీవు యుద్ధము నుండి భయపడి పారిపోయావని అనుకొంటారు. అందువలన ఎవరైతే నిన్ను ఇంతవరకూ గౌరవించారో, వారందరిచేతా నీవు అవమానించబడతావు.

**36.** అవాచ్యవాదాంశ్చ బహూన్ వదిష్యంతి తవాహితాః।
నిందంతస్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్?।।

నీయొక్క శత్రువులు, నీ సామర్థ్యాన్ని నిందిస్తారు. అనరాని మాటలను అంటారు. ఇంతకంటే నీకు దుఃఖకరమైనది ఏముంది?

**37.** హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్।
తస్మాదుత్తిష్ఠ కౌంతేయ! యుద్ధాయ కృతనిశ్చయః।।

అర్జునా! ఈ రెండింటిలో ఏది మంచిదో తెలియదు అని అన్నావు కదా! యుద్ధమునందు చనిపోతే స్వర్గాన్ని పొందుతావు. జయిస్తే రాజ్యభోగములను అనుభవిస్తావు. రెండూ కూడా నీకు మంచివే. కావున యుద్ధం చెయ్యి.

**38.** సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ।
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి।।

యుద్ధము క్షత్రియ ధర్మము అని తెలుసుకో. సుఖదుఃఖములను, లాభనష్టములను, జయాపజయములను, సమానముగా స్వీకరించి, యుద్ధసన్నద్ధుడవు కమ్ము. ఇలా చేస్తే నిన్ను పాపము దరిజేరదు.

**39.** ఏషా తేఽభిహితా సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాం శృణు।
బుద్ధ్యా యుక్తో యయా పార్థ! కర్మబంధం ప్రహాస్యసి।।

పార్థా! ఇంతవరకు నీకు సాంఖ్యము అనబడే ఆత్మ తత్త్వము ఉపదేశించ బడింది. ఇట్టి ఆత్మతత్త్వమునకు సంబంధించిన అపరోక్ష జ్ఞానము నీకు కలగకపోయినచో, చిత్తశుద్ధి ద్వారా దానిని సంపాదించుటకై నీకు కర్మయోగాన్ని ఉపదేశిస్తాను. జాగ్రత్తగా విను. నిష్కామ కర్మయోగ విషయమైన ఈ జ్ఞానము లభిస్తే నీవు కర్మబంధనముల నుండి విముక్తుడవు అవుతావు.

**40.** నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే।
స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్।।

మోక్షమార్గమైన ఈ నిష్కామ కర్మయోగములో ఎటువంటి ప్రయత్నమూ విఫలము కాదు. ఇది భగవంతుడి ఉద్దేశించి చేయబడుటచే సత్త్వ, రజస్తమోగుణములకు సంబంధించిన పాపములు కలుగవు. ఈ నిష్కామ కర్మయోగము కొద్దిగా ఆచరించినా జనన మరణ రూపమైన సంసార దుఃఖము నుండి జీవుడు రక్షించబడతాడు.

**41.** వ్యవసాయాత్మికా బుద్ధిః ఏకేహ కురునందన!।
బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్।।

కురునందనా! ఈశ్వర ఆరాధనా రూపమైన నిష్కామ కర్మయోగములో నిశ్చయరూపమైన బుద్ధి ఏకనిష్ఠ అవుతుంది. చంచల చిత్తుల బుద్ధులు, అనేక శాఖలుగా విభజించ బడుతున్నాయి. అనంత ముఖములతో కనిపిస్తున్నాయి.

**42.** యామిమాం పుష్పితాం వాచం ప్రవదంత్యవిపశ్చితః।
వేదవాదరతాః పార్థ! నాన్యదస్తీతి వాదినః।।

**43.** కామాత్మాన స్స్వర్గపరాః జన్మకర్మఫలప్రదామ్।
క్రియావిశేషబహులాం భోగైశ్వర్యగతిం ప్రతి।।

**44.** భోగైశ్వర్యప్రసక్తానాం తయాపహృత చేతసామ్।
వ్యవసాయాత్మికా బుద్ధిః సమాధౌ న విధీయతే।।

పార్థా! అవివేకులైన వారు వేదము చెప్పిన కర్మలను ప్రశంసించుటలో ఎక్కువగా ఇష్టపడుతున్నారు. స్వర్గాది ఫలములకు కారణమైన యజ్ఞయాగాది కర్మలు కాకుండగా, మరియొకటి ఏదీ లేదని వారి ఉద్దేశ్యము. వారు

స్వర్గాన్ని కోరుకొనే మనస్తత్వము కలవారు. జన్మము అను ఫలమును ఇచ్చేవి, భోగైశ్వర్యములను ఇచ్చునవి అయిన క్రియా కలాపములను వారు మెచ్చుకొంటారు. ఎవరియొక్క మనస్సు అయితే ఇట్టి మనోహర వాక్యముల యందు లగ్నమగుచున్నదో, భోగైశ్వర్యములను ఆసక్తితో అనుభవించుచున్నదో, వారి అంతఃకరణములో నిశ్చయాత్మకమైన బుద్ధి ఎన్నటికీ స్థిరముగా ఉండదు.

**45.** త్రైగుణ్యవిషయా వేదాః నిస్త్రైగుణ్యో భవార్జున!!
నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థః నిర్యోగక్షేమ ఆత్మవాన్।।

అర్జునా! కర్మకాండాత్మకమైన వేదము, త్రిగుణాత్మకము. సకామ విషయకము. నీవు నిష్కాముడవై కర్మలను ఆచరించు. ద్వంద్వరహితుడివిగా ఉండు. సత్త్వ గుణమును కలిగి ఉండు. యోగక్షేమములను విడిచిపెట్టి ఆత్మజ్ఞుడవు కమ్ము.

**46.** యావానర్థ ఉదపానే సర్వత సంప్లుతోదకే।
తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః।।

అంతటా నీరు నిండి ఉండగా, తక్కువ నీరు గల చెఱువులు, బావులు, ఎంత ప్రయోజనమును ఇచ్చునో, బ్రహ్మనిష్ఠుడు, జ్ఞాని అయిన వానికి సమస్త వేదములు అంతే ప్రయోజనాన్ని ఇస్తాయి.

**47.** కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన।
మా కర్మఫలహేతుర్భూః మాతే సంగోఽస్త్వకర్మణి।।

అర్జునా! కర్మ ఆచరణములో నీకు అధికారముంది. కర్మ ఫలాలపై నీకు ఆసక్తి ఉండకూడదు. కర్మఫల తృష్ణయే కర్మఫలములను ఉత్పన్నము చేస్తోంది. కావున కర్మఫలములకు కారణము కావద్దు. కర్మలను సకాముడవై ఆచరించవద్దు. కర్మత్యాగముపై నీకు ఆసక్తి కలుగకుండు గాక!

**48.** యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ!।
సిద్ధ్యసిద్ధ్యో స్సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే।।

కర్మఫలములపై ఆసక్తిని విడిచిపెట్టు. జ్ఞానకర్మల విషయంలో సమభావమును వహించు. యోగస్థుడవై కర్మలను ఆచరించు. సిద్ధి అసిద్ధులలో సమభావమును వహించుటయే యోగము అన్నారు.

**49.** దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ।
బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణాః ఫల హేతవః।।

నిష్కామ కర్మ కంటే కామ్యకర్మ చాలా అధమమైనది. కావున కామన లేనివాడై సమత్వబుద్ధిని ఆశ్రయించు. ఫలములను కోరి కర్మలను చేయువారు మూర్ఖులుగా గుర్తించబడుతున్నారు.

**50.** బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే।
తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్।।

నిష్కామకర్మయోగి స్వర్గనరకములకు కారణములైన పాపపుణ్యములను రెండింటినీ కూడా ఈ జీవితములోనే ఈశ్వర అనుగ్రహముగా స్వీకరించి విముక్తుడవుతాడు.

**51.** కర్మజం బుద్ధి యుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః।
జన్మబంధ వినిర్ముక్తాః పదం గచ్ఛంత్యనామయమ్।।

నిష్కామ కర్మయోగులైన జ్ఞానులు, కర్మల వలన కలుగు ఫలములను విడిచిపెట్టి, జన్మబంధముల నుండి విడిపోతారు. ఎట్టి ఉపద్రవములు లేని బ్రహ్మపదార్థమును నిశ్చయముగా పొందుచున్నారు.

**52.** యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితరిష్యతి।
తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ।।

నీ యొక్క బుద్ధి మోహ కాలుష్యమును అతిక్రమించినప్పుడు, నీవు వినదగినవి, వినినవి అయిన కర్మల ఫలవిషయములో వైరాగ్యాన్ని పొందుచున్నావు. ఈ రెండు కూడా నీ వద్ద నిష్ఫలములవుతాయి.

**53.** శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా।
సమాధావచలా బుద్ధిః తదా యోగమవాప్స్యసి।।

నానా విధములైన కర్మఫలములను గూర్చి నీయొక్క మనస్సు విక్షిప్తమౌతుంది. అది పరమాత్మయందు నిశ్చలము, స్థిరము అయినప్పుడు, నీవు తత్త్వజ్ఞానమును పొందుతావు.

**అర్జున ఉవాచ:**

**54.** స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ!।
స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్।।

అర్జునుడు పలికాడు- శ్రీకృష్ణా! సమాధిస్థితుడైన స్థితప్రజ్ఞుని లక్షణము లేమిటి? అతడేవిధముగా మాట్లాడుతాడు? ఏ విధముగా ఉంటాడు? ఏ విధముగా వ్యవహరిస్తాడు?

శ్రీ భగవానువాచ-

**55.** ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ! మనోగతాన్।
ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే।।

శ్రీకృష్ణుడు పలికాడు- పార్థా! ఆత్మ చేత ఆత్మయందు తృప్తుడై మనస్సులోని కోర్కెలనన్నింటినీ, సంపూర్ణముగా త్యజించిన యోగి స్థితప్రజ్ఞుడు అని పిలువబడుచున్నాడు.

**56.** దుఃఖేష్వనుద్విగ్న మనాః సుఖేషు విగతస్పృహః।
వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే।।

దుఃఖములయందు ఉద్వేగమును పొందనివాడు, సుఖములలో నిస్పృహతను చూపించువాడు, అనురాగము, భయము, క్రోధము లేని మునిని స్థితప్రజ్ఞుడు అంటారు.

**57.** యస్సర్వత్రానభిస్నేహః తత్తత్ ప్రాప్య శుభాశుభమ్।
నాభినందతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా।।

ఎవరైతే అన్ని విషయములయందు మమతానురాగములు లేనివాడై ప్రియములు లభించినప్పుడు గానీ, అప్రియములు అనుభవించినప్పుడు గానీ సంతోషమును, దుఃఖమును పొందడో అతడే స్థితప్రజ్ఞుడు.

**58.** యదా సంహరతే చాయం కూర్మోఽంగానీవ సర్వశః।
ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా।।

తాబేలు తన యొక్క కాళ్లను, తలను, మిగిలిన అవయవములను లోపలకు ముడుచుకొని తనను తాను ఏవిధముగా రక్షించుకొంటుందో, అదే విధముగా శబ్దాది విషయముల నుండి ఇంద్రియములను మరలించుకొనిన జ్ఞాననిష్ఠుడైన యోగియే స్థితప్రజ్ఞుడు.

**59.** విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః।
రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే।।

ఇంద్రియముల ద్వారా విషయములను గ్రహించని యోగి నుండి విషయములు దూరంగా పారిపోతాయి. అతనికి విషయవాంఛ మాత్రం మిగులుతుంది. ఆత్మసాక్షాత్కారమైనప్పుడు, విషయవాంఛ కూడా పరమాత్మయందు లీనమైపోతుంది.

**60.** యతతో హ్యాపి కౌంతేయ! పురుషస్య విపశ్చితః।
ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః।।

కౌంతేయా! భయంకరములైన, విక్షేపకరములైన ఇంద్రియగణములు వివేకియైన పురుషుని యొక్క మనస్సును బలాత్కారముగా ఆకర్షిస్తున్నాయి.

**61.** తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః।
వశే హి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా।।

కావున యోగి ఇంద్రియములనన్నింటినీ నియమించి, సమాహితుడై ఆత్మస్థుడై ఉంటాడు. ఎవరికి ఏయే ఇంద్రియములు వశమవుతాయో, అతడికి ఆ ఇంద్రియములకు సంబంధించిన ఆత్మజ్ఞానము సుస్థిరమవుతుంది. అతడే స్థితప్రజ్ఞుడు. (ఇంతవరకూ బాహ్యేంద్రియ నిగ్రహం గురించి చెప్పబడింది.)

**62.** ధ్యాయతో విషయాన్ పుంసఃసంగస్తేషూపజాయతే।
సంగాత్ సంజాయతే కామః కామాత్ క్రోధోఽభిజాయతే।।

విషయవాంఛలను ఆలోచించుట చేత మనుష్యుడికి వాటిపై ఆసక్తి కలుగుతోంది. ఆసక్తి నుండి కామము, కామము నుండి క్రోధం కలుగుతున్నాయి.

**63.** క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతివిభ్రమః।
స్మృతిభ్రంశాద్బుద్ధినాశః బుద్ధినాశాత్ ప్రణశ్యతి।।

క్రోధమువలన అవివేకము, అవివేకము వలన స్మృతి నశించుట జరుగుతున్నాయి. స్మృతి నశించినవానికి సత్, అసత్ విచారణ తెలియదు. ఇట్టి విచారణ తెలియని మనుష్యుడు సంపూర్ణంగా నాశనమగుచున్నాడు. అనగా పురుషార్థములకు అయోగ్యుడగుచున్నాడు.

**64.** రాగద్వేష వియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్।
ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి।।

ఇంద్రియములను నిగ్రహించిన జీవుడు, ప్రియమైన వస్తువుల నుండి ఆసక్తిని, అప్రియమైన వస్తువుల నుండి ద్వేషమును రెండిటినీ విడిచిపెడతాడు. స్వాధీనములైన ఇంద్రియముల సహకారముతో జీవించుటకు కావలసిన విషయములను మాత్రమే గ్రహించి, నిర్మలుడై శాంతిని పొందుతాడు.

**65.** ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే।
ప్రసన్న చేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే।।

నిర్మలమైన చిత్తము కలవానికి దుఃఖములన్నీ నశిస్తాయి. నిర్మలచిత్తుని బుద్ధి శీఘ్రముగా ఆత్మస్వరూపములో నిశ్చలత్వమును పొందుతుంది.

**66.** నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా।
న చాభావయత శ్శాంతిః అశాంతస్య కుత స్సుఖమ్?।।

ఇంద్రియ నిగ్రహము లేనివానికి వివేకము కలుగదు. అవివేకికి, పరమార్థ విషయములపై ఇష్టము ఉండదు. పరమార్థ విషయ చింతన లేనివానికి శాంతి లభించదు. శాంతి లేనివానికి సుఖమెక్కడ నుండి వస్తుంది?

**67.** ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽనువిధీయతే।
తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావ మివాంభసి।।

నీటిపై వెళ్లుచున్న పడవను, గాలి ప్రక్క దోవను పట్టించినట్లుగా, ఆయా విషయముల వెంట పరిగెత్తు ఇంద్రియములలో మనస్సు దేనిని అనుసరిస్తుందో, అట్టి ఇంద్రియమే అతని వివేకమును నాశనము చేస్తుంది.

**68.** తస్మాద్యస్య మహాబాహో! నిగృహీతాని సర్వశః।
ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా।।

మహాబాహో! కావున ఎవరి ఇంద్రియములు శబ్దాది విషయముల నుండి మరలించబడుచున్నాయో అతని ప్రజ్ఞ ప్రతిష్ఠితమవుతుంది. అనగా అతడే స్థితప్రజ్ఞుడు.

**69.** యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ।
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః।।

జీవులందరికీ తెలియకపోవుట వలన ఏది రాత్రివలె కనిపించునో, అట్టి బ్రహ్మజ్ఞానమున స్థితప్రజ్ఞుడు బ్రహ్మదర్శనము చేస్తూ ఉంటాడు. ఏ అజ్ఞానపు రాత్రిలో జీవులందరూ మేల్కొని ఉంటారో, సంసారానుభూతిని పొందుతూ ఉంటారో, అది స్థితప్రజ్ఞునికి రాత్రి వంటిది. అనగా అతడు సంసారమును చూడడు.

మరొక భావము- అందరూ నిద్రించే రాత్రి సమయములో యోగి మేల్కొని ధ్యానము చేస్తూ ఉంటాడు. అందరూ మేల్కొని ఉండు పగటి సమయమున యోగి నిద్ర పోతాడు. అనగా సంసార విముఖునిగా ఉంటాడు.

**70.** ఆపూర్యమాణ మచల ప్రతిష్ఠం
సముద్రమాపః ప్రవిశంతి యద్వత్।
తద్వత్ కామా యం ప్రవిశంతి సర్వే
స శాంతిమాప్నోతి న కామకామీ।।

సముద్రములో క్రొత్తగా కొన్ని నదీప్రవాహములు ప్రవేశించినా, అది ఏవిధముగా అభివృద్ధి చెందదో, అదే విధముగా ప్రారబ్ధవశము వలన అనివార్యములైన విషయవాంఛలు ఎవని యందు ప్రవేశించి, విలీనమవుతున్నాయో, అతడే శాంతిని పొందుచున్నాడు. అతని మనస్సునకు ఎట్టి బాధలూ ఉండవు. కానీ విషయములను కోరువానికి ఎల్లవేళలా అశాంతియే!

**71.** విహాయ కామాన్ యస్సర్వాన్ పుమాంశ్చరతి నిస్స్పృహః।
నిర్మమో నిరహంకారః స శాంతి మధిగచ్ఛతి।।

ఎవరైతే కోర్కెలనన్నింటినీ విడిచి నేను, నాది అనే భావమును విడిచి, జీవితముపై స్పృహ లేనివాడై జీవిస్తాడో, అతడు సంసారదుఃఖముల నుండి విడివడి శాంతిస్థితిని పొందుతాడు.

**72.** ఏషా బ్రాహ్మీస్థితిః పార్థ! నైనాం ప్రాప్య విముహ్యతి।
స్థిత్వాఽస్యామంతకాలేఽపి బ్రహ్మనిర్వాణ మృచ్ఛతి।।

అర్జునా! దీనిని బ్రాహ్మీస్థితి అంటారు. అత్యున్నతమైన ఇట్టి స్థితిని పొందినవారు మోహగ్రస్తులు కారు. మరణసమయములోనైనా ఇట్టి స్థితిని పొందినచో అతడు మోక్షమును పొందుతాడు.

**ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే సాంఖ్యయోగో నామ ద్వితీయోఽధ్యాయః**

## అథ తృతీయోఽధ్యాయః
## కర్మయోగః

**అర్జున ఉవాచ:**

**1. జ్యాయసీ చేత్ కర్మణస్తే మతా బుద్ధిర్జనార్దన!।**
**తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ!।।**

అర్జునుడు పలికాడు- జనార్దనా! కర్మకంటే జ్ఞానమే శ్రేష్ఠమని నీ యొక్క అభిప్రాయమైతే, నన్ను ఈ హింసాత్మకమైన కర్మను చేయమని ఎందుకు చెపుతున్నావు?

**2. వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే।**
**తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోఽహమాప్నుయామ్।।**

నీవు సందేహకారణం వలె అనిపిస్తున్న వాక్యాలతో నా మనస్సును భ్రాంతిలో పడునట్లు చేస్తున్నావు. అందుచేత ఈ రెండింటిలో నేను దేని చేత శ్రేయస్సును పొందగలనో, నీవే నిశ్చయముగా చెప్పు?

**శ్రీభగవానువాచ:**

**3. లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయాఽనఘ!।**
**జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్।।**

భగవంతుడు పలికాడు - పాపం లేనివాడా! సృష్టియొక్క ప్రారంభంలో ఈ జగత్తులో జ్ఞానాధికారులైనవారికి జ్ఞానయోగమును ఉపదేశించాను. నిష్కామకర్మయోగులైనవారికి, కర్మయోగమును రెండు రకములైన నిష్ఠలతో వేదాలలో చెప్పి ఉన్నాను. ఆ రెండూ ఒక దానిని మరొకటి ప్రోత్సహించుతాయి. వేరు వేరు కావు. చిత్తశుద్ధి పొందనివారికి కర్మయోగం కావాలి. చిత్తశుద్ధి పొంది జ్ఞానభూమికలను అధిరోహించువారికి జ్ఞానయోగం కావాలి. అందువల్ల ఈ రెండింటిలో ఏది గొప్పది? అనే ప్రశ్నకు అవకాశమే లేదు.

**4. న కర్మణామనారంభాత్ నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే।**
**న చ సన్న్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి।।**

పురుషుడు కర్మలను ఆచరించకుండగా, నైష్కర్మ్యమును అనగా జ్ఞానమును పొందలేడు. చిత్తశుద్ధి, జ్ఞానశుద్ధి లేని కర్మత్యాగముతో మోక్షము సిద్ధించదు.

**5. న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్।**
**కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః ।।**

కర్మత్యాగమంటే అనాసక్తి. ఫలత్యాగము. కర్మలను చేయించుట అసాధ్యం. కర్మ చేయకుండగా ఎవడూ ఒక్క క్షణమైనా ఉండ లేడు. అందరూ మాయ నుండి పుట్టిన సత్త్వము, రజస్సు, తమస్సు అను గుణములకు లోబడి తమ కర్మలను చేస్తూ, వారే బాధ్యులవుతున్నారు.

**6. కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్।**
**ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచార స్స ఉచ్యతే।।**

ఏ మూఢుడూ కూడా కేవలం కర్మేంద్రియములను నిగ్రహించి, మనస్సుతో ఇంద్రియ విషయవాంఛలను స్మరిస్తూ ఉంటాడో, అతనిని కపటి అని దూషిస్తారు.

**7. యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతేఽర్జున!।**
**కర్మేంద్రియైః కర్మయోగం అసక్తః స విశిష్యతే।।**

కానీ, ఎవరైతే వివేకముతో కూడిన మనస్సుతో జ్ఞానేంద్రియములను నియమించి, అనాసక్తుడై కర్మేంద్రియములతో కర్మలను ఆచరించుచున్నాడో, అతడు చిత్తశుద్ధిని పొంది జ్ఞానాన్ని పొందగలుగుచున్నాడు.

**8.** నియతం కురు కర్మ త్వం కర్మ జ్యాయో హ్యకర్మణః।
శరీరయాత్రాఽపి చ తే న ప్రసిద్ధ్యేదకర్మణః।।

కావున నీవు శాస్త్రప్రోక్తమైన నిత్యకర్మలను చెయ్యి. కర్మను చేయకుండా ఉండుట అంటే, కర్మ చేయుటయే శ్రేష్ఠం. కర్మ హీనుడవైతే నీకు దైనందిన జీవితము కూడా గడువదు.

**9.** యజ్ఞార్థాత్ కర్మణోఽన్యత్ర లోకోఽయం కర్మబంధనః।
తదర్థం కర్మ కౌంతేయ! ముక్తసంగ స్సమాచర।।

ఈశ్వరుని యొక్క ప్రీతి కొరకై అనుష్ఠించబడిన కర్మలచేత కాకుండగా, మిగిలిన కర్మలచేత ఈ లోకము బంధించబడుతోంది. కావున నీవు భగవంతుని ఉద్దేశించి, అనాసక్తుడవై నీ కర్మలను నీవు ఆచరించు.

**10.** సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః।
అనేన ప్రసవిష్యధ్వ ం ఏష వోఽస్త్విష్టకామధుక్।।

సృష్టి యొక్క ప్రారంభదశలో బ్రహ్మదేవుడు యజ్ఞములతో పాటు, జీవులను కూడా సృష్టించి, ఈ విధంగా ఆదేశించాడు. ఈ యజ్ఞాలను మీరు సర్వదా ఆచరించండి. సర్వసమృద్ధినీ పొందుతారు. ఈ యజ్ఞము మీయొక్క కోర్కెలను తీర్చు కామధేనువు వంటిదవుతుంది.

**11.** దేవాన్ భావయతానేన తే దేవా భావయంతు వః।
పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ।।

ఈ యజ్ఞములలో హవిర్భాగములను ఇచ్చి, దేవతలను సంతృప్తి పరచండి. వారు మిమ్ములను వర్షధారలతో అనుగ్రహించుతారు ఈ విధముగా మీరు, దేవతలు, పరస్పరము ప్రేమతో గొప్పదైన మోక్షమును పొందగలరు.

**12.** ఇష్టాన్ భోగాన్ హి వో దేవాః దాస్యంతే యజ్ఞభావితాః।
తైర్దత్తానప్రదాయైభ్యః యో భుంక్తే స్తేన ఏవ సః।।

యజ్ఞయాగములతో ఆరాధించబడిన దేవతలు, మీరు కోరిన భోగ భాగ్యములను ప్రసాదిస్తారు. కనుక దేవతలచేత ఈయబడిన వస్తు సముదాయమును తిరిగి దేవతలకు సమర్పించకుండగా, అనుభవించువాడు పాపాత్ముడు అని శాస్త్రములు చెపుతున్నాయి.

**13.** యజ్ఞశిష్టాశినః సంతః ముచ్యంతే సర్వకిల్బిషైః।
భుంజతే తే త్వఘం పాపాః యే పచంత్యాత్మకారణాత్।।

ఏ సత్పురుషులైతే యజ్ఞశేషమును భుజించుచున్నారో, వారు సర్వవిధ పాపముల నుండి విముక్తులగుచున్నారు. కేవలం తమకొరకే వండుకొనేవారు (వైశ్వ దేవాదుల కోసము కాక) పాపమును భుజించుచున్నారు.

**14.** అన్నా ద్భవంతి భూతాని పర్జన్యాదన్నసంభవః।
యజ్ఞాద్భవతి పర్జన్యః యజ్ఞః కర్మసముద్భవః।।

అన్నము నుండి ప్రాణులయొక్క శరీరము పుడుతోంది. అన్నము మేఘము నుండి కలుగుతోంది. మేఘాలు యజ్ఞం వల్ల వస్తున్నాయి. యజ్ఞాలు, హోమాది కర్మలవలన ఉత్పన్నమౌతున్నాయి.

**15.** కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవమ్।
తస్మాత్ సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్।।

కర్మ వేదముల నుండి వచ్చుచున్నదని గ్రహించు. వేదము పరమాత్మ యొక్క స్వరూపమే. కనుక సర్వప్రకాశము, సర్వవ్యాపి అయిన వేదము యజ్ఞము నందు ప్రతిష్ఠితమై ఉంది.

**16.** ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః।
అఘాయురింద్రియారామః మోఘం పార్థ! స జీవతి॥

పార్థా! ఎవడైతే ఈ విధముగా ఈశ్వరుని చేత ప్రవర్తించబడినవాడై కర్మచక్రమును అనుసరించకుండగా, ఇంద్రియలోలుడై పాపిగా, జీవించుచున్నాడో, అతని జీవితము వ్యర్థము.

**17.** యస్త్వాత్మరతిరేవ స్యాత్ ఆత్మతృప్తశ్చ మానవః।
ఆత్మన్యేవ చ సంతుష్టః తస్య కార్యం న విద్యతే॥

ఈ కర్మలన్నీ అజ్ఞానికి చిత్తశుద్ధి ఏర్పరుచుటకు చెప్పబడ్డాయి. కానీ ఎవడైతే ఆత్మయందే ప్రీతిని, ఆత్మ యందే తృప్తిని, ఆత్మ యందే సంతుష్టిని పొందుచున్నాడో అతడికి ఏవిధమైన కర్తవ్యము లేదు.

**18.** నైవ తస్య కృతేనార్థః నాకృతేనేహ కశ్చన।
న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః॥

ఈ జగత్తులో ఆత్మజ్ఞానము పొందుటకు కర్మానుష్ఠానమువలన ఎట్టి ప్రయోజనము లేదు. కర్మ చేయకపోవటము వలన ఎట్టి దోషము లేదు. బ్రహ్మ మొదలు స్తంభము వరకు ఏ ప్రాణితోనూ అతడికి సంబంధము లేదు.

**19.** తస్మాదసక్తః సతతం కార్యం కర్మ సమాచర।
అసక్తో హ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః॥

ఆత్మజ్ఞానము గల జ్ఞానికి కర్మలతో పని లేదు. ఇతరులకు మాత్రము కర్మలతో పని ఉంది. అర్జునా! నీవు జ్ఞానివి కావు. కనుక అనాసక్తుడవై ఎల్లప్పుడూ నీయొక్క కర్తవ్యకర్మను ఆచరించు. కామన లేని కర్మ చేయు మనుష్యుడు నిశ్చయముగా మోక్షమును పొందుచున్నాడు.

**20.** కర్మణైవ హి సంసిద్ధిం ఆస్థితా జనకాదయః।
లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి॥

జనకుడు మొదలైనవారు కర్మలచేతనే చిత్తశుద్ధిని పొంది, అనంతరము ఆత్మజ్ఞానమును పొందారు. ఒకవేళ నీవు ఆత్మజ్ఞుడవే అయినా, ప్రజలను స్వధర్మనిరతులుగా చేయుటకై కర్మలను ఆచరించుట ఉచితము.

**21.** యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః।
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే॥

శ్రేష్ఠులైన వ్యక్తులయొక్క ఆచరణను సామాన్య వ్యక్తులు అనుసరిస్తారు. వారు దేనిని ప్రామాణిక బుద్ధితో అనుష్ఠిస్తారో, సాధారణ వ్యక్తులు కూడా దానినే ప్రమాణంగా స్వీకరిస్తారు.

**22.** న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన।
నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి॥

ఈ విషయంలో ఉదాహరణగా నన్నే స్వీకరించు. పార్థా! ఈ మూడు లోకములయందు నాకు ఏవిధమైన కర్తవ్యము లేదు. నేను పొందినదీ లేదు. పొందవలసినదీ లేదు. ఐనా లోకములో ఒక ఆదర్శమును నిలబెట్టుటకు నేను సర్వదా నా కర్మలను ఆచరించుచున్నాను కదా!

**23.** యది హ్యహం న వర్తేయ జాతు కర్మణ్యతంద్రితః।
మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ! సర్వశః॥

నేనెప్పుడైనా అప్రమత్తుడనై కర్మలను చేయకుండా ఉండినచో, జనులు కూడా నా మార్గమునే అనుసరిస్తారు.

**24.** ఉత్సీదేయురిమే లోకాః న కుర్యాం కర్మ చేదహమ్।
సంకరస్య చ కర్తా స్యాం ఉపహన్యా మిమాః ప్రజాః॥

నేను కర్మలను చేయకున్నచో, లోకస్థితికి అనుకూలమైన కర్మలు లేకపోవుటచే, ఈ ప్రజలందరూ భ్రష్టులై పోతారు. వర్ణ సంకరమునకు, ప్రజల వినాశమునకు అప్పుడు నేనే కారణమైనవాడిని అవుతాను.

**25.** **సక్తాః కర్మణ్య విద్వాంసః యథా కుర్వంతి భారత!।**
**కుర్యాద్విద్వాంస్తథాఽసక్తః చికీర్షుర్లోక సంగ్రహమ్॥**

అర్జునా! అజ్ఞులు ఏ విధముగా కర్మలను ఆసక్తులై ఆచరిస్తారో, అదే విధముగా జ్ఞానులు లోక శిక్షణార్థమై అనాసక్తులై కర్మలను చేస్తారు.

**26.** **న బుద్ధిభేదం జనయేత్ అజ్ఞానాం కర్మసంగినామ్।**
**జోషయేత్ సర్వకర్మాణి విద్వాన్ యుక్త స్సమాచరన్॥**

అవివేకులైన కర్మాసక్తుల బుద్ధిని చలింప చెయ్యకూడదు. అప్రమత్తుడై కర్మలను ఆచరిస్తూ, వారిచేత కూడా కర్మలను చెయ్యించాలి. లేనిచో వారి బుద్ధి చంచలమై కర్మహీనులవుతారు. అందువల్ల చిత్తశుద్ధి కలుగదు. జ్ఞానం లభించదు. ఉభయభ్రష్టులవుతారు.

**27.** **ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః।**
**అహంకారవిమూఢాత్మా కర్తాఽహమితి మన్యతే॥**

ప్రకృతికి చెందిన గుణత్రయమే శరీరముగా పరిణమించి లౌకిక వైదిక కర్మలను ఆచరింప చేస్తోంది. కానీ అహంకార విమూఢచిత్తుడు కర్మలను చేయువాడను నేనే అని భావిస్తాడు.

**28.** **తత్త్వవిత్తు మహాబాహో! గుణకర్మవిభాగయోః।**
**గుణా గుణేషు వర్తంతే ఇతి మత్వా న సజ్జతే॥**

అర్జునా! గుణకర్మలయొక్క రీతిని తెలిసిన తత్త్వజ్ఞుడు సత్త్వగుణ పరిణామములైన చక్షురాది ఇంద్రియాలను, తమోగుణపరిణామములైన రూపరసాది విషయములతో ప్రవర్తించునట్లు చేయగలుగుచున్నాడు. కానీ ఆత్మకు సంగమము లేదు అని గ్రహించినవాడై కర్తృత్వాభిమానమును విడిచిపెడుతున్నాడు.

**29.** **ప్రకృతేర్గుణసమ్మూఢాః సజ్జంతే గుణకర్మసు।**
**తానకృత్స్నవిదో మందాన్ కృత్స్నవిన్న విచాలయేత్॥**

ప్రకృతి గుణములచేత భ్రాంతి పడినవారు, ఇంద్రియములయందు, ఇంద్రియ వ్యాపారముల యందు ఆసక్తులవుతున్నారు. సర్వజ్ఞుడైన ఆత్మవేత్త అల్పజ్ఞులైన మందబుద్ధులను కంగారు పెట్టకూడదు.

**30.** **మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా।**
**నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః॥**

కావున, వివేకబుద్ధితో కూడినవాడవై నీ యొక్క సమస్త కర్మలను, నాకు అర్పించి, నిష్కాముడవై, ఆసక్తి రహితుడవై, శోకము లేనివాడవై యుద్ధము చెయ్యి.

**31.** **యే మే మతమిదం నిత్యం అనుతిష్ఠంతి మానవాః।**
**శ్రద్ధావంతోఽనసూయంతః ముచ్యంతే తేఽపి కర్మభిః॥**

ఏ మానవులు శ్రద్ధావంతులై, అసూయ లేనివారై, నా యొక్క మతమును అనుసరించెదరో, అట్టి వారు కూడా కర్తృత్వము అను బంధము నుండి విముక్తులవుతారు.

**32.** **యే త్వేతదభ్యసూయంతః నానుతిష్ఠంతి మే మతమ్।**
**సర్వజ్ఞానవిమూఢాంస్తాన్ విద్ధి నష్టానచేతసః॥**

నాయొక్క సిద్ధాంతమును నిందిస్తూ, అనుష్ఠించని వివేకహీనులు జ్ఞానం లేనివారై, మూఢులై, పరమభ్రష్టులై ఉండెదరని తెలుసుకో.

**33.** సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేర్ జ్ఞానవానపి।
ప్రకృతిం యాంతి భూతాని నిగ్రహః కిం కరిష్యతి॥

జ్ఞాని కూడా తన యొక్క ప్రకృతిని అనుసరించి ప్రవర్తిస్తున్నాడు కదా! ఇక అజ్ఞుల విషయమై ఏమని చెప్పగలము? జనులందరూ ప్రకృతిని అనుసరించి, తమయొక్క పనులను చేయుచున్నారు కదా!

ఇంద్రియ నిగ్రహము ఏమి చెయ్య గలదు? ఇంద్రియనిగ్రహము కంటే ప్రకృతి శక్తియే బలమైనది కదా! నేను కానీ, మరెవరైనా కానీ శాసించినా, నిషేధించినా, ఇచట ఫలమేమి ఉంటుంది?

**34.** ఇంద్రియస్యేంద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ।
తయోర్న వశమాగచ్ఛేత్ తౌ హ్యస్య పరిపన్థినౌ॥

ఇంద్రియములన్నీ అనుకూలమైన విషయములో ఆసక్తి చూపిస్తూ, ప్రతికూలమైన విషయములో ద్వేషమును చూపిస్తూ ఉంటాయి. అదే విధంగా వారియొక్క ప్రవృత్తి కూడా ఉంటుంది. కావున జ్ఞాని కావలసినవాడు ఇంద్రియములకు వశుడు కాకూడదు. ఈ రెండూ శ్రేయోమార్గమునకు విఘ్నముల వంటివి.

**35.** శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్।
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః॥

దోషముతో కూడినదైనా, నీ యొక్క ధర్మమును నువ్వు చక్కగా ఆచరించు. చక్కగా ఆచరించబడిన పరధర్మము కంటే దోషంతో ఆచరించిన నీయొక్క ధర్మమే గొప్పది. వర్ణాశ్రమములతో కూడిన స్వధర్మ సాధనములతో కలిగిన మరణము కూడా శుభప్రదమే. పరధర్మానుష్ఠానము ఆపదలకు మూలహేతువు.

**అర్జున ఉవాచ:**

**36.** అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః।
అనిచ్ఛన్నపి వార్ష్ణేయ! బలాదివ నియోజితః॥

అర్జునుడిలా అడిగాడు - కృష్ణా! మనుష్యుడు తనకు ఇష్టం లేకున్నా ఎవరిచేతనో ప్రేరేపించబడినవాడి వలె బలాత్కారముగా పాపాచరణలో పడవేయబడుచున్నాడు కదా! ఆ విధముగా అతనిని ప్రేరేపించునదేది?

**శ్రీ భగవానువాచ:**

**37.** కామ ఏష క్రోధ ఏషః రజోగుణ సముద్భవః।
మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్॥

శ్రీకృష్ణుడిలా చెప్పాడు - ఇది రజోగుణము వల్ల కలిగి తృప్తి పరచుటకు సాధ్యం కాని భయంకరమైన కామము. మరి ఏ ఇతర కారణముల వలనైనా కామము తీరకపోయినచో అది క్రోధముగా మారిపోతుంది. ఈ జగత్తులో కామమే నీకు బలమైన శత్రువు.

**38.** ధూమేనావ్రియతే వహ్నిః యథాఽఽదర్శో మలేన చ।
యథోల్బేనావృతో గర్భః తథా తేనేదమావృతమ్॥

పొగ చేత నిప్పు, మురికి చేత అద్దము, మావి చేత గర్భస్థ పిండము, కప్పివేయబడినట్లుగా, కామము చేత వివేకరూపమైన బుద్ధి కప్పివేయబడుతోంది.

**39.** ఆవృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్యవైరిణా।
కామరూపేణ కౌంతేయ! దుష్పూరేణానలేన చ॥

కౌంతేయా! ఈ కామము జ్ఞానమునకు నిత్యశత్రువు. ఇది అగ్నివలె పూర్ణస్వభావము కలది. తృష్ణా రూపమైన ఈ కామముచేత వివేకబుద్ధి ఆవరించబడుతోంది.

**40.** ఇంద్రియాణి మనో బుద్ధిః అస్యాధిష్ఠాన ముచ్యతే।
ఏతైర్విమోహయత్యేషః జ్ఞానమావృత్య దేహినమ్॥

ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, కామమునకు ఆశ్రయములు అని చెప్పబడుచున్నాయి. వీటిచేత వివేకజ్ఞానమును ఆవృతము చేసి, కామము దేహాభిమాని అయిన జీవుడిని విభ్రాంతుని చేస్తోంది.

**41.** **తస్మాత్ త్వమింద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ!।**
**పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞాన విజ్ఞాన నాశనమ్।।**

కనుక అర్జునా! మొదట నీవు ఇంద్రియములను వశం చేసుకో. జ్ఞాన విజ్ఞానములను పాడు చేయు పాప స్వభావరూపమైన ఈ కామమును విడిచిపెట్టు.

**42.** **ఇంద్రియాణి పరాణ్యాహుః ఇంద్రియేభ్యః పరం మనః।**
**మనసస్తు పరా బుద్ధిః యో బుద్ధేః పరతస్తు సః।।**

స్థూలదేహము కంటే, ఇంద్రియములు శ్రేష్ఠమైనవి. ఇంద్రియములకంటే మనస్సు గొప్పది. మనస్సు కంటే నిశ్చయాత్మకమైన బుద్ధి చాలా గొప్పది. బుద్ధి కంటే వేరుగా ఉంటూ ద్రష్ట అయిన ఆత్మయే పరమాత్మ.

**43.** **ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మానమాత్మనా।**
**జహి శత్రుం మహాబాహో! కామరూపం దురాసదమ్।।**

ఈ విధముగా నిశ్చయాత్మకమైన బుద్ధితో మనస్సును సన్నద్ధము చేసుకొని బుద్ధి కంటే వేరుగా ఉన్నటువంటి ద్రష్ట అయిన ఆత్మను తెలుసుకొని, దుర్జయమైన కామము అను శత్రువును జయించు.

**ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మ విద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే కర్మయోగో నామ తృతీయోఽధ్యాయః**



## అథ చతుర్థోఽధ్యాయః
## జ్ఞానయోగః

**శ్రీ భగవానువాచ:**

**1.** **ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహ మవ్యయమ్।**
**వివస్వాన్ మనవే ప్రాహ మను రిక్ష్వాకవేఽబ్రవీత్।।**

శ్రీకృష్ణుడిలా చెప్పాడు- అవ్యయమైన ఈ యోగాన్ని నేను మొదట సూర్యుడికి చెప్పాను. సూర్యుడు తన కుమారుడైన మనువుకు ఉపదేశించాడు. మనువు తన కుమారుడైన ఇక్ష్వాకువుకు ఉపదేశించాడు.

**2.** **ఏవం పరంపరాప్రాప్తం ఇమం రాజర్షయో విదుః।**
**స కాలేనేహ మహతా యోగోనష్టః పరంతప!।।**

పరంపరగా వచ్చుచున్న ఈ యోగమును, రాజర్షులు బాగుగా తెలుసుకొన్నారు. కాలక్రమంలో ఈ జగత్తులో ఈ యోగము వినష్టమౌతోంది.

**3.** **స ఏవాయం మయా తేఽద్యయోగః ప్రోక్తః పురాతనః।**
**భక్తోఽసి మే సఖా చేతి రహస్యం హ్యేతదుత్తమమ్।।**

నీవు నా భక్తుడవు, సఖుడవు, ఉత్తముడవు కాబట్టి రహస్యమైన ఈ ప్రాచీన యోగమును నేను నీకు తెలియజేస్తున్నాను.

**అర్జున ఉవాచ:**

**4.** **అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః।**
**కథమేతద్విజానీయాం త్వమాదౌ ప్రోక్తవానితి।।**

అర్జునుడు పలికాడు- కృష్ణా! నీయొక్క జన్మ, ఈ కాలమునకు సంబంధించినది. సూర్యుడి యొక్క జన్మ అతి ప్రాచీనమైనది. నీవు

సృష్టియొక్క ప్రారంభంలో ఈ యోగాన్ని సూర్యుడికి ఉపదేశించావని నన్ను ఎలా గ్రహించమంటావు?

శ్రీ భగవానువాచ:

**5. బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున!।**
**తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరంతప!।।**

భగవంతుడు చెప్పాడు- అర్జునా! నీకు, నాకు అనేక వేల జన్మలు గడిచాయి. నాకు గడిచిన జన్మలన్నీ నాకు తెలుసు. కానీ నీకు తెలియవు. నీయొక్క జ్ఞానశక్తి అధర్మము అనే సంస్కారముతో ఆవరించబడి ఉంది. నీవు మాయకు అధీనుడవు. నేను నిత్య శుద్ధ, బుద్ధ, ముక్త స్వభావము కలవాడను. నాయొక్క జ్ఞానశక్తిని ఏ మాయా కప్పివెయ్యలేదు.

**6. అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్।**
**ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా।।**

నేను జన్మము లేనివాడిని. జ్ఞాన స్వభావుడిని. సర్వభూతేశ్వరుడిని. ఐనా దేని వశములో ఈ జగత్తు అంతా ఉంటుందో, అటువంటి త్రిగుణాత్మికమైన ప్రకృతిని వశము చేసుకొని నా మాయచేతనే శరీరమును ధరిస్తున్నాను.

**7. యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత!।**
**అభ్యుత్థానమధర్మస్య తదాఽఽత్మానం సృజామ్యహమ్।।**

అర్జునా! ఎప్పుడైతే ప్రాణులయొక్క అభ్యుదయ మోక్షకారణమైన వర్ణాశ్రమ ధర్మము నాశనము చెంది, అధర్మము అభివృద్ధి చెందుతుందో, అప్పుడు నేను నాయొక్క మాయచేత ఈ శరీరమును గ్రహిస్తున్నాను.

**8. పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే।।**

సాధురక్షణకై, దుష్టశిక్షణకై, ధర్మసంస్థాపన కొరకై నేను ప్రతి యుగము లోనూ అవతరిస్తూనే ఉంటాను.

**9. జన్మకర్మ చ మే దివ్యం ఏవం యో వేత్తి తత్త్వతః।**
**త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున!।।**

అర్జునా! ఎవడు ఈ విధముగా అలౌకికమైన నాయొక్క జన్మను, సాధురక్షణకై జరిగినదని గ్రహిస్తాడో వాడు పునర్జన్మను పొందడు. నన్నే పొందుతాడు.

**10. వీతరాగభయక్రోధాః మన్మయా మాముపాశ్రితాః।**
**బహవో జ్ఞానతపసా పూతా మద్భావమాగతాః।।**

ఆసక్తిని, భయాన్ని, కోపాన్ని విడిచిపెట్టి నాయందు ఉంచబడిన మనస్సు కలవారై, నన్ను శరణుజొచ్చిన చాలామంది వ్యక్తులు, ఆత్మజ్ఞానమనే తపస్సు చేత పరిశుద్ధులై నా స్వరూపాన్ని పొందుచున్నారు.

**11. యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్।**
**మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ! సర్వశః।।**

ఎవరు ఏ రీతిగా సకాములుగా గానీ, నిష్కాములుగా గానీ నన్ను ఉపాసిస్తారో, వారిని ఆ రీతిగానే అనుగ్రహిస్తున్నాను. సకాములకు కామ్యఫలమును ఇస్తున్నాను. నిష్కాములకు ముక్తిని ఇస్తున్నాను. పార్థా! మనుష్యులు అన్ని విధముల నా మార్గమును మాత్రమే అనుసరిస్తున్నారు. ఇంద్రాది దేవతలను ఉపాసించువారు కూడా నన్నే ఆయా రూపములతో పూజిస్తున్నారు. నేను కూడా వారిని వారికిష్టమైన రూపముతోడనే అనుగ్రహించు చున్నాను.

**12.** కాంక్షంతః కర్మణాం సిద్ధిం యజంత ఇహ దేవతాః।
క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిర్భవతి కర్మజా॥

కర్మఫలమును కోరుచున్న చాలామంది ఈ లోకంలో ఇతర దేవతలను పూజిస్తున్నారు. నన్ను శరణు పొందుట మేలు. ఎందువలనంటే, కర్మలయొక్క ఫలము మనుష్యలోకంలో తేలికగా లభిస్తోంది. జ్ఞానఫలమైన కైవల్యము తొందరగా దొరకదు కదా!

**13.** చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః।
తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్॥

సత్త్వము, రజస్సు, తమస్సు అను మూడు గుణములను సృష్టించాను. శమదమాది కర్మలను అనుసరించి, నాలుగు వర్ణములను సృష్టించాను. అన్ని వ్యవహారములకు నేను కర్తను అయినప్పటికీ, అన్నిటా ఆసక్తి లేనివాడనై, శ్రమ లేనివాడనై ఉంటున్నాను. నన్ను అవ్యయునిగా, అకర్తగా తెలుసుకో.

**14.** న మాం కర్మాణి లింపంతి న మే కర్మఫలే స్పృహా।
ఇతి మాం యోఽభిజానాతి కర్మభిర్న స బధ్యతే॥

దేహేంద్రియములమీద నాకు అహంకారము లేదు. అందువలన నేను కర్మలయందు మోహం కలవాడను కాను. నాకు కర్మ ఫలములపై ఆశ లేదు. ఎవడైతే నన్ను ఆత్మరూపునిగా తెలుసుకొంటాడో, అతడు కర్మలచేత బంధించబడడు.

**15.** ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః।
కురు కర్మైవ తస్మాత్ త్వం పూర్వైః పూర్వతరం కృతమ్॥

ఈ విషయమును గ్రహించినవారై పూర్వీకులైన మోక్షమును కోరువారందరిచేతా కర్మ చేయబడినది. అందువలన నీవు కూడా ప్రాచీనులచేత చేయబడిన కర్మనే ఆచరించు. అది నీకు బంధం కాదు. చిత్తశుద్ధిని ఇస్తుంది.

**16.** కింకర్మ కిమకర్మేతి కవయోఽప్యత్ర మోహితాః।
తత్తే కర్మ ప్రవక్ష్యామి యజ్ జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్॥

'ఆచరింపదగిన కర్మయేది? ఆచరింపకూడని కర్మ యేది?' అను విషయంలో మేధావులు కూడా భ్రాంతి పడుతున్నారు. దేనిని తెలుసుకొంటే, సంసారమనే బంధము నుండి ముక్తుడవుతాడో, అట్టి కర్మను, అకర్మను నేను నీకు చెపుతాను. అనగా కర్మతత్త్వమును తెలియజేస్తాను.

**17.** కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః।
అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః॥

శాస్త్రము ప్రతిపాదించిన కర్మలయొక్క తత్త్వాన్ని తెలుసుకోవాలి. చేయకూడని కర్మలయొక్క విషయమును కూడా తెలుసుకోవాలి. కర్మత్యాగమును గురించి కూడా తెలుసుకోవాలి. కర్మ, అకర్మ, వికర్మలయొక్క తత్త్వము అనగా కర్మతత్త్వము తెలుసుకొనుట చాలా కష్టము.

**18.** కర్మణ్యకర్మ యః పశ్యేత్ అకర్మణి చ కర్మ యః।
స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్నకర్మకృత్॥

ఎవడైతే కర్మలో కర్మభావాన్ని అకర్తృత్వమును, నైష్కర్మ్యమును, సర్వకర్మలకూ ఆశ్రయమైన బ్రహ్మను చూడగలుగుచున్నాడో, అతడే మనుజులందరిలోనూ బుద్ధిమంతుడు. అనగా జ్ఞాని, యోగి, సర్వకర్మలకు కర్త, కృతకృత్యుడు అని పిలువబడుతున్నాడు.

**19.** యస్య సర్వే సమారంభాః కామసంకల్ప వర్జితాః।
జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం తమాహుః పండితం బుధాః॥

ఎవరి యొక్క కర్మాచరణము ఫలతృష్ణ లేనిదిగా ఉంటుందో, ఎవరి కర్తృత్వబుద్ధి జ్ఞానాగ్ని చేత దగ్ధమై పోతుందో, అతనిని బ్రహ్మవేత్తలు పండితుడు అన్నారు.

**20.** త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః।
కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్ కరోతి సః॥

కర్మఫలములయందు ఆసక్తిని విడిచిపెట్టి, సంతృప్తి కలవాడై దేనినీ ఆశ్రయించకుండగా, కర్మలను చేయువాడే, ఏమీ చెయ్యనివాడవుతాడు. ఎందువలననగా అతడియొక్క కర్తృత్వబుద్ధి జ్ఞానము అనే అగ్నిలో మాడిమసైపోయింది.

**21.** నిరాశీర్యతచిత్తాత్మా త్యక్త సర్వపరిగ్రహః।
శారీరం కేవలం కర్మ కుర్వన్ నాప్నోతి కిల్బిషమ్॥

నిష్కాముడు, అంతఃకరణమును వశపరుచుకొన్నవాడు, ఏ వస్తువుయందు అభిమానము లేనివాడు, శరీర రక్షణ కొరకై కర్మాచరణము చేసినప్పటికీ అతనిని ఏ విధమైన పాపఫలము కానీ, పుణ్యఫలము కానీ శిక్షించదు.

**22.** యదృచ్ఛా లాభసంతుష్టః ద్వంద్వాతీతో విమత్సరః।
సమస్సిద్ధావసిద్ధౌ చ కృత్వాఽపి న నిబధ్యతే॥

తాను కోరకుండగా, అనాయాసముగా వచ్చిన వాటిచేత సంతోషపడువాడు, సుఖదుఃఖాలను అతిక్రమించినవాడు, అసూయలేని వాడు, లాభాలాభములయందు సమబుద్ధి కలవాడు అయిన పురుషుడు విహిత కర్మలను కానీ, స్వాభావికములైన కర్మలను కానీ, శరీరరక్షణ కొరకు చేయవలసిన కర్మలను కానీ, చేసినప్పటికీ అతడు కర్మఫలములకు బద్ధుడు కాడు.

**23.** గతసంగస్య ముక్తస్య జ్ఞానావస్థిత చేతసః।
యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే॥

ఆసక్తి లేనివాడు, విముక్తుడు, జ్ఞాననిష్ఠుడు అయిన వ్యక్తి, లోకము కొరకు కానీ, ఈశ్వరప్రీతి కొరకు గానీ, కర్మలను ఆచరిస్తే, ఆ కర్మఫలము అతనికి బంధమును కలిగించదు. సమగ్రముగా అదే నాశనమైపోతుంది. కర్మ గానీ, కర్మ సంస్కారము గానీ మిగలదు.

**24.** బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్।
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మసమాధినా॥

ఆహుతి ఇచ్చుటకు సాధనములైన స్రుక్కులు, స్రువములు బ్రహ్మయొక్క స్వరూపమే. నేయి కూడా బ్రహ్మమే. బ్రహ్మరూపమైన అగ్నిలో, బ్రహ్మరూపుడైన హోత చేత, బ్రహ్మరూపమైన హోమము చేయబడినది. బ్రహ్మమే అన్ని కర్మలయందు బ్రహ్మభావము కలది. అట్టి పురుషుడి చేత పొందదగిన ఫలము కూడా బ్రహ్మమే.

**25.** దైవమేవాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే।
బ్రహ్మాగ్నావపరే యజ్ఞం యజ్ఞేనైవోపజుహ్వతి॥

కొందరు యోగులు జ్యోతిష్టోమాది యాగములను చేస్తున్నారు. అది కర్మయజ్ఞము. మరికొందరు బ్రహ్మము అనే అగ్నిలో జీవాత్మనే ఆహుతిగా ఇస్తున్నారు. అనగా సోపాధికమైన జీవాత్మను, నిరుపాధికమైన పరమాత్మగా చూస్తున్నారు. ఇది జ్ఞానయజ్ఞము.

**26.** శ్రోత్రాదీనీంద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి।
శబ్దాదీన్ విషయానన్యే ఇంద్రియాగ్నిషు జుహ్వతి॥

మరికొందరు నైష్ఠిక బ్రహ్మచారులు, సన్న్యాసులు మొదలగువారు తమయొక్క కన్ను, ముక్కు, చెవి మొదలైన ఇంద్రియాలను సంయమము అనే అగ్నిలో ఆహుతి చేస్తున్నారు. అనగా ఇంద్రియ నిగ్రహం పాటిస్తున్నారు. గృహస్థాశ్రమంలో ఉన్న మరికొంతమంది శబ్దాది విషయ సమూహములను ఇంద్రియాగ్నిలో ఆహుతి ఇస్తున్నారు. అనగా ఇంద్రియముల ద్వారా ధర్మబద్ధమైన భోగములను అనుభవిస్తున్నారు. ధర్మవిరుద్ధమైన వాటిని విడిచిపెడుతున్నారు.

**27.** సర్వాణీంద్రియకర్మాణి ప్రాణకర్మాణి చాపరే।
ఆత్మసంయమయోగాగ్నౌ జుహ్వతి జ్ఞానదీపితే।।

మరికొందరు ధ్యానయోగులు జ్ఞానప్రదీప్తమైన ఆత్మనిగ్రహము అనే యోగాగ్ని, ఇంద్రియములయొక్క కర్మలను ప్రాణాది పంచవాయువుల యొక్క కర్మలను ఆహుతి చేస్తున్నారు.

**28.** ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞాః యోగయజ్ఞా స్తథాఽపరే।
స్వాధ్యాయజ్ఞానయజ్ఞాశ్చ యతయ స్సంశితవ్రతాః।।

మరికొందరు ద్రవ్యములు దానము చేయుట అను దాన యజ్ఞములు చేస్తున్నారు. మరికొందరు చాంద్రయణాది వ్రతములతో తపోయజ్ఞము చేస్తున్నారు. ఇంకొందరు ప్రాణాయామ ప్రత్యాహారములతో యోగయజ్ఞము చేస్తున్నారు. మరికొందరు దృఢవ్రతులై వేదాభ్యాసము చేసి, స్వాధ్యాయ యజ్ఞమును చేస్తున్నారు. వేదార్థనిశ్చయము అను జ్ఞానయజ్ఞమును కూడా చేస్తున్నారు.

**29.** అపానే జుహ్వతి ప్రాణం ప్రాణేఽపానం తథాఽపరే।
ప్రాణాపానగతీ రుద్ధ్వా ప్రాణాయామ పరాయణాః।।

కొంతమంది యోగులు అపానవాయువులో ప్రాణవాయువును హోమం చేస్తున్నారు. దీనిని పూరక ప్రాణాయామము అంటారు. మరికొందరు ప్రాణవాయువులో అపానవాయువును హోమం చేస్తున్నారు. దీనిని రేచక ప్రాణాయామము అంటారు. ఇంకొందరు ప్రాణ, అపాన వాయువులయొక్క గమనమును నిరోధించి ప్రాణాయామము చేస్తున్నారు. దీనిని కుంభక ప్రాణాయామము అంటారు.

**30.** అపరే నియతాహారాః ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి।
సర్వేఽప్యేతే యజ్ఞవిదః యజ్ఞక్షపితకల్మషాః ।।

మరికొందరు ఆహారము యందు నియమమును పాటిస్తూ వాయువులను ఇతరవాయువులలో ఆహుతినిస్తున్నారు. అనగా ఏయే వాయువును జయిస్తున్నారో, ఆయా వాయువులను ఇతర వాయువులలో హోమం చేస్తున్నారు. ఇట్టి యజ్ఞములను తెలుసుకొనినవారు, ఆచరించినవారు, అభినందించినవారు పాపవిముక్తులవుతారు.

**31.** యజ్ఞశిష్టామృతభుజః యాంతి బ్రహ్మ సనాతనమ్।
నాయం లోకోఽస్త్యయజ్ఞస్య కుతోఽన్యః కురుసత్తమ!।।

యజ్ఞము పూర్తి అయిన తరువాత మిగిలిన అమృతమును భుజించువారు, నిత్యసత్యమైన బ్రహ్మమును పొందుతున్నారు. అర్జునా! యజ్ఞము చేయని వారికి, ఇహలోకమే లేదు. ఇక అనేక సుఖములతో కూడిన పరలోకమెక్కడ?

**32.** ఏవం బహువిధా యజ్ఞాః వితతా బ్రహ్మణో ముఖే।
కర్మజాన్ విద్ధి తాన్ సర్వాన్ ఏవం జ్ఞాత్వా విమోక్ష్యసే।।

వేదములో ఇటువంటి యజ్ఞములు ఎన్నో తెలియజేయబడ్డాయి. ఇవన్నీ మనో వాక్కాయ కర్మలకు సంబంధించినవి. ఆత్మ నుండి కలిగినవి కావు. ఆత్మతత్త్వమును తెలిసి జ్ఞాననిష్ఠుడివైతే ముక్తుడవు అవుతావు.

**33.** శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప!।
సర్వం కర్మాఖిలం పార్థ! జ్ఞానే పరిసమాప్యతే।।

అర్జునా! ద్రవ్యసాధ్యమైన యజ్ఞం కంటే జ్ఞానరూపమైన యజ్ఞం గొప్పది. అన్ని ఫలములతో కూడిన కర్మలు అన్నీ ఆత్మజ్ఞానములో కలిసిపోతున్నాయి.

**34.** తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా।
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః।।

నమస్కారము చేసి గానీ, వినయముతో ప్రశ్నించి గానీ, సేవలు చేసి గానీ, గురువుల నుండి బ్రహ్మజ్ఞానమును సేవించు. తత్త్వద్రష్టులైన జ్ఞానులు నీకు ఆ బ్రహ్మజ్ఞానమును ఉపదేశిస్తారు.

**35.** యజ్ జ్ఞాత్వా న పునర్మోహం ఏవం యాస్యసి పాండవ!।
యేన భూతాన్యశేషేణ ద్రక్ష్యస్యాత్మన్యథో మయి।।

అర్జునా! ఈ బ్రహ్మజ్ఞానమును పొందితే నీకు తిరిగి మోహము కలుగదు. బ్రహ్మజ్ఞానము పొందిన నీవు బ్రహ్మ నుండి స్తంభము వరకు అన్ని ప్రాణులయందు, నీ యందు, నాయందు బ్రహ్మమునే చూడగలవు.

**36.** అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః।
సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి।।

పాపులందరిలోనూ, నీవు పాపిష్ఠుడివే అయినా ఈ బ్రహ్మజ్ఞానము పొందిన తరువాత ధర్మాధర్మములను అన్నింటినీ నీవు జ్ఞానము అను పడవతో దాటివేయగలవు.

**37.** యథైధాంసి సమిద్ధోఽగ్నిః భస్మసాత్కురుతేఽర్జున।
జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా।।

అర్జునా! బాగుగా మండుచున్న అగ్ని, ఎండు కట్టెలను ఏ విధముగా భస్మము చేస్తుందో, అదే విధముగా జ్ఞానమనే అగ్ని, సమస్తమైన కర్మలను భస్మము చేస్తుంది.

**38.** న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే।
తత్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విందతి।।

ఈ జగత్తులో జ్ఞానముతో సమానమైనది, పవిత్రమైనది, మరొకటి లేదు. కర్మయోగముతో పరిశుద్ధమైన మనస్సు కలవాడవై తన యందు తన స్వరూపమును కాలక్రమములో తెలుసుకొంటావు.

**39.** శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేంద్రియః।
జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతిం అచిరేణాధిగచ్ఛతి।।

శ్రద్ధ కలవాడు, గురుసేవ యందు ఇష్టము కలవాడు, జితేంద్రియుడు, బ్రహ్మజ్ఞానమును పొందుతాడు. అట్టివాడు బ్రహ్మజ్ఞానమును పొందినవాడై మోక్షమును కూడా పొందుచున్నాడు.

**40.** అజ్ఞశ్చాశ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి।
నాయం లోకోఽస్తి న పరః న సుఖం సంశయాత్మనః।।

జ్ఞానహీనుడు, శ్రద్ధ లేనివాడు, సంశయాత్మ అయినవాడు, స్వార్థము కారణముగా భ్రష్టులవుతున్నారు. సందేహచిత్తునికి అనగా, ధన సంపాదన, గృహస్థాశ్రమము లేనివానికి ఈ లోకమే లేదు. ధర్మము లేకపోవుటచే పరలోకమూ లేదు. సుఖమూ లేదు. ఆనందమూ లేదు. సర్వథా భ్రష్టుడవుతున్నాడు.

**41.** యోగసన్న్యస్త కర్మాణం జ్ఞానసంఛిన్నసంశయమ్।
ఆత్మవంతం న కర్మాణి నిబధ్నంతి ధనంజయ!।।

పరమాత్మ దర్శనముతో ధర్మాధర్మములను విడిచిపెట్టినవాడు, పరమేశ్వర ఆరాధనము అనే కర్మయోగములో అన్ని కర్మలను భగవంతునికి సమర్పించినవాడు, ధ్యానము చేత సమస్త సందేహములు తొలగినవాడు, అప్రమత్తుడైన పురుషుడిని ఎట్టి కర్మలూ బంధించలేవు. అనగా స్వాభావికమైన కర్మ గానీ, లోకసంగ్రహార్థము కొరకైన కర్మలు గానీ అతనిని బాధించవు.

**42.** తస్మాదజ్ఞానసంభూతం హృత్స్థం జ్ఞానాసినాఽఽత్మనః।
ఛిత్త్వైనం సంశయం యోగం ఆతిష్ఠోత్తిష్ఠ భారత!।।

కనుక అర్జునా! అజ్ఞానము నుండి పుట్టిన నీ హృదయము నందే గల ఆత్మ విషయమైన ఇటువంటి సందేహములను జ్ఞానమనే ఖడ్గముతో ఛేదించి, నిష్కామ కర్మ అనే యోగమును అవలంబించి ఇక మీద యుద్ధము చెయ్యి.

ఇతి శ్రీ మద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జున సంవాదే జ్ఞానయోగో నామ చతుర్థోఽధ్యాయః



## అథ పంచమోఽధ్యాయః
## కర్మసన్న్యాస యోగః

**అర్జున ఉవాచ:**

**1.** సన్న్యాసం కర్మణాం కృష్ణ! పునర్యోగం చ శంససి।
యచ్ఛ్రేయ ఏతయోరేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్।।

అర్జునుడిలా అడిగాడు- శ్రీకృష్ణా! నీవు కర్మత్యాగమును గురించి నాకు చక్కగా బోధించావు. అదే సమయములో కర్మానుష్ఠానము గురించి కూడా మళ్లీ మళ్లీ తెలియజేస్తున్నావు. ఈ రెండింటిలో ఏది శ్రేయస్కరమో నిర్ణయించి, ఆ ఒక్కదానినీ నాకు తెలుపు - అన్నాడు.

శ్రీ భగవానువాచ:

**2.** సన్న్యాసః కర్మయోగశ్చ నిశ్శ్రేయసకరావుభౌ।
తయోస్తు కర్మసన్న్యాసాత్ కర్మయోగో విశిష్యతే।।

శ్రీకృష్ణుడిలా చెప్పాడు - కర్మసన్న్యాస యోగము, నిష్కామ కర్మయోగము, ఈ రెండూ ముక్తిని ఇచ్చునవే. కానీ ఈ రెండింటిలో కర్మ సన్న్యాసయోగము కంటే నీ వంటి వారలకు నిష్కామ కర్మయోగమే గొప్పది.

**3.** జ్ఞేయ స్స నిత్యసన్న్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి।
నిర్ద్వంద్వో హి మహాబాహో! సుఖం బంధాత్ప్రముచ్యతే।।

అర్జునా! ఎవడు ఎవరినీ ద్వేషించడో, ఎవడు దేనినీ కోరడో, అతడు ఎన్ని కర్మలను చేస్తున్నా సన్న్యాసిగా తెలుసుకో. ఎందువలననగా సుఖదుఃఖాది ద్వంద్వరహితుడు సంసార బంధము నుండి తేలికగా విముక్తుడవుతున్నాడు.

**4.** సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదంతి న పండితాః।
ఏకమప్యాస్థితః సమ్యగ్ ఉభయోర్విందతే ఫలమ్।।

అజ్ఞానులైన కొందరు కర్మసన్న్యాసము వేరనీ, కర్మయోగము వేరనీ చెపుతారు. కానీ, పండితులా విధంగా చెప్పరు. ఈ రెండింటిలో ఏ ఒక్క దానిని చక్కగా ఆచరించినా, రెండిటి ఫలాలను సంపూర్ణంగా అనుభవిస్తారు. అనగా, మోక్షమును పొందుతారు. ఈ రెండిటికీ వేరు వేరు ఫలములు లేవు.

**5.** యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే।
ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి।।

జ్ఞాననిష్ఠులైన సన్న్యాసులు, మోక్షమనే ఏ స్థానమును పొందుచున్నారో, నిష్కామ కర్మయోగులు కూడా అదే మోక్షాన్ని పొందగలుగుచున్నారు. జ్ఞానయోగ ఫలము, కర్మయోగ ఫలమూ ఒక్కటే. అదే మోక్షము. దానిని గుర్తించినవాడే యథార్థదర్శి.

**6.** సన్న్యాసస్తు మహాబాహో! దుఃఖమాప్తుమయోగతః।
యోగయుక్తో మునిర్బ్రహ్మ నచిరేణాధిగచ్ఛతి।।

నిష్కామ కర్మయోగమును అనుష్ఠానమును చెయ్యకుండగా, కర్మలను సన్న్యసించటము అసంభవము. నిష్కామకర్మ నిష్ఠుడైన సన్న్యాసి తొందరలో బ్రహ్మజ్ఞానమును పొందుతాడు. కావున చిత్తశుద్ధి లభించువరకు సన్న్యాసము కంటే కర్మయోగమే గొప్పది.

**7.** యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మాజితేంద్రియః।
సర్వభూతాత్మభూతాత్మా కుర్వన్నపి న లిప్యతే।।

నిష్కామకర్మ యందు నిష్ఠ గలవాడు, శుద్ధమైన చిత్తము కలవాడు, ఆత్మతత్త్వమును తెలుసుకొనినవాడు, జితేంద్రియుడు, సర్వభూతముల ఆత్మ, తన యొక్క ఆత్మయే అని గుర్తించినవాడు అయిన నిష్కామ కర్మయోగి, కర్మలను ఆచరించినా అతడు దేనికీ బంధించబడడు.

**8.** నైవ కించిత్ కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్।
పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్ అశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్।।

**9.** ప్రలపన్ విసృజన్ గృహ్ణన్ ఉన్మిషన్ నిమిషన్నపి।
ఇంద్రియాణీంద్రియార్థేషు వర్తంత ఇతి ధారయన్।।

తత్త్వవేత్త అయిన కర్మయోగి దర్శన (చూస్తూ) శ్రవణ (వింటూ), స్పర్శ (తాకుతూ), ఘ్రాణ (వాసన చూస్తూ), భోజన (తింటూ), గమన (నడుస్తూ), నిద్ర (నిద్రిస్తూ), శ్వాసగ్రహణ (గాలి పీల్చుకొంటూ), కథన (మాట్లాడుతూ), త్యాగ (విడిచిపెట్టుచూ), గ్రహణ (తీసుకొనుచూ), ఉన్మేష (కన్నులు తెరుస్తూ), నిమేషాది (కన్నులు తెరుస్తూ కూడా) ఇంద్రియ వ్యాపారాలలో ప్రవర్తిస్తున్నప్పటికీ తాను ఏమీ చేయుట లేదని గ్రహిస్తాడు.

**10.** బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః।
లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా।।

ఎవడు పరమేశ్వరుని యందు అన్ని ఫలములను అర్పించి, ఫలాసక్తిని విడిచిపెట్టి కర్మలను చేయుచున్నాడో, అతడు నీటితో తడిసిన తామరాకు వలె పుణ్యపాపములచేత అంటుకొనబడడు.

**11.** కాయేన మనసా బుద్ధ్యా కేవలైరింద్రియైరపి।
యోగినః కర్మ కుర్వంతి సంగం త్యక్త్వాత్మశుద్ధయే।।

నిష్కామకర్మయోగులు ఆసక్తిని విడిచిపెట్టి చిత్తశుద్ధి కొరకై అహంకార మమకారములు లేనివారై స్నానాదులచేత శరీరమును, ధ్యానాదులచేత మనస్సునూ, తత్త్వవిచారణ ద్వారా బుద్ధిని, పరిశుద్ధము చేసుకొని ఇంద్రియ సహాయముతో అన్ని కర్మలను చేయిస్తున్నారు. (శ్రవణ, మనన, కీర్తనాదులు)

**12.** యుక్తః కర్మఫలం త్యక్త్వా శాంతి మాప్నోతి నైష్ఠికీమ్।
అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే।।

ఒకే కర్మను ఆచరించి, కొందరు బద్ధులవుతున్నారు. అదే కర్మను చేసి, మరికొందరు విముక్తులవుతున్నారు. కర్మయోగులు, కర్మ ఫలత్యాగము చేసి, శాంతిని పొందుచున్నారు. సకామకర్ములు కర్మఫలాసక్తిని పెంచుకొని సంసారములో అశాంతిని అనుభవిస్తున్నారు.

**13.** సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ।
నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్న కారయన్।।

జితేంద్రియుడైన పురుషుడు, నిత్య, నైమిత్తిక, కామ్యనిషిద్ధ అనబడు వివేకబుద్ధితో కర్మలను అన్నింటినీ విడిచిపెట్టి తొమ్మిది ద్వారములు గల దేహము అను ఈ శరీరములో తానేమీ చెయ్యకుండగా, ఇతరులచేత చేయించకుండగా, నిర్లిప్తుడై ప్రకాశిస్తున్నాడు.

**14.** న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః।
న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే।।

ఆత్మ, జనులకు కర్తృత్వాన్ని కలిగించదు. రథములు, మేడలు మొదలగు భోగవస్తువులను సృష్టించదు. కర్మఫలములయొక్క సంబంధాన్ని సృష్టించదు. కానీ అవిద్యా రూపమైన మాయయే పై పనులనన్నింటినీ చేయుటచే అవి ఆత్మయందు ఆరోపించబడుతున్నాయి.



**15.** నాదత్తే కస్యచిత్ పాపం న చైవ సుకృతం విభుః।
అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః।।

పరిపూర్ణుడైన పరమేశ్వరుడు, ఎవరియొక్క పాపాన్నీ గ్రహించడు. ఎవరియొక్క పుణ్యాన్నీ కూడా గ్రహించడు. అజ్ఞానము చేత వివేకము కప్పివేయబడుటచే జీవులు పరమాత్మయందు మోహగ్రస్తులవుతున్నారు. అనగా ఆత్మలో చేయుట, చేయించుట, తినిపించుట మొదలగు కర్తృత్వభావనలను పొందుచున్నారు.

**16.** జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః।
తేషామాదిత్యవజ్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్।।

ఆత్మజ్ఞానము చేత ఎవరియందలి అజ్ఞానము నశిస్తుందో, అట్టి వారియొక్క ఆత్మజ్ఞానము సూర్యునివలె పరబ్రహ్మమును ప్రకాశింప చేస్తుంది.

**17.** తద్బుద్ధయస్తదాత్మానః తన్నిష్ఠాస్తత్పరాయణాః।
గచ్ఛంత్య పునరావృత్తిం జ్ఞాననిర్ధూతకల్మషాః।।

బ్రహ్మనిష్ఠులు, బ్రహ్మాత్మభావులు, బ్రహ్మస్థితులు, బ్రహ్మపరాయణులు, నిష్కల్మషులు, (అన్నీ ఇంచుమించు సమానార్థకాలే) అయిన యోగులు మోక్షాన్ని పొందుచున్నారు.

**18.** విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని।
శుని చైవ శ్వపాకే చ పండితా స్సమదర్శినః।।

ఇటువంటి బ్రహ్మవేత్తలకు విద్యా వినయములతో ప్రకాశించు బ్రాహ్మణుని యందు గానీ, కుక్క మాంసమును తిను చండాలుని యందు గానీ, ఆవుయందు, ఏనుగు నందు, కుక్కయందు గానీ భేదము కనిపించదు. అందరియందు సమముగా ప్రకాశించుచున్న బ్రహ్మమునే దర్శిస్తారు.

**19.** ఇహైవ తైర్జిత స్సర్గః యేషాం సామ్యే స్థితం మనః।
నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్ బ్రహ్మణి తే స్థితాః।।

ఎవరి మనస్సు సమభావముతో సర్వభూతములయందలి బ్రహ్మముతో నిశ్చలముగా ఉంటుందో, వారిచేత ఈ జీవితములోనే సృష్టి సంసారము జయించబడుతుంది. ఎందువలననగా బ్రహ్మము గుణదోషములు లేనిది, సమ స్వరూపము కలది, కావున సమదృష్టి కలవారు పునర్జన్మము లేని బ్రహ్మములో స్థిరముగా నుండి జీవన్ముక్తిని పొందుచున్నారు.

**20.** న ప్రహృష్యేత్ప్రియం ప్రాప్య నోద్విజేత్ప్రాప్య చాప్రియమ్।
స్థిరబుద్ధిరసమ్మూఢః బ్రహ్మవిద్బ్రహ్మణి స్థితః।।

బ్రహ్మజ్ఞానమును పొందిన పురుషుడు బ్రాహ్మీస్థితిని పొంది, స్థితప్రజ్ఞుడై మోహశూన్యుడవుతున్నాడు. అతనికి ప్రియమైన వస్తువులు ఏవీ సంతోషమును ఈయవు. అప్రియమైన వస్తువులేవీ విషాదమునూ ఈయవు.

**21.** బాహ్యస్పర్శేష్వసక్తాత్మా విందత్యాత్మని యత్సుఖమ్।
స బ్రహ్మయోగయుక్తాత్మా సుఖమక్షయమశ్నుతే।।

బాహ్యములైన శబ్దాది విషయములపై ఇతని మనస్సు ఆసక్తమవదు. అంతఃకరణములో ఏ వస్తువు విషయ నిరపేక్షమైన సుఖమునిస్తుందో, అట్టి సుఖమును మాత్రమే స్వీకరిస్తాడు. అక్షయమైన బ్రహ్మానందానికి అధికారి అవుతాడు.

**22.** యే హి సంస్పర్శజా భోగాః దుఃఖయోనయ ఏవ తే।
ఆద్యంతవంతః కౌంతేయ! న తేషు రమతే బుధః।।

అర్జునా! రూప రసాదులైన విషయవాంఛల వలన కలుగు సుఖము, దుఃఖమునకు కారణమౌతుంది. అది క్షణికమైనది. కావున జ్ఞానులు దానిని ఆస్వాదించరు.

**23.** శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్శరీర విమోక్షణాత్।
కామక్రోధోద్భవం వేగం స యుక్త స్స సుఖీ నరః।।

ఎవరైతే ఈ జీవితములోనే కామక్రోధముల నుండి పుట్టిన వికారములను చనిపోవునంతవరకూ, సహించగలుగుచున్నారో, అతడే యోగి. అతడే ఆనందమైన పురుషుడు.

**24.** యోఽంత స్సుఖోఽంతరారామః తథాఽంతర్జ్యోతిరేవ యః।
స యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతోఽధిగచ్ఛతి।।

ఎవడికి సుఖమనునది, విషయములయందు కాక, ఆత్మయందు ప్రకాశిస్తోందో, ఎవడైతే బాహ్యక్రీడలు లేనివాడై ఆత్మక్రీడయందు ఆసక్తి కలవాడిగా ఉంటున్నాడో, ఎవడైతే నృత్యగీతములయందు ఆసక్తుడు కాక, ఆత్మనిష్ఠయందు ఆసక్తుడగుచున్నాడో, వాడు అట్టి బ్రహ్మస్వరూపుడై బ్రహ్మానందమును, ముక్తిని పొందుచున్నాడు.

**25.** లభంతే బ్రహ్మనిర్వాణం ఋషయః క్షీణకల్మషాః।
ఛిన్నద్వైధా యతాత్మానః సర్వభూతహితే రతాః।।

పుణ్యపాపముల నుండి విముక్తులైనవారు, సంశయములు లేనివారు, ఇంద్రియ నిగ్రహము కలవారు, అన్ని జీవులయందు ఆసక్తి కలవారు, సమ్యగ్దర్శనులు అయిన సన్న్యాసులు ఈ జీవితములోనే మోక్ష సామ్రాజ్యమును పొందగలరు.

**26.** కామక్రోధ వియుక్తానాం యతీనాం యతచేతసామ్।
అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్।।

కామక్రోధములను విడిచిపెట్టినవారు, ఇంద్రియ నిగ్రహము గల ఆత్మజ్ఞానులైన యతీశ్వరులు శరీరమును విడిచిపెట్టుటకు పూర్వమునందే

మోక్షమును పొందుచున్నారు. శరీరమును విడిచిపెట్టిన తరువాత కూడా మోక్షము పొందుచున్నారు. వారికి మరల పుట్టుక అనునది లేదు.

**27.** స్పర్శాన్‌కృత్వా బహిర్బాహ్యాన్ చక్షుశ్చైవాంతరే భ్రువోః।
ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యంతరచారిణౌ।।

**28.** యతేంద్రియ మనోబుద్ధిః మునిర్మోక్షపరాయణః।
విగతేచ్ఛా భయక్రోధః య స్సదా ముక్త ఏవ సః।।

బాహ్య పదార్థములైన విషయవాంఛల నుండి మనస్సును దూరము చేసి, కనుబొమ్మల మధ్యభాగమునందు దృష్టిని నిలిపి, కుడి ఎడమ నాసికా రంధ్రముల ద్వారా ప్రాణాయామమును చేయుచూ, ప్రాణవాయువునూ, అపాన వాయువును సమానం చేసి, కుంభకములో ఊర్ధ్వగతి, అధో గతి లేకుండగా చేసి, ఇంద్రియాలను, మనస్సును, బుద్ధిని, అధీనమునందు ఉంచుకొని మోక్ష పరాయణుడై భయము, కోరిక, కోపము లేనివాడై ఎవడైతే ప్రకాశించు చున్నాడో, అతడు అన్ని బంధముల నుండి నిర్ముక్తుడు. మోక్షము పొందుటకు యోగ్యుడు.

**29.** భోక్తారం యజ్ఞ తపసాం సర్వలోక మహేశ్వరమ్।
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతి మృచ్ఛతి।।

నన్ను తపోయజ్ఞములకు భోక్తగా, అన్ని లోకములకు మహేశునిగా, జీవులందరికీ మిత్రునిగా తెలుసుకొని యోగి శాంతిని పొందుచున్నాడు.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు, బ్రహ్మవిద్యాయాం, యోగశాస్త్రే, శ్రీకృష్ణార్జున సంవాదే, కర్మసన్న్యాసయోగోనామ పంచమోఽధ్యాయః।।

## అథ షష్ఠోఽధ్యాయః
## ఆత్మసంయమయోగః (ధ్యానయోగః)

శ్రీ భగవానువాచ:

**1.** అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతియః।
స సన్న్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్నచాక్రియః।।

భగవంతుడిలా చెప్పాడు- కర్మఫలాన్ని కోరుకుండగా, చేయవలసిన కర్మలను సక్రమముగా చేయువాడే నిజమైన సన్న్యాసి. అతడే యోగి. అగ్నిహోత్రాది కర్మలను, తపోదానాది కర్మలను విడిచిపెట్టినంత మాత్రము చేత అతడు సన్న్యాసీ కాడు, యోగి కూడా కాడు.

**2.** యం సన్న్యాసమితి ప్రాహుః యోగం తం విద్ధి పాండవ!।
న హ్యసన్న్యస్త సంకల్పః యోగీ భవతి కశ్చన।।

అర్జునా! సన్న్యాసమనినా, యోగమనినా ఒకటే. సంకల్ప వికల్పములను విడిచిపెట్టనివాడు యోగి కాలేడు. సంకల్పమును విడిచిపెట్టుట చేత, చిత్తవిక్షేపము లేకపోవుట వలన యోగి అవుతున్నాడు.

**3.** ఆరురుక్షోర్మునేర్యోగం కర్మ కారణముచ్యతే।
యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే।।

యోగమును కోరువానికి ప్రాథమిక దశలో కర్మయే సాధనము. కొద్ది యోగము సిద్ధించిన తరువాత శమము సాధనమని చెప్పబడుతోంది.

**4.** యదా హి నేంద్రియార్థేషు న కర్మస్వనుషజ్యతే।
సర్వసంకల్పసన్న్యాసీ యోగారూఢస్తదోచ్యతే।।

ఇంద్రియములయందు కానీ, వాటికి సాధనములైన కర్మలయందు కానీ, ఎట్టి ఆసక్తి లేకుండగా, విడిచిపెట్టినవారిని యోగారూఢుడని అంటున్నారు.

**5.** **ఉద్ధరేదాత్మనాఽఽత్మానం నాత్మానమవసాదయేత్।**
**ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః॥**

ఈ సంసారము నుండి ఎవరికి వారే ఆత్మోద్ధరణము చేసుకోవాలి. పతనము కాకూడదు. ఆత్మకు ఆత్మయే బంధువు. విషయాసక్తమైన మనస్సే ఆత్మకు శత్రువు.

**6.** **బంధురాత్మాఽత్మనస్తస్య యేనాత్మైవాత్మనా జితః।**
**అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్॥**

నిగ్రహపరులకు ఆత్మబంధువు గానూ, నిగ్రహం లేనివారికి, ఆత్మయే శత్రువు గానూ కనిపిస్తుంది.

**7.** **జితాత్మనః ప్రశాంతస్య పరమాత్మా సమాహితః।**
**శీతోష్ణ సుఖదుఃఖేషు తథా మానాపమానయోః॥**

జితేంద్రియుడు, ప్రశాంతుడైన సన్న్యాసి శీతోష్ణ, సుఖదుఃఖాది ద్వంద్వములకు అతీతుడై, ఆత్మనిగ్రహపరుడై శాంతచిత్తుడై పరమాత్మ అనుభవాన్ని పొందుతున్నాడు.

**8.** **జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా కూటస్థో విజితేంద్రియః।**
**యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మ కాంచనః॥**

శాస్త్రజ్ఞానమును సంపాదించి, సంతృప్తి చెందినవాడు, నిర్వికారుడు, జితేంద్రియుడు, మట్టి, రాయి, బంగారము, అన్నిటియందు సమానమైన బుద్ధి కలవాడు, యోగిగా, యోగారూఢుడై పిలువబడుచున్నాడు.



**9.** **సుహృన్మిత్రార్యుదాసీన మధ్యస్థద్వేష్యబంధుషు॥**
**సాధుష్వపి చ పాపేషు సమబుద్ధి ర్విశిష్యతే॥**

స్నేహితుడు, శత్రువు, మిత్రుడు, ఉదాసీనుడు, సహృదయుడు, మధ్యస్థుడు, విరోధి, బంధువు, సదాచారి, దురాచారి వీరందరియందు సమబుద్ధి కలవాడే యోగారూఢుడు అని చెప్పబడుచున్నాడు.

**10.** **యోగీ యుంజీత సతతం ఆత్మానం రహసి స్థితః।**
**ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీరపరిగ్రహః॥**

ఆశలను, వస్తుసేకరణ అభిలాషను విడిచిపెట్టి, ఇంద్రియములను, మనస్సును, స్వాధీనమునందు ఉంచుకొని, నిశ్చలమైన మనస్సుతో ఏకాంతవాసము చేస్తూ, యోగాభ్యాసము చెయ్యాలి.

**11.** **శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసనమాత్మనః।**
**నాత్యుచ్ఛ్రితం నాతినీచం చైలాజినకుశోత్తరమ్॥**

పవిత్రమైన ప్రదేశములో పెద్దగా ఎత్తు, పొట్టి కానీ, పీఠమును ఏర్పాటు చేసుకొని, దానిపై దర్భలను ఉంచి, దానిమీద వస్త్రమును కప్పి, ఆసనమును ఏర్పాటు చేసుకోవాలి.

**12.** **తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియక్రియః।**
**ఉపవిశ్యాసనే యుంజ్యాత్ యోగమాత్మ విశుద్ధయే॥**

ఆ ఆసనము మీద స్థిరముగా కూర్చొని ఇంద్రియకర్మలను నిరోధించి, మనస్సును ఏకాగ్రముగా నిలిపి, చిత్తవృత్తులను నిరోధించి యోగాభ్యాసము చెయ్యాలి.

**13.** **సమం కాయశిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః।**
**సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్॥**

శరీరము (వెన్నెముక), మెడ, శిరస్సు, ఒకే విధముగా నిటారుగా ఉంచాలి. శరీర చలనము ఉండకూడదు. తన యొక్క ముక్కు మొదటి భాగమునందు చూపును కేంద్రీకరించాలి.

**14.** **ప్రశాంతాత్మా విగతభీః బ్రహ్మచారివ్రతే స్థితః।**
**మనస్సంయమ్య మచ్చిత్తః యుక్త ఆసీత మత్పరః।।**

మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలి. భయపడకూడదు. బ్రహ్మచర్యం పాటించాలి. మనస్సును అదుపులో ఉంచుకొని, నాయందే నిలిపి యోగాభ్యాసం చెయ్యాలి.

**15.** **యుంజన్నేవం సదాఽఽత్మానం యోగీ నియతమానసః।**
**శాంతిం నిర్వాణపరమాం మత్సంస్థామధిగచ్ఛతి।।**

ప్రతిరోజూ ఈ విధముగా నాయందు మనస్సు నిలిపి, అభ్యాసం చేసిన యోగి, నాయొక్క స్థితిని మోక్షమును పొందుతాడు.

**16.** **నాత్యశ్నతస్తు యోగోఽస్తి న చైకాంతమనశ్నతః।**
**న చాతిస్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున!।।**

ధ్యాననిష్ఠకు ఆహార నియమము ముఖ్యమైనది. అర్జునా! ఎక్కువగా భుజించువానికి ధ్యానము కుదరదు. ఉపవాసమును చేసినవానికి ధ్యానము కుదరదు. ఎక్కువగా నిద్రించినవానికి ధ్యానము కుదరదు. నిరంతరమూ మేల్కొన్నవాడికి ధ్యానము కుదరదు. అనగా అన్నిటి యందు సమానముగా ప్రవర్తించాలి. అప్పుడే యోగము కుదురుతుంది.

**17.** **యుక్తాహారవిహారస్య యుక్త చేష్టస్య కర్మసు!।**
**యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా।।**

మితహార, నిద్రా విహారములు, మిత నియత కర్మలు, మిత నిద్రావస్థలు కలిగి, అభ్యాసము చేసినవానికి సంసార దుఃఖమును పోగొట్టు ధ్యానస్థితి లభిస్తుంది.

**18.** **యదా వినియతం చిత్తం ఆత్మన్యేవావతిష్ఠతే।**
**నిస్స్పృహః సర్వకామేభ్యః యుక్త ఇత్యుచ్యతే తదా।।**

ఎప్పుడూ మనస్సు నాయందే నిలిపి, కోర్కెలను విడిచిపెట్టినవాడు, యోగయుక్తుడు (యోగసిద్ధుడు) అని చెప్పబడుచున్నాడు.

**19.** **యథా దీపో నివాతస్థః నేంగతే సోపమా స్మృతా।**
**యోగినో యతచిత్తస్య యుంజతో యోగమాత్మనః।।**

యోగసాధకుడియొక్క మనస్సు, గాలి లేని చోట ఉంచిన దీపము వలె నిశ్చలముగా, స్థిరముగా ఉంటుంది.

**20.** **యత్రోపరమతే చిత్తం నిరుద్ధం యోగసేవయా।**
**యత్ర చైవాత్మనాఽఽత్మానం పశ్యన్నాత్మని తుష్యతి।।**

**21.** **సుఖమాత్యంతికం యత్తత్ బుద్ధిగ్రాహ్యమతీంద్రియమ్।**
**వేత్తి యత్ర న చైవాయం స్థితశ్చలతి తత్త్వతః।।**

**22.** **యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః।**
**యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాఽపి విచాల్యతే।।**

**23.** **తం విద్యాద్దుఃఖసంయోగ వియోగం యోగసంజ్ఞితమ్।**
**స నిశ్చయేన యోక్తవ్యః యోగోఽనిర్విణ్ణచేతసా।।**

ఇంద్రియములకు అతీతమైనది, జ్ఞానము చేతనే గ్రహించవలసినది, సుఖానుభూతి ఏ స్థితిలో కలుగుతుందో, ఏ స్థితిలో ఆత్మతత్త్వమునుండి

కదలక ఆత్మదర్శనముతో తృప్తి చెందుచున్నాడో, ఏ స్థితిలో ఇతర దుఃఖములను సహించి, చలించకుండగా ఉంటున్నాడో, ఏ స్థితిలో దుఃఖములు దరిచేరవో, ఆ స్థితిని యోగము అన్నారు. దానిని స్థిరమైన మనస్సు, బుద్ధి, ఏకాగ్రతల తోడనే సాధించాలి.

**24.** సంకల్పప్రభవాన్ కామాన్ త్యక్త్వా సర్వానశేషతః।
మనసైవేంద్రియగ్రామం వినియమ్య సమంతతః।।

సంకల్పము వలన కలిగిన అన్ని కోర్కెలను, సంపూర్ణముగా విడిచిపెట్టాలి. విషయవాంఛలనుండి ఇంద్రియములను మరలించి----

**25.** శనైః శ్శనైరుపరమేత్ బుద్ధ్యా ధృతిగృహీతయా।
ఆత్మసంస్థం మనః కృత్వా న కించదపి చింతయేత్।।

మనస్సుతో ఇంద్రియములను నిగ్రహించి, ధీరుడై ప్రాపంచిక విషయముల నుండి బుద్ధిని దూరం చేసి, మనస్సును ఆత్మయందే నిలిపి, ఎట్టి ఆలోచనలు లేకుండగా ఉంచాలి. దీనినే తత్త్వనిష్ఠ అన్నారు.

**26.** యతో యతో నిశ్చరతి మనశ్చంచల మస్థిరమ్।
తతస్తతో నియమ్యైతత్ ఆత్మన్యేవ వశం నయేత్।।

చంచలమైన మనస్సు విషయములవైపు పరిగెత్తకుండగా నిగ్రహించి, ఆత్మకు అధీనములో ఉంచాలి.

**27.** ప్రశాంతమనసం హ్యేనం యోగినం సుఖముత్తమమ్।
ఉపైతి శాంతరజసం బ్రహ్మభూత మకల్మషమ్।।

ప్రశాంతచిత్తుడు, మనస్వి అయిన యోగిని బ్రహ్మానందానుభూతి తనంతట తానుగా వరిస్తుంది.



**28.** యుంజన్నేవం సదాఽఽత్మానం యోగీ విగతకల్మషః।
సుఖేన బ్రహ్మసంస్పర్శం అత్యంతం సుఖమశ్నుతే।।

ఎటువంటి దోషభావనలు లేకుండగా, మనస్సును యోగమునందే లగ్నము చేసినవాడు, బ్రహ్మజ్ఞానియై శాశ్వతానందమును నిరాటంకముగా పొందుచున్నాడు.

**29.** సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని।
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః।।

అన్ని ప్రాణులయందు సమదృష్టి కలిగి, అన్ని భూతములయందు బ్రహ్మను చూచు శక్తి కలవాడు, తనయందే సర్వభూతములను చూడగలుగుచున్నాడు.

**30.** యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి।
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి।।

సర్వభూతములయందు నన్ను చూచువాడు, నాయందు సర్వభూతములను చూచు పురుషునకు నేను అదృశ్యుడను కాను. అతడు నాకు అదృశ్యుడు కాడు. కృపాదృష్టితో ప్రత్యక్షముగా అతనిని అనుగ్రహిస్తాను.

**31.** సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వమాస్థితః।
సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే।।

భేదభావము లేకుండగా అన్ని ప్రాణులయందు నన్ను చూచుచూ ఎవడు ధ్యానిస్తాడో, అట్టివాడు ఏ స్థితిలో ఉన్ననూ, నాయందే ప్రవర్తిస్తాడు. అనగా ముక్తుడవుతాడు. భ్రష్టుడు కాడు.

**32.** ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున!।
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః।।

అర్జునా! ఎవడైతే అన్ని భూతములయొక్క సుఖమును, తన సుఖముగా భావిస్తాడో, అన్ని భూతములయొక్క దుఃఖమును, తన దుఃఖముగా భావిస్తాడో అతడే శ్రేష్ఠుడని నా అభిప్రాయము.

**అర్జున ఉవాచ:**

**33. యోఽయం యోగస్త్వయా ప్రోక్తః సామ్యేన మధుసూదన!**
**ఏతస్యాహం న పశ్యామి చంచలత్వాత్స్థితిం స్థిరామ్!!**

అర్జునుడు పలికాడు - శ్రీకృష్ణా! మనస్సును స్థిరముగా ఉంచితే కానీ, నీవు చెప్పిన విషయము చేయుట సాధ్యము కాదని నీవే చెపుతున్నావు. కానీ, మనస్సు చంచలమైనది కదా! నీవు చెప్పిన ఈ యోగమును ఏ విధముగా సాధించాలి?

**34. చంచలం హి మనః కృష్ణ! ప్రమాథి బలవద్దృఢమ్।**
**తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్!!**

జీవ ప్రపంచములో గాలిని మనము ఏవిధముగా నిరోధించలేమో, అదే విధముగా నిత్యమూ చలించు స్వభావము కలది, చాలా బలవత్తరమైనది అయిన మనస్సును నిగ్రహించుట సాధ్యము కాదని నేననుకొనుచున్నాను.

**శ్రీ భగవానువాచ:**

**35. అసంశయం మహాబాహో! మనో దుర్నిగ్రహం చలమ్।**
**అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే!!**

శ్రీకృష్ణుడు చెప్పాడు - అర్జునా! నిజమే. మనస్సు నిగ్రహించుటకు వీలుకానంత చంచలమైనది. కానీ అభ్యాస వైరాగ్యముల వలన ఐహిక, పారలౌకిక, విషయతృష్ణ వలన దానిని నిరోధించవచ్చు.

**36. అసంయతాత్మనా యోగః దుష్ప్రాప ఇతి మే మతిః।**
**వశ్యాత్మనా తు యతతా శక్యోఽవాప్తుముపాయతః!!**

మనస్సును నిగ్రహించలేనివాడు, యోగసాధన చెయ్యలేడు. మనోనిగ్రహము ఉండి ఉన్నట్లయితే ఏదో ఒక ఉపాయము చేత కష్టపడి, ప్రయత్నించి అయినా యోగస్థితిని పొందవచ్చు.

**అర్జున ఉవాచ:**

**37. అయతి శ్శ్రద్ధయోపేతః యోగా చ్చలిత మానసః।**
**అప్రాప్య యోగసంసిద్ధిం కాం గతిం కృష్ణ! గచ్ఛతి!!**

అర్జునుడు పలికాడు- కృష్ణా! శ్రద్ధతో యోగసాధనను ఆరంభించినా, నియమములు లేకపోవుటచే యోగభ్రష్టచిత్తుడు యోగసిద్ధిని పొందలేడు. అట్టి వానికి ఏ గతి పడుతుంది?

**38. కచ్చిన్నో భయవిభ్రష్టః ఛిన్నా భ్రమివ నశ్యతి।**
**అప్రతిష్ఠో మహాబాహో! విమూఢో బ్రహ్మణః పథి!!**

బ్రహ్మప్రాప్తి మార్గములో కర్మ ధ్యాన మార్గముల నుండి భ్రష్టుడైనవాడు, విమూఢుడు, నిరాశ్రయుడు అయిన యోగి గాలిచే చెదరగొట్టబడిన మేఘమువలె సర్వవినాశమును పొందడు కదా?

**39. ఏతన్మే సంశయం కృష్ణ! ఛేత్తు మర్హస్యశేషతః।**
**త్వదన్య స్సంశయస్యాస్య ఛేత్తా న హ్యుపపద్యతే!!**

కృష్ణా! నీవొక్కడవే నాలో గల సందేహములను తీర్చగల సమర్థుడివి. ఇతరులైన ఋషులు కానీ, దేవతలు కానీ నాయొక్క సందేహములను తీర్చలేరు. ఇక నాకు నీవే దిక్కు.

శ్రీ భగవానువాచ:

**40.** **పార్థ! నైవేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే।**
**న హి కల్యాణకృత్కశ్చిత్ దుర్గతిం తాత! గచ్ఛతి।।**

భగవంతుడు చెప్పాడు - శుభకర్మలను చేసినవానికి, ఎట్టి దుర్దశ కలుగదు. అతనికి ఈ లోకము నందు కానీ, పర లోకము నందు కానీ, ఎటువంటి వినాశము కలుగదు.

**41.** **ప్రాప్య పుణ్యకృతాం లోకాన్ ఉషిత్వా శాశ్వతీః సమాః।**
**శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే।।**

యోగభ్రష్టుడు కూడా అశ్వమేధాది పుణ్యకర్మలను ఆచరించినవారు పొందుటకు సాధ్యమైన బ్రహ్మాది శుభలోకములను పొందగలడు. అచటనే చాలా కాలము నివసించగలడు. అనంతరం సదాచార సంపన్నులైన ధనికుల గృహముయందు తిరిగి పుట్టగలడు.

**42.** **అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్।**
**ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్।।**

లేదా జ్ఞానయోగులయొక్క వంశము నందు పుట్టగలడు. కానీ అటువంటి జన్మ చాలా దుర్లభమైనది.

**43.** **తత్ర తం బుద్ధిసంయోగం లభతే పౌర్వదేహికమ్।**
**యతతే చ తతో భూయః సంసిద్ధౌ కురునందన।।**

ఆ విధముగా పుట్టినవాడు గత జన్మలో తాను సంపాదించిన యోగసాధన యొక్క పరిపూర్ణత కొరకై ఈ జన్మలో తిరిగి ప్రయత్నము ప్రారంభిస్తాడు.

**44.** **పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోఽపి సః।**
**జిజ్ఞాసురపియోగస్య శబ్దబ్రహ్మాతివర్తతే।।**

పూర్వజన్మ వాసనా బలము చేత యోగమునకు ఆకర్షింపబడి, ప్రారంభదశయందే యుక్త కర్మ ఫలములను దాటి, నిరంతర సాధనలో మునిగిపోతాడు.

**45.** **ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః।**
**అనేకజన్మ సంసిద్ధః తతో యాతి పరాం గతిమ్।।**

ఈ విధముగా జన్మపరంపరల అభ్యాసమువలన యోగి అయినవాడు, పాపపుణ్యరహితుడై జీవిస్తాడు.

**46.** **తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః।**
**కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున!।।**

వేదోక్తమైన కర్మలను చేయువారి కంటే, పరిశుద్ధులైన జ్ఞానులకంటే, తాపసుల కంటే యోగియే సర్వశ్రేష్ఠుడు. కాబట్టి అర్జునా! నీవు కూడా యోగివి కమ్ము.

**47.** **యోగినామపి సర్వేషాం మద్గతేనాంతరాత్మనా!**
**శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః।।**

ఎవడు శ్రద్ధాసక్తుడై నాయందు మనస్సును నిలిపి శ్రద్ధతో నను సేవించుచూ ఉంటాడో, అతడు యోగులందరిలోనూ, గొప్పవానిగా కీర్తించబడుతూ రుద్ర, ఆదిత్యాది దేవతలను ధ్యానించు యోగులకంటే కూడా శ్రేష్ఠుడిగా కీర్తించబడుచున్నాడు.

**ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు, బ్రహ్మవిద్యాయాం, యోగశాస్త్రే, శ్రీకృష్ణార్జున సంవాదే, ఆత్మసంయమయోగో నామ షష్ఠోఽధ్యాయః**

## అథ సప్తమోఽధ్యాయః
## జ్ఞాన విజ్ఞానయోగః

శ్రీభగవానువాచ:

**1.** **మయ్యాసక్తమనాః పార్థ! యోగం యుంజన్ మదాశ్రయః।**
**అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు॥**

భగవంతుడు చెప్పాడు - నాయందే మనస్సును ఉంచి, నన్నే ఆశ్రయించి, యోగరతుడైనవాడు నిస్సందేహముగా నన్ను ఏ విధముగా తెలుసుకొంటాడో విపులంగా చెపుతాను, విను.

**2.** **జ్ఞానం తేఽహం సవిజ్ఞానం ఇదం వక్ష్యామ్యశేషతః।**
**యజ్జ్ఞాత్వా నేహ భూయోఽన్యత్ జ్ఞాతవ్య మవశిష్యతే॥**

దేనిని తెలుసుకొంటే ఇకపై తెలుసుకొనవలసింది ఏదీ ఉండదో, అట్టి అనుభవపూర్వకమైన జ్ఞానమును ఉపదేశిస్తాను.

**3.** **మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే।**
**యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః॥**

వేయిమందిలో ఎవడో ఒకడు మాత్రమే మోక్షము కొరకై ప్రయత్నిస్తున్నాడు. అటువంటి వేయిమంది యతులలో ఎవడో ఒక యతి మాత్రమే నా గురించి తెలుసుకొనగలుగుచున్నాడు.

**4.** **భూమిరాపోఽనలో వాయుః ఖం మనో బుద్ధిరేవ చ।**
**అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతిరష్టధా॥**

నాయొక్క సంకల్పము నుండి పుట్టిన ఈ ప్రకృతి- భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారము అను ఎనిమిది విభాగములుగా చేయబడినది.

**5.** **అపరేయ మితస్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్।**
**జీవభూతాం మహాబాహో! యయేదం ధార్యతే జగత్॥**

అపరా అని పిలువబడే ఈ ప్రకృతి హేయమైనదని, దీనికంటే వేరైనది, జీవరూపమైన సమస్త విశ్వమును ధరించునది అయిన పరాప్రకృతియే గొప్పదని తెలుసుకో.

**6.** **ఏతద్యోనీని భూతాని సర్వాణీత్యుపధారయ।**
**అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రలయస్తథా॥**

సర్వభూతాలు కూడా ఈ రెండు ప్రకృతుల నుండి పుట్టాయి. ఈ ప్రపంచ సృష్టి నాశనమునకు నేనే కారకుడను.

**7.** **మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ॥**
**మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ॥**

అర్జునా! నా కంటే గొప్పదైన జగత్కారణము మరొకటి లేదు. దారముతో కట్టబడిన మణులవలె ఈ జగత్తంతయూ ఆత్మభూతుడనైన నాయందే ధరించబడుతోంది.

**8.** **రసోఽహమప్సు కౌంతేయ! ప్రభాఽస్మి శశిసూర్యయోః।**
**ప్రణవ స్సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు॥**

నీటిలోని రసము (రుచి), సూర్యచంద్రులలోని కాంతి, వేదములలోని ఓంకారము, ఆకాశములోని శబ్దము, పురుషులలోని పౌరుషము ఇవన్నియూ నేనే అయి ఉన్నాను.

**9.** **పుణ్యో గంధః పృథివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ।**
**జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు॥**

భూమియందు పవిత్రమైన వాసనగా, అగ్నియందు తేజస్సుగా, అన్ని జీవులయందు ప్రాణవాయువుగా, తాపసులలో తపస్సుగా, వానప్రస్థాదులలో తపశ్శక్తిగా నేనే విరాజిల్లుతున్నాను.

**10. బీజం మాం సర్వభూతానాం విద్ధి పార్థ! సనాతనమ్।**
**బుద్ధిర్బుద్ధిమతామస్మి తేజస్తేజస్వినామహమ్॥**

అర్జునా! నన్ను అన్ని ప్రాణులకు మూలముగా తెలుసుకో. బుద్ధిమంతులలో బుద్ధిని నేనే. ధీరులలోని ధైర్యమును నేనే. తేజస్వంతులలోని తేజస్సును నేనే అని తెలుసుకో.

**11. బలం బలవతాం చాహం కామరాగవివర్జితమ్।**
**ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ॥**

బలవంతులలో కామరాగములు లేని స్వధర్మానుష్ఠాన బలమును నేనే. జీవులయందు ఉండు శాస్త్ర (ధర్మ) విరుద్ధము కాని కామమును నేనే.

**12. యే చైవ సాత్త్వికా భావాః రాజసా స్తామసాశ్చయే।**
**మత్త ఏవేతి తాన్విద్ధి న త్వహం తేషు తే మయి॥**

జీవులలో గల సాత్త్విక, రాజసిక, తామసికములైన భావములు వారి వారి కర్మల అధీనములై కలుగుతున్నాయి. అవి అన్నియూ నా అధీనములై కలుగుచున్నాయని తెలుసుకో. నేను వాటికి అధీనుడి కాను. అవే నా అధీనంలో ఉంటాయి.

**13. త్రిభిర్గుణమయైర్భావైః ఏభిః సర్వమిదం జగత్।**
**మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్॥**

త్రిగుణములనుండి పుట్టిన రాగద్వేష మోహాది గుణములచేత ప్రాణి సమూహమంతా భ్రాంతిని పొందుతోంది. ఈ భావమునకు అతీతము,



అవ్యయము, నిరుపాధికము అయిన నాయొక్క స్వరూపమును గ్రహించలేక పోతోంది.

**14. దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా।**
**మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే॥**

దివ్యము, త్రిగుణాన్వితము అయిన నా మాయ దాటుటకు శక్యము కానిది. నన్ను శరణు పొందినవారికి మాత్రమే నాయొక్క మాయా తత్త్వము అర్థమౌతుంది.

**15. న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యంతే నరాధమాః।**
**మాయయాఽపహృతజ్ఞానాః ఆసురం భావమాశ్రితాః॥**

రాక్షస భావము గల దుష్కరులు, అజ్ఞులు, నీచులు, మాయచేత కప్పబడిన మేధావులు, దంభులు, క్రోధము కలవారు, దర్పము కలవారు నన్ను ఆశ్రయించలేరు.

**16. చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోఽర్జున!**
**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ!॥**

అర్జునా! విను. ఆపదలయందు ఉన్నవాడు (విపన్నుడు), తత్వజిజ్ఞాసువు (తెలుసుకోవాలనే కోరిక కలవాడు), సంపదలను కోరువాడు, తత్త్వజ్ఞాని అయిన ఈ నలుగురు పుణ్యాత్ములు మాత్రమే నన్ను సేవించగలుగుతారు.

**17. తేషాం జ్ఞానీ నిత్యయుక్తః ఏక భక్తిర్విశిష్యతే।**
**ప్రియో హి జ్ఞానినోఽత్యర్థం అహం స చ మమ ప్రియః॥**

ఈ నలుగురు భక్తులలో జ్ఞాని అయినవాడు ఎల్లప్పుడు నా యందే మనస్సు నిలుపుకొని ధ్యానయోగముతో నన్ను సేవిస్తూ ఉంటాడు. అందువలన అందరి కంటే అతడు శ్రేష్ఠుడు. నాకు అతడంటే చాలా ఇష్టం. అతనికి నేనన్నా చాలా ఇష్టమే.

**18.** **ఉదారా స్సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్।**
**ఆస్థిత స్స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్।।**

పై నలుగురూ ఉత్తములే. కానీ జ్ఞాని మాత్రము నా ఆత్మస్వరూపుడు. సర్వవిధములా నన్నే ఆశ్రయించి ఉంటాడు.

**19.** **బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే।**
**వాసుదేవ స్సర్వమితి స మహాత్మా సుదుర్లభః।।**

అనేక జన్మల తరువాత చివరి జన్మలో వాసుదేవుడే సమస్తము అని గ్రహించిన జ్ఞాని, నన్నే సేవిస్తూ ఉంటాడు. కానీ, ఇటువంటి మహాత్ములు చాలా తక్కువమంది ఉంటారు.

**20.** **కామై స్తై స్తైర్హృతజ్ఞానాః ప్రపద్యంతేఽన్యదేవతాః।**
**తం తం నియమమాస్థాయ ప్రకృత్యా నియతా స్స్వయా।।**

సామాన్యులు కోరికలచేత కొల్లగొట్టబడిన తెలివిగలవారై వారి వారి కోరికలను తీర్చుకొనుట కొరకు అనేక నియమములను పాటిస్తూ, ఇతర దేవతలను ఉపాసన చేస్తూ ఉంటారు.

**21.** **యో యో యాంయాంతనుం భక్తః శ్రద్ధయాఽర్చితుమిచ్ఛతి।**
**తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్।।**

ఎవరు ఏ రూపాన్ని ఆరాధిస్తే వారికి ఆ దేవతయందే శ్రద్ధ, భక్తి, విశ్వాసము కలుగు విధంగా నేనే చేస్తాను.

**22.** **స తయా శ్రద్ధయా యుక్తః తస్యారాధన మీహతే।**
**లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హి తాన్।।**

ఏ దేవతను ఆరాధిస్తారో, ఆ దేవతా పరముగా తమ కోర్కెలు తీరుచున్నవని భక్తులు తృప్తిపడుచున్నారు గానీ, నిజమునకు వారికి అట్టి కోర్కెలను కల్పించువాడను నేనే, తీర్చువాడను నేనే.

**23.** **అంతవత్తు ఫలం తేషాం తద్భవత్యల్పమేధసామ్।**
**దేవాన్ దేవయజో యాంతి మద్భక్తా యాంతి మామపి।।**

స్వల్ప జ్ఞానులైన అట్టి దేవతారాధకులు, వారిని ఉపాసించినవారు, అందరూ చివరకు నన్నే పొందుతారు.

**24.** **అవ్యక్తం వ్యక్తిమాపన్నం మన్యంతే మామబుద్ధయః।**
**పరం భావమజానంతః మమావ్యయమనుత్తమమ్।।**

నిర్వికారము, ఉత్కృష్టము, సర్వాతీతము అయిన నాయొక్క రూపమును గుర్తించలేక, అవ్యక్తుడనైన నన్ను కొందరు అజ్ఞానులు వ్యక్తునిగా భావిస్తున్నారు.

**25.** **నాహం ప్రకాశ స్సర్వస్య యోగమాయా సమావృతః।**
**మూఢోఽయం నాభిజానాతి లోకో మామజమవ్యయమ్।।**

నేను యోగమాయతో కూడినవాడిని అగుట చేత చావు, పుట్టుకలు లేని శాశ్వతునిగా నన్ను అజ్ఞానులు తెలుసుకొనలేరు.

**26.** **వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున!।**
**భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన।।**

భూత భవిష్యద్వ ర్తమాన కాలములలోని అన్ని జీవులను నేను ఎఱుగుదును. కానీ వారికి నేను తెలియదు.

**27.** **ఇచ్ఛాద్వేష సముత్థేన ద్వంద్వమోహేన భారత!।**
**సర్వభూతాని సమ్మోహం సర్గే యాంతి పరంతప!।।**

పరంతపా! ప్రాణులకు స్థూలదేహము వచ్చిన వెంటనే రాగద్వేషాదులు వస్తున్నాయి. వాటిచేత జీవులు నన్ను తెలుసుకొన లేకపోవుచున్నారు. నన్ను పొందలేక పోవుచున్నారు.

**28.** **యేషాం త్వంతగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్।**
**తే ద్వంద్వమోహనిర్ముక్తాః భజంతే మాం దృఢవ్రతాః।।**

పాపరహితులైన పుణ్యాత్ములు మాత్రమే, సుఖదుఃఖములతో కూడిన ద్వంద్వముల నుండి పుట్టిన మోహాదులు లేనివారై నన్ను సేవించ గలుగుచున్నారు.

**29.** **జరామరణ మోక్షాయ మామాశ్రిత్య యతంతి యే**
**తే బ్రహ్మ తద్విదుః కృత్స్నం అధ్యాత్మం కర్మ చాఖిలమ్।।**

ఎవరైతే ముసలితనము, మరణముల నుండి విముక్తి పొందుటకై నన్ను ఆశ్రయించి, ఉపాసన చేస్తారో, అట్టి వారు మాత్రమే కర్మతత్త్వమును, బ్రహ్మతత్త్వమును, బ్రహ్మజ్ఞానమును పొందగలుగుచున్నారు.

**30.** **సాధిభూతాధిదైవం మాం సాధియజ్ఞం చ యే విదుః।**
**ప్రయాణకాలేఽపి చ మాం తే విదుర్యుక్తచేతసః।।**

ఆధిభూత, ఆధిదైవ, ఆధియజ్ఞములతో కూడిన నన్ను ఎవరు తెలుసుకొంటారో వారు మాత్రమే మరణ సమయంలో నన్ను మరిచిపోకుండగా గుర్తించగలుగుతారు.

**ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు, బ్రహ్మవిద్యాయాం, యోగశాస్త్రే, శ్రీకృష్ణార్జున సంవాదే, జ్ఞానవిజ్ఞానయోగోనామ సప్తమోఽధ్యాయః**



## అథ అష్టమోఽధ్యాయః
## అక్షర పరబ్రహ్మయోగః (అభ్యాసయోగః)

**అర్జున ఉవాచ:**

**1.** **కిం తద్బ్రహ్మ కిమధ్యాత్మం కిం కర్మ పురుషోత్తమ!।**
**అధిభూతం చ కిం ప్రోక్తం అధిదైవం కిముచ్యతే।।**

**2.** **అధియజ్ఞః కథం కోఽత్ర దేహేఽస్మిన్ మధుసూదన!।**
**ప్రయాణకాలే చ కథం జ్ఞేయోఽసి నియతాత్మభిః।।**

అర్జునుడు పలికాడు - శ్రీకృష్ణా! బ్రహ్మము అంటే ఏమిటి? అధ్యాత్మము అంటే ఏమిటి? కర్మ అంటే ఏమిటి? ఆధిభూతమంటే ఏమిటి? ఆధి దైవమంటే ఏమిటి? ఈ దేహములో ఆధి యజ్ఞుడు ఎవరు? అతడే విధంగా ఉంటాడు? మరణసమయంలో యోగులు నిన్ను ఏ విధంగా తెలుసుకొంటారు? అను ఎనిమిది ప్రశ్నలు అడిగాడు.

**శ్రీభగవానువాచ-**

**3.** **అక్షరం బ్రహ్మ పరమం స్వభావోఽధ్యాత్మముచ్యతే।**
**భూతభావోద్భవకరః విసర్గః కర్మ సంజ్ఞితః।।**

భగవంతుడు చెప్పాడు - నాశనం లేనిది, సర్వోత్కృష్టమైనది బ్రహ్మమే. ప్రకృతి సంబంధించిన స్వభావాదులే అధ్యాత్మము. భూతోత్పత్తికి ఏర్పడిన సంఘటనలే కర్మ.

**4.** **అధిభూతం క్షరో భావః పురుషశ్చాధిదైవతమ్।**
**అధియజ్ఞోఽహమేవాత్ర దేహే దేహభృతాం వర!।।**

నాశనమగు పదార్థము అధిభూతము అని చెప్పబడుతోంది. పురుషుడే అధిదైవతుడు. అన్ని దేహములయందు అంతర్యామిగా ఉన్న నేనే అధియజ్ఞుడను.

**5.** **అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కలేవరమ్।**
**యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః।।**

మరణ సమయము నందు కూడా నన్నే తలుచుకొనుచూ, శరీరమును విడిచిపెట్టినవాడు, తప్పక నన్ను పొందగలడు.

**6.** **యం యం వాఽపి స్మరన్ భావం త్యజత్యంతే కలేవరమ్।**
**తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః।।**

అర్జునా! అంత్యకాలములో ఎవడు ఏ భావనలతో మరణిస్తాడో, వాడు ఆ భావనలకు సంబంధించిన స్థితిని పొందు చున్నాడు.

**7.** **తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ।**
**మయ్యర్పిత మనోబుద్ధిః మామేవైష్యస్యసంశయమ్।।**

కాబట్టి నీవు నిత్యమూ నన్నే స్మరించుచూ, యుద్ధమును చెయ్యి. నీ మనస్సును, నీ బుద్ధిని, నాయందు నిలిపితే నన్నే పొందుతావు. అనుమానము లేదు.

**8.** **అభ్యాసయోగయుక్తేన చేతసా నాన్యగామినా।**
**పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచింతయన్।।**

అర్జునా! అభ్యాసయోగముచేత ఇతర విషయములపైకి ప్రసరించని మనస్సుతో సర్వాతీతుడనైన నన్ను పరమపురుషునిగా ధ్యానించు. ఈ విధంగా ధ్యానం చేయు యోగి భగవంతుడిలో లీనమౌతాడు.

**9.** **కవిం పురాణమనుశాసితారం అణోరణీయాంసమనుస్మరేద్యః।**
**సర్వస్య ధాతారమచింత్యరూపం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్।।**

**10.** **ప్రయాణకాలే మనసాఽచలేన**
**భక్త్యా యుక్తో యోగబలేన చైవ।**
**భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సమ్యక్**
**సతం పరం పురుషముపైతి దివ్యమ్।।**

ఎవడైతే మరణ సమయమున యోగసాధనా బలముతో రెండు కనుబొమ్మలయొక్క మధ్యభాగమున ప్రాణవాయువును నిలిపి, కవియైనవాడు (సర్వవిద్యా నిర్మాత), పురాణపురుషుడు (సనాతనుడు), జగన్నియామకుడు, అణువు కంటే చిన్న రూపం కలవాడు, సమస్త ప్రపంచమునకు ఆధారమైన వాడు, ఊహించలేని స్వరూపము కలవాడు, సూర్య తేజస్కుడు, అజ్ఞానాంధకార ప్రకృతికి అవతల ఉండు వాడు అయిన పరమాత్మను భక్తిభావనతో ధ్యానిస్తాడో అతడు పరమాత్మనే పొందుతాడు.

**11.** **యదక్షరం వేదవిదో వదంతి విశంతి యద్యతయో వీతరాగాః।**
**యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే।।**

వేదవేత్తలు, దేనిని నాశనం లేనిదానిగా చెప్పుచున్నారో, నిష్కాముకులైన యతులు కూడా దేనిని కోరుచున్నారో, దేనిమీద కాంక్షతో బ్రహ్మచర్యాది వ్రతములు చేయుచున్నారో, అట్టి దివ్య పదమును గూర్చి సంక్షిప్తముగా చెపుతాను.

**12.** **సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్యచ।**
**మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణం ఆస్థితో యోగధారణామ్।।**

**13.** **ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్।**
**యః ప్రయాతి త్యజన్ దేహం స యాతి పరమాం గతిమ్।।**

నవద్వారములలో బంధించి, ఇంద్రియములను నిగ్రహించి, చిత్త వృత్తులను నిరోధించి, ప్రాణమును సహస్రార చక్రమున నిలిపి, బ్రహ్మపరమైన ఏకాక్షరమగు ఓంకారమును ధ్యానిస్తూ, నన్నే స్మరిస్తూ, నిశ్చలమైన మనస్సుతో దేహమును త్యజించినవాడు అత్యంత ఉత్కృష్టమైన మోక్షమును పొందుచున్నాడు.

**14. అనన్యచేతా స్సతతం యో మాం స్మరతి నిత్యశః।**
**తస్యాహం సులభః పార్థ! నిత్యయుక్తస్య యోగినః॥**

అర్జునా! ఇతరములైన ఆలోచనలు లేకుండగా, నిత్యమూ నన్నే స్మరించువారికి నేను సులభసాధ్యుడను అవుతాను.

**15. మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయ మశాశ్వతమ్।**
**నాప్నువంతి మహాత్మానః సంసిద్ధిం పరమాం గతాః॥**

నన్ను ఆశ్రయించి, నన్ను నమ్మినవారు, దుఃఖభూయిష్ఠమైన, అశాశ్వతమైన, వాసనావాసితమైన, మోహకలుషితమైన ఈ ప్రపంచమున తిరిగి జన్మించరు. నాయందే లీనమైపోతారు.

**16. ఆ బ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున॥**
**మాముపేత్య తు కౌంతేయ! పునర్జన్మ న విద్యతే॥**

అర్జునా! బ్రహ్మలోక పర్యంతమూ, జీవకోటికి పునర్జన్మలు ఉన్నాయే కానీ, నన్ను చేరిన వారికి మాత్రము ఉండవు.

**17. సహస్రయుగ పర్యంతం అహర్యద్బ్రహ్మణో విదుః।**
**రాత్రిం యుగ సహస్రాంతాం తేఽహోరాత్రవిదో జనాః॥**

బ్రహ్మకు వేయి యుగములు ఒక పగలు. వేయి యుగములు ఒక రాత్రి. ఇది తెలిసినవాడు కాలవేత్త అగుచున్నాడు.



**18. అవ్యక్తాద్వ్యక్తయ స్సర్వాః ప్రభవంత్యహరాగమే।**
**రాత్ర్యాగమే ప్రలీయంతే తత్రైవావ్యక్త సంజ్ఞకే॥**

బ్రహ్మయొక్క పగటి కాలమున అవ్యక్త ప్రకృతి నుండి పుట్టిన సృష్టి తిరిగి రాత్రి సమయమున అతని అవ్యక్తమునందే కలిసిపోవుచున్నది.

**19. భూతగ్రామ స్స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే।**
**రాత్ర్యాగమేఽవశః పార్థ! ప్రభవత్యహరాగమే॥**

అర్జునా! సృష్టిలోని ఈ భూత ప్రపంచమంతా, బ్రహ్మయొక్క రాత్రి భాగమున అతనిలో లీనమై, పగటి కాలమున తిరిగి పుడుతోంది.

**20. పరస్తస్మాత్తు భావోఽన్యః అవ్యక్తోఽవ్యక్తాత్సనాతనః।**
**యస్స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి॥**

ఇటువంటి ఈ ప్రకృతి కంటే, పరమైనది, ప్రియమైనది, శాశ్వతమైనది, పరబ్రహ్మము మాత్రమే. భూతములన్నియూ నశించిననూ, పరబ్రహ్మమునకు నాశనం లేదు.

**21. అవ్యక్తోఽక్షర ఇత్యుక్తః తమాహుః పరమాం గతిమ్।**
**యం ప్రాప్య న నివర్తంతే తద్ధామ పరమం మమ॥**

ఇంద్రియములకు కనబడనిది, నాశనము లేనిది అని చెప్పబడు ఆ పరమపదమే నాయొక్క నివాసస్థానము. దానిని పొందినవారికి పునర్జన్మ ఉండదు.

**22. పురుషస్స పరః పార్థ! భక్త్యా లభ్యస్త్వనన్యయా।**
**యస్యాంతస్స్థాని భూతాని యేన సర్వమిదం తతమ్॥**

అర్జునా! సమస్త ప్రాణులు ఎవడి యందు ఉన్నాయో, ఎవడైతే సమస్త జగత్తుయందు వ్యాపించి ఉన్నాడో, అట్టి పరమాత్మ భక్తసులభుడు అని తెలుసుకో.

**23.** యత్ర కాలే త్వనావృత్తిం ఆవృత్తిం చైవ యోగినః।
ప్రయాతా యాంతి తం కాలం వక్ష్యామి భరతర్షభ!।।

అర్జునా! ఏయే కాలములయందు మరణిస్తే ముక్తి లభిస్తుందో, ఏయే సమయమున మరణిస్తే పునర్జన్మ లభిస్తుందో చెపుతాను విను.

**24.** అగ్నిర్జ్యోతిరహ శ్శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్।
తత్ర ప్రయాతా గచ్ఛంతి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః।।

అగ్ని, జ్యోతి, పగలు, శుక్లపక్షము, షణ్మాసయుక్తమైన ఉత్తరాయణము గల దేవయానమార్గంలో మరణిస్తే వారు తిరిగి పుట్టరు.

**25.** ధూమో రాత్రిస్తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్।
తత్ర చాంద్రమసం జ్యోతిః యోగీ ప్రాప్య నివర్తతే।।

ధూమము, రాత్రి, కృష్ణపక్షము, ఆరు మాసములు గల దక్షిణాయనము అను వాటితో కూడిన పితృయాన మార్గమున మరణించినవారు చంద్రలోకమునకు వెళ్లి తిరిగి భూలోకములో జన్మిస్తారు.

**26.** శుక్లకృష్ణే గతీ హ్యేతే జగత శ్శాశ్వతే మతే।
ఏకయా యాత్యనావృత్తిం అన్యయాఽఽవర్తతే పునః।।

శుక్లగతి, కృష్ణగతి అని పిలువబడు ఈ రెండు మార్గములయందు మొదటి దానివలన ముక్తి, రెండవదానివల్ల జన్మ లభిస్తాయి.

**27.** నైతే సృతీ పార్థ! జానన్ యోగీ ముహ్యతి కశ్చన।
తస్మాత్సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున!।।

అర్జునా! వీటిని తెలుసుకొనిన యోగి విభ్రాంతిని చెందడు. కాబట్టి నీవు నిత్యమూ యోగయుక్తుడవై ఉండు.

**28.** వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ
దానేషు యత్పుణ్యఫలం ప్రదిష్టమ్।
అత్యేతి తత్సర్వమిదం విదిత్వా
యోగీ పరం స్థానముపైతి చాద్యమ్।।

నేను చెప్పిన విషయములను గ్రహించిన జ్ఞాని వేదాధ్యయనము, యజ్ఞానుష్ఠానము, తపస్సు, దానము అను వాటి వలన శాస్త్రములయందు చెప్పబడిన పుణ్యఫలమును గ్రహించి శాశ్వత బ్రహ్మత్వమును పొందుచున్నాడు.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు, బ్రహ్మవిద్యాయాం, యోగశాస్త్రే, శ్రీకృష్ణార్జున సంవాదే, అక్షరపరబ్రహ్మ యోగోనామ అష్టమోఽధ్యాయః

## అథ నవమోఽధ్యాయః
## రాజవిద్యారాజగుహ్యాయోగః

శ్రీభగవానువాచ:

**1.** ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యామ్యనసూయవే।
జ్ఞానం విజ్ఞాన సహితం యజ్జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్।।

భగవంతుడు చెప్పాడు- అర్జునా! దేనిని తెలుసుకొంటే, నీవు సంసార దుఃఖముల నుండి తరిస్తావో అటువంటి విజ్ఞానరూపమైన రహస్యాన్ని ఉపదేశిస్తాను.

**2.** రాజవిద్యా రాజగుహ్యం పవిత్రమిదముత్తమమ్।
ప్రత్యక్షావగమం ధర్మ్యం సు సుఖం కర్తుమవ్యయమ్।।

ఇది చాలా రహస్యమైనది. ఉత్తమమైనది. ప్రత్యక్ష ఫలమునిచ్చునది. ధర్మయుక్తమైనది. సులభమైనది. శాశ్వతమైనది. సహజముగా సిద్ధించునది.

**3.** అశ్రద్దధానాః పురుషాః ధర్మస్యాస్య పరంతప!।
అప్రాప్య మాం నివర్తంతే మృత్యుసంసారవర్త్మని।।

పరంతపా! నేను చెప్పబోవు ఈ ధర్మములను శ్రద్ధగా చేయనివారు నా దగ్గరకు రాలేరు. జన్మమృత్యుమయమైన సంసారకూపములో పడుతున్నారు.

**4.** మయా తతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా।
మత్స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః।।

నిరాకారుడనైన నేనే ఈ సృష్టినంతటినీ వ్యాపించి ఉన్నాను. సర్వభూతములన్నియూ నాయందే ఉన్నాయి. కానీ నేను వాటియందు లేను.

**5.** న చ మత్స్థాని భూతాని పశ్య మే యోగమైశ్వరమ్।
భూతభృన్న చ భూతస్థః మమాత్మా భూతభావనః।।

భూతకోటి నన్ను అంటిపెట్టుకొని ఉండదు. నాయొక్క ఈశ్వరశక్తిని గ్రహించు. నా స్వరూపమే ఈ ప్రాణులను సృష్టిస్తోంది. పోషిస్తోంది. అయినప్పటికీ వాటిని ఆధారముగా చేసుకొని మాత్రం ఉండదు.

**6.** యథాఽఽకాశస్థితో నిత్యం వాయు స్సర్వత్రగో మహాన్।
తథా సర్వాణి భూతాని మత్స్థానీత్యుపధారయ।।

అన్ని చోట్లా వ్యాపించిన వాయువు ఆకాశమందే ఉన్నట్లుగా, ఈ ప్రాణులన్నియూ నాయందే ఉంటున్నాయి.

**7.** సర్వభూతాని కౌంతేయ! ప్రకృతిం యాంతి మామికామ్।
కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజామ్యహమ్।।

అర్జునా! ప్రళయకాలంలో అన్ని ప్రాణులూ నా మాయలోనే లయమైపోతున్నాయి. సృష్టి యొక్క ప్రారంభంలో వాటిని మరల నేనే పుట్టింపజేస్తాను.

**8.** ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః।
భూతగ్రామమిమం కృత్స్నం అవశం ప్రకృతేర్వశాత్।।

ప్రకృతికి లోబడిన ఈ ప్రాణులన్నింటినీ తదతీతమైన నాయొక్క మాయతో మరల మరల నేనే పుట్టిస్తున్నాను.

**9.** న చ మాం తాని కర్మాణి నిబధ్నంతి ధనంజయ!।
ఉదాసీనవదాసీనం అసక్తం తేషు కర్మసు।।

అయినప్పటికీ ఆయా కర్మలయందు నేను ప్రవేశించను. తటస్థముగా ఉంటాను. అందువలన ఆ కర్మలు నన్ను బాధించవు.

**10.** మయాఽధ్యక్షేణ ప్రకృతిః సూయతే స చరాచరమ్।
హేతునాఽనేన కౌంతేయ! జగద్విపరివర్తతే।।

సర్వాధికారినైన నాయొక్క సంకల్ప బలమువలన ఈ చరాచర జగత్తును కూడా నాయొక్క మాయచేత సృష్టించి, ప్రవర్తింప చేస్తున్నాను.

**11.** అవజానంతి మాం మూఢాః మానుషీం తనుమాశ్రితమ్।
పరం భావమజానంతః మమ భూతమహేశ్వరమ్।।

సర్వభూత నియంతనైన నాయొక్క తత్త్వమును తెలుసుకొనలేనివారు నన్ను సామాన్యుడిగా భావించి తిరస్కరిస్తారు.

**12.** మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః।
రాక్షసీమాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః।।

అటువంటి వారు వ్యర్థమైన ఆశలతో, వ్యర్థమైన కర్మలు చేస్తూ, అజ్ఞానము చేత వివేకశూన్యులై ఆసురీ భావమునకు లొంగిపోతున్నారు.

**13.** మహాత్మానస్తు మాం పార్థ! దైవీం ప్రకృతి మాశ్రితాః।
భజంత్యనన్యమనసః జ్ఞాత్వా భూతాది మవ్యయమ్।।

పార్థుడా! సాత్త్వికులైన కొందరు మహాత్ములు కామాదులకు లొంగక దైవీ స్వభావాన్ని స్వీకరించి, ఈ ప్రపంచమునకు నేనే మూలాధారుడనని, నాశరహితుడనని, నా కంటే వేరుగా వేరొక వస్తువు లేదని తెలిసికొని నిశ్చలమైన భక్తితో నన్నే సేవిస్తున్నారు.

**14.** సతతం కీర్తయంతో మాం యతంతశ్చ దృఢవ్రతాః।
నమస్యంతశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే।।

బ్రహ్మజ్ఞాన జిజ్ఞాసులైన అటువంటివారు ఎల్లప్పుడూ నన్నే ప్రార్థిస్తూ, నాకు భక్తులై నన్ను ఉపాసన చేస్తున్నారు.

**15.** జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజంతో మాముపాసతే।
ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖమ్।।

కొందరు జ్ఞానయోగులై సర్వాత్మ దర్శనరూపమైన జ్ఞానయజ్ఞముతో నన్ను ఉపాసిస్తున్నారు. మరికొందరు ఏకత్వభావనతో అనగా జీవాత్మ పరమాత్మలకు భేదము లేదు అను అభేదబుద్ధితో ధ్యానిస్తున్నారు. మరికొందరు దాసోహమను భావముతో సేవిస్తున్నారు. మరికొందరు ద్వైతులుగా, అద్వైతులుగా నన్నే సేవిస్తున్నారు.

**16.** అహం క్రతురహం యజ్ఞః స్వధాఽహ మహమౌషధమ్।
మంత్రోఽహ మహమేవాజ్యం అహమగ్నిరహం హుతమ్।।

అగ్నిష్టోమము మొదలైన శ్రౌతయజ్ఞములు, స్మార్తకర్మలు, శ్రాద్ధకర్మలు, పితృకర్మలు, ఓషధులు, మంత్రములు, హోమములు, హోమాగ్నులు, హోమ ఘృతములు, హవిస్సులు ఇవన్నీ నేనే.

**17.** పితాఽహమస్య జగతః మాతా ధాతా పితామహః।
వేద్యం పవిత్రమోంకారః ఋక్సామ యజురేవ చ।।

ఈ ప్రపంచమునకు తల్లి, తండ్రి, తాత, ముత్తాత నేనే, రక్షించువాడను నేనే. కర్మఫలములను ఇచ్చువాడను నేనే. తెలుసుకొనదగినవాడను నేనే. ప్రణవస్వరూపమును నేనే. ఋగ్యజుస్సామవేదములను నేనే.

**18.** గతిర్భర్తా ప్రభుస్సాక్షీ నివాస శ్శరణం సుహృత్।
ప్రభవః ప్రలయ స్స్థానం నిధానం బీజమవ్యయమ్।।

ఆశ్రయము, ప్రభువు, కర్మసాక్షి, ఆధారము, హితుడు, సృష్టి స్థితి లయకారకుడు, ప్రాణులకు భోగములను ఇచ్చువాడు, ప్రాణములు నశించుటకు కారణమైనవాడు కూడా నేనే.

**19.** తపామ్యహమహం వర్షం నిగృహ్ణామ్యుత్సృజామి చ।
అమృతం చైవ మృత్యుశ్చ సదసచ్చాహమర్జున!।।

తపింప చేయువాడను నేనే. వర్షమును కురిపించువాడను నేనే. అమృతమును నేనే. విషమును నేనే. సత్, అసత్ రెండూ నాయొక్క స్వరూపములే.

**20.** త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా
యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయంతే।
తే పుణ్యమాసాద్య సురేంద్రలోకం
అశ్నంతి దివ్యాన్ దివి దేవభోగాన్।।

ఎవరైతే వేదవిహితములైన యజ్ఞకర్మలచేత నన్ను పూజించి, సోమపానం చేత తమ పాపములను పోగొట్టుకొని స్వర్గము కోరుచున్నారో, అట్టివారు స్వర్గలోకంలో స్వర్గభోగములను అనుభవిస్తున్నారు.

**21.** తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం
క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి।
ఏవం త్రయీధర్మమనుప్రపన్నాః
గతాగతం కామకామా లభంతే।।

వారియొక్క పుణ్యఫలము క్షీణించిన వెంటనే తిరిగి మానవ లోకంలో జన్మిస్తున్నారు. ఈ విధముగా వేదోక్త ధర్మమును అనుసరించి, భోగ పరాయణులైన కొందరు సంసారంలో తిరుగుతున్నారు. వీరికి జనన మరణములు తప్పవు.

**22.** అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్।।

వేరే ఆలోచనలు లేకుండగా నిత్యము నన్నే నమ్ముకొని, నా ధ్యానములోనే ఉంటూ, నన్నే సేవించువారియొక్క యోగక్షేమములను నేనే చూసుకొంటాను.

**23.** యేఽప్యన్యదేవతా భక్తాః యజంతే శ్రద్ధయాన్వితాః।
తేఽపి మామేవ కౌంతేయ యజంత్యవిధిపూర్వకమ్।।

అర్జునా! శ్రద్ధాభక్తులతో ఇతర దేవతలను పూజించినవారు కూడా నన్ను సేవించినవారే అవుతారు. కానీ వారి పూజావిధానము శాస్త్రీయమైనది కాదు.

**24.** అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ।
న తు మామభిజానంతి తత్త్వేనాతశ్చ్యవంతి తే।।

అన్ని యజ్ఞములయొక్క స్వరూపము, సర్వయజ్ఞ ఫలభోక్త అయిన నాయొక్క నిజస్వరూపమును గుర్తించలేక కొందరు వివిధ దేవతలను ఆరాధించి, మరల మరల పుట్టుచూ, మరల మరల చనిపోవుచూ కాలచక్రంలో తిరుగుచున్నారు.

**25.** యాంతి దేవవ్రతా దేవాన్ పితౄన్ యాంతి పితృవ్రతాః।
భూతాని యాంతి భూతేజ్యాః యాంతి మద్యాజినోఽపిమామ్।।

దేవతలను పూజించువారు దేవలోకములను, పితరులను పూజించువారు పితృలోకములను, భూతగణములను సేవించువారు భూతలోకములను పొందుచున్నారు. ఎవరు నన్ను నేరుగా సేవిస్తున్నారో వారు నాయందే లీనమవుతున్నారు.

**26.** పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి।
తదహం భక్త్యుపహృతం అశ్నామి ప్రయతాత్మనః।।

ఎవరైనా సరే, ఆకును గానీ, పూవును గానీ, పండును గానీ, చివరకు నీటిని గానీ, అచంచలమైన భక్తితో నాకు సమర్పించినచో దానిని నేను ప్రేమతో స్వీకరిస్తాను.

**27.** **యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్।**
**యత్తపస్యసి కౌంతేయ! తత్కురుష్వ మదర్పణమ్॥**

అర్జునా! నీవు ఏ పనిని చేస్తున్నావో, దేనిని భుజిస్తున్నావో, దేనిని హోమం చేస్తున్నావో, దేనిని దానం చేస్తున్నావో, దేని కొరకై తపిస్తున్నావో, ఆ సమస్తమును నాకే సమర్పించు.

**28.** **శుభాశుభఫలైరేవం మోక్ష్యసే కర్మబంధనైః।**
**సన్న్యాసయోగయుక్తాత్మా విముక్తో మాముపైష్యసి॥**

అప్పుడు పుణ్యపాపములనే కర్మబంధముల నుండి జీవుడు విముక్తుడు అవుతాడు. ఇట్టి సన్న్యాస యోగమును అవలంబించినచో జీవన్ముక్తుడై నా యందు కలిసిపోతాడు.

**29.** **సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః।**
**యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్॥**

అన్ని భూతములయందు నాయొక్క సమభావమే ఉంటోంది. నాకు దేనియందు ఇష్టత లేదు. అనిష్టత లేదు. భక్తితో నన్ను సేవించినవారే నాయందు ఉంటారు. నేను వారియందు ఉంటాను.

**30.** **అపి చేత్సుదురాచారః భజతే మామనన్యభాక్।**
**సాధురేవ స మంతవ్యః సమ్యగ్వ్యవసితో హి సః॥**

స్థిరమైన భక్తితో నన్ను సేవించువాడు, ఎంతటి దురాచార పరాయణుడైనా, అతడు సాధువుగా పరిగణింపబడుతున్నాడు.

**31.** **క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి।**
**కౌంతేయ! ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి॥**

అట్టి దురాచారుడు తక్కువ సమయములోనే తనయొక్క దుష్టాచారములను విడిచి, ధర్మమార్గ పరుడై పరమశాంతిని పొందుతాడు. అర్జునా! నాయొక్క భక్తుడెవడూ చెడిపోడని ప్రతిజ్ఞ చేసి చెపుతున్నాను.

**32.** **మాం హి పార్థ! వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః।**
**స్త్రియో వైశ్యాస్తథా శూద్రాః తేఽపి యాంతి పరాం గతిమ్॥**

అర్జునా! స్త్రీలు, వైశ్యులే కాదు, ఎట్టి పాపజాతివారైనా నన్నే ఆశ్రయించినచో వారు మోక్షమును పొందుతారు.

**33.** **కిం పునర్బ్రాహ్మణాః పుణ్యాః భక్తా రాజర్షయస్తథా।**
**అనిత్యమసుఖం లోకం ఇమం ప్రాప్య భజస్వ మామ్॥**

పుణ్యవ్రతులైన బ్రాహ్మణులు, భక్తులు, రాజర్షులు, నన్ను ఆశ్రయించి, మోక్షము పొందుచున్నారని వేరుగా చెప్పవలసిన అవసరము లేదు కదా!

**34.** **మన్మనా భవ మద్భక్తః మద్యాజీ మాం నమస్కురు।**
**మామేవైష్యసి యుక్త్వైవం ఆత్మానం మత్పరాయణః॥**

నాయందు మనస్సు నిలిపి, నన్నే సేవించుచూ, నన్ను నమ్మి, నాకే నమస్కారము చెయ్యి. నాయందే నీయొక్క దృష్టిని నిలుపు. అప్పుడు నీవు నాతో సమానమైన ఆనందమును పొందగలవు.

**ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు, బ్రహ్మవిద్యాయాం, యోగశాస్త్రే, శ్రీకృష్ణార్జున సంవాదే, రాజవిద్యారాజగుహ్యాయోగోనామ నవమోఽధ్యాయః**

## అథ దశమోఽధ్యాయః

## విభూతియోగః

శ్రీభగవానువాచ:

**1.** భూయ ఏవ మహాబాహో! శృణు మే పరమం వచః।
యత్తేఽహం ప్రీయమాణాయ వక్ష్యామి హితకామ్యయా॥

భగవంతుడు చెప్పాడు - అర్జునా! నా మాటలను విని నీవు సంతోషమును పొందుచున్నావు. కావున నీ మంచిని కోరి, నేను చెప్పబోవు ఈ విషయములను కూడ శ్రద్ధగా విను.

**2.** న మే విదు స్సురగణాః ప్రభవం న మహర్షయః।
అహమాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశః॥

నాయొక్క ఉత్పత్తిని గూర్చి దేవతలుగానీ, ఋషులుగానీ తెలుసుకొనలేరు. ఎందువలననగా, వారికి కూడా ఆదికారణమును నేనే.

**3.** యో మామజమనాదిం చ వేత్తి లోకమహేశ్వరమ్।
అసంమూఢ స్స మర్త్యేషు సర్వపాపైః ప్రముచ్యతే॥

నాకు మొదలు లేదు. చివర లేదు. సర్వలోకములకు నేనే ప్రభువును అని తెలుసుకొనినవాడు మోహరహితుడై అన్ని పాపముల నుండి మోక్షమును పొందుచున్నాడు.

**4.** బుద్ధిర్ జ్ఞానమసమ్మోహః క్షమా సత్యం దమ శ్శమః।
సుఖం దుఃఖం భవోఽభావః భయం చాభయమేవ చ॥

**5.** అహింసా సమతా తుష్టిః తపో దానం యశోఽయశః।
భవంతి భావా భూతానాం మత్త ఏవ పృథగ్విధాః॥

సూక్ష్మవిషయ గ్రహణ సామర్థ్యము గల బుద్ధి, ఆత్మ మొదలగు పదార్థములయొక్క జ్ఞానము, మోహము లేకపోవుట, ఓర్పు, సత్యము, సహిష్ణుత, శమదమాది ఇంద్రియనిగ్రహము, ఆనందము, ఆవేదన, పుట్టుట, పుట్టకపోవుట, భయము, నిర్భయత్వము, అహింస, సమదృష్టి, దానము, యశస్సు, కీర్తి, అపకీర్తి మొదలగు గుణములన్నీ ప్రాణులయందు నావలననే కలుగుచున్నాయి.

**6.** మహర్షయ స్సప్త పూర్వే చత్వారో మనవస్తథా।
మద్భావా మానసా జాతాః యేషాం లోక ఇమాః ప్రజాః॥

భృగు మొదలగు సప్తర్షులు, వారికంటే పూర్వులైన సనకాది నలుగురు ఋషులు, స్వాయంభువాది పదునాలుగు మనువులు వీరందరూ నాయొక్క సంకల్పమాత్రం చేతనే నాకు మానసపుత్రులుగా జన్మించారు. నాయొక్క ప్రభావము వలననే ఈ సమస్త ప్రాణులను సృష్టించాను. వీరి నుండే స్థావర జంగమాత్మకమైన ఈ ప్రపంచము ఆవిర్భవించింది.

**7.** ఏతాం విభూతిం యోగం చ మమ యో వేత్తి తత్త్వతః।
సోఽవికంపేన యోగేన యుజ్యతే నాత్ర సంశయః॥

నాయొక్క ఈ విభూతిని, యోగమును తెలుసుకొనినవారు, యోగ యుక్తులగుట నిస్సందేహము.

**8.** అహం సర్వస్య ప్రభవః మత్తస్సర్వం ప్రవర్తతే।
ఇతి మత్వా భజంతే మాం బుధా భావసమన్వితాః॥

ఈ మూడు లోకములకు మూలకారణమైనవాడను నేనే. నా వలననే సమస్త జరుగుచున్నదని తెలుసుకొనిన జ్ఞానులు భక్తిశ్రద్ధలతో నన్నే సేవిస్తున్నారు.

**9.** మచ్చిత్తా మద్గత ప్రాణాః బోధయంతః పరస్పరమ్।
కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ।।

జ్ఞానులు, తమ ప్రాణములను, మనస్సును, నాయందు నిలిపి ఇంద్రియనిగ్రహము కలవారై నాయొక్క శక్తి సామర్థ్యములను ఒకరికి మరియొకరు చెప్పుకొంటూ నిత్యసంతోషులై ఉంటారు.

**10.** తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్।
దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే।।

నిత్యము నిశ్చలమైన మనస్సుతో నన్ను సేవించువారికి, నన్ను పొందదగిన జ్ఞానమును నేనే ప్రసాదిస్తాను.

**11.** తేషామేవానుకంపార్థం అహమజ్ఞానజం తమః।
నాశయామ్యాత్మభావస్థః జ్ఞానదీపేన భాస్వతా।।

వారిని కరుణించుటకై నేనే వారియొక్క బుద్ధి గుహయందు, జ్ఞానమనే దీపమును వెలిగిస్తాను. జ్ఞానదీపము వెలిగినవెంటనే అజ్ఞానమను చీకటి దూరంగా పారిపోతుంది.

**అర్జున ఉవాచ:**

**12.** పరం బ్రహ్మ పరం ధామ పవిత్రం పరమం భవాన్।
పురుషం శాశ్వతం దివ్యం ఆదిదేవమజం విభుమ్।।

**13.** ఆహుస్త్వామృషయ స్సర్వే దేవర్షిర్నారదస్తథా।
అసితో దేవలో వ్యాసః స్వయం చైవ బ్రవీషి మే।।

అర్జునుడు పలికాడు- సకల ఋషులు, నారదుడు, అసిత దేవతలు, వ్యాసుడు మొదలైనవారంతా నీవే పరమాత్ముడవని, పరంధాముడవని, 



వసుదేవుడవు అని, శాశ్వతుడవు అని, దివ్యపురుషుడవు అని, జన్మ లేనివాడవు అని, సర్వసన్న్యాసివి అని, సర్వవ్యాపివి అని తెలుసుకొనుచున్నారు. నీవు కూడా ఈ విషయమునే తెలుసుకో అని చెపుతున్నావు.

**14.** సర్వమేత దృతం మన్యే యన్మాం వదసి కేశవ!।
న హి తే భగవన్! వ్యక్తిం విదుర్దేవా న దానవాః।।

కేశవా! నీవు చెప్పినదంతయూ, సత్యమే అని నమ్ముచున్నాను. నీవు లీలామానుష విగ్రహుండవు. నీయొక్క లీలలను దేవతలు కూడా తెలుసుకొనలేరు.

**15.** స్వయమేవాత్మనాఽఽత్మానం వేత్థ త్వం పురుషోత్తమ!।
భూతభావన! భూతేశ! దేవ దేవ! జగత్పతే!।।

కృష్ణా! సర్వభూతములను సృష్టించువాడా! దేవదేవా! తపోజ్యోతీ! జగత్పతీ! పురుషోత్తమా! నీయొక్క స్వరూపాన్ని నీవు తప్ప, మరియొకరు తెలుసుకొనలేరు అంటున్నావు కదా!

**16.** వక్తుమర్హస్యశేషేణ దివ్యా హ్యాత్మవిభూతయః।
యాభి ర్విభూతిభిర్లోకాన్ ఇమాంస్త్వం వ్యాప్య తిష్ఠసి।।

అందుచేత నీవు ఈ భూతములయందు ఏయే విభూతులతో యున్నావో, అట్టి దివ్యవిభూతులను సంపూర్ణముగా తెలియజేయి. అందులకు నీవే సమర్థుడవు.

**17.** కథం విద్యామహం యోగిన్ త్వాం సదా పరిచింతయన్।
కేషు కేషు చ భావేషు చింత్యోఽసి భగవన్! మయా।।

ఓ యోగీశ్వరా! నీవు ఏ వస్తువులయందు ఏ విధముగా ధ్యానించినచో నిన్ను తెలుసుకొనగలనో, దానిని సవిస్తరముగా తెలియజేయి.

**18. విస్తరేణాత్మనో యోగం విభూతిం చ జనార్దన!**
**భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మేఽమృతమ్॥**

జనార్దనా! నీ యోగశక్తియొక్క విభూతులను అన్నింటినీ విపులముగా చెప్పు? ఎందువలననంటే సూక్ష్మముగా చెప్పుటవలన నాకు సంతృప్తి కలుగట లేదు.

**శ్రీభగవానువాచ:**

**19. హంత తే కథయిష్యామి దివ్యా హ్యాత్మవిభూతయః।**
**ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ! నాస్త్యంతో విస్తరస్య మే॥**

భగవంతుడు చెప్పాడు- నాయొక్క విభూతులనన్నింటినీ వివరముగా చెప్పుట జరిగే పని కాదు. అవి అనంతాలు. అందువలన ప్రధానమైనవాటిని నీకొరకై కొన్ని విభూతులను మాత్రమే చెపుతాను. అర్జునా! జాగ్రత్తగా విను.

**20. అహమాత్మా గుడాకేశ! సర్వభూతాశయస్థితః।**
**అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ॥**

సమస్త ప్రాణుల అంతరంగములయందు ఉండు ఆత్మను నేనే. ప్రాణులయొక్క సృష్టి, స్థితి, లయములు అను మూడు పరిణామములు నేనే.

**21. ఆదిత్యానామహం విష్ణుః జ్యోతిషాం రవిరంశుమాన్।**
**మరీచిర్మరుతామస్మి నక్షత్రాణా మహం శశీ॥**

ద్వాదశాదిత్యులలో నేను విష్ణువు అను పేరుగల ఆదిత్యుడిని. జ్యోతిర్మయ వస్తువులలో నేను సూర్యుడను. ఏడు రకములైన మరుద్గణములలో ఆవహము అను పేరు గల మరీచిని. అన్ని నక్షత్రములలో చంద్రుడిని నేనే.

**22. వేదానాం సామవేదోఽస్మి దేవానామస్మి వాసవః।**
**ఇంద్రియాణాం మనశ్చాస్మి భూతానామస్మి చేతనా॥**

వేదాలలో నేను సామవేదాన్ని. మూడువందల కోట్ల దేవతలలో నేను ఇంద్రుడిని. పదకొండు రకములైన ఇంద్రియములలో సంకల్ప వికల్పాత్మకమైన మనస్సును నేనే. ప్రాణులయొక్క శరీరమునందుండు ధ్యానశక్తిని కూడా నేనే.

**23. రుద్రాణాం శంకరశ్చాస్మి విత్తేశో యక్షరక్షసామ్।**
**వసూనాం పావకశ్చాస్మి మేరు శ్శిఖరిణా మహమ్॥**

ఏకాదశ రుద్రులలో నేను శంకరుడిని. యక్ష రాక్షసులలో నేను కుబేరుడిని. అష్టవసువులతో అగ్నిని. గొప్పవైన శిఖరములు గల పర్వతాలలో నేను మేరుపర్వతమునై ఉన్నాను.

**24. పురోధసాం చ ముఖ్యం మాం విద్ధి పార్థ! బృహస్పతిమ్।**
**సేనానీనామహం స్కందః సరసామస్మి సాగరః॥**

పురోహితులలో నేను బృహస్పతిని. సేనాపతులలో దేవసేనానాయకుడైన కుమారస్వామిని. జలాశయములలో సముద్రమును నేనే.

**25. మహర్షీణాం భృగురహం గిరామస్మ్యేకమక్షరమ్।**
**యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి స్థావరాణాం హిమాలయః॥**

మహర్షులలో భృగుమహర్షిని, శబ్దసమూహమైన వాఙ్మయములో బ్రహ్మవాచకమైన ఓంకారమును. శ్రౌతస్మార్తాది యజ్ఞాలలో జపరూపమైన యజ్ఞామును. స్థావర పదార్థములలో హిమాలయ పర్వతమును.

**26. అశ్వత్థ స్సర్వవృక్షాణాం దేవర్షీణాం చ నారదః।**
**గంధర్వాణాం చిత్రరథః సిద్ధానాం కపిలో మునిః॥**

వృక్షములలో రావిచెట్టును నేనే. దేవతలలో నారదుడను నేనే. గంధర్వులలో చిత్రరథుడిని. సిద్ధులలో కపిలమహర్షిని కూడా నేనే.

**27. ఉచ్చైశ్శ్రవసమశ్వానాం విద్ధి మామమృతోద్భవమ్।**
**ఐరావతం గజేంద్రాణాం నరాణాం చ నరాధిపమ్॥**

గుఱ్ఱములలో అమృతమథన సమయంలో ఉద్భవించిన ఉచ్చైశ్శ్రవమును నేనే. శ్రేష్ఠమైన ఏనుగులలో ఐరావతమును నేనే. మనుష్యులలో మహారాజును కూడా నేనే.

**28. ఆయుధానా మహం వజ్రం ధేనూనామస్మి కామధుక్।**
**ప్రజనశ్చాస్మి కందర్పః సర్పాణామస్మి వాసుకిః॥**

ఆయుధాలలో వజ్రాయుధమును నేనే. గోవులలో కామధేనువు నేనే. ప్రజలు పుట్టుటకు కారణభూతుడైన మన్మథుడు కూడా నేనే. సర్పాలలో నేను వాసుకిని.

**29. అనంతశ్చాస్మి నాగానాం వరుణో యాదసామహమ్।**
**పితౄణామర్యమా చాస్మి యమ స్సంయమతామహమ్॥**

సమస్తమైన నాగజాతిలో నేను అనంతుడను. జలదేవతలలో వరుణుడను. పితృదేవతలలో అర్యముడను. శాసకులలో యముడను.

**30. ప్రహ్లాదశ్చాస్మి దైత్యానాం కాలః కలయతామహమ్।**
**మృగాణాం చ మృగేంద్రోఽహం వైనతేయశ్చ పక్షిణామ్॥**

రాక్షసులలో ప్రహ్లాదుడను. లెక్కింపబడువాటిలో కాలమును నేనే. మృగములలో సింహాన్ని, పక్షులలో గరుత్మంతుడిని.



**31. పవనః పవతామస్మి రామశ్శస్త్రభృతామహమ్।**
**ఝషాణాం మకరశ్చాస్మి స్రోతసామస్మి జాహ్నవీ॥**

వేగవంతమైన వాటిలో నేను వాయువును. ఆయుధములు ధరించినవారిలో నేను శ్రీరాముడను. మొసలి అను మత్స్యజాతి విశేషమును నేనే. నదులలో గొప్పదైన గంగానదిని నేనే.

**32. సర్గాణామాదిరంతశ్చ మధ్యం చైవాహమర్జున!।**
**అధ్యాత్మవిద్యా విద్యానాం వాదః ప్రవదతామహమ్॥**

సృష్టికి ఆదిని నేనే. మధ్యాంతములను నేనే. ఆధ్యాత్మిక చర్చలలో వారియొక్క, వీరియొక్క వాదములు నేనే.

**33. అక్షరాణామకారోఽస్మి ద్వంద్వ స్సామాసికస్య చ।**
**అహమేవాక్షయః కాలః ధాతాఽహం విశ్వతోముఖః॥**

అక్షరములలో నేను అకారాన్ని, సమాసములలో నేను ద్వంద్వ సమాసాన్ని, నాశనము లేని కాలము నేనే. సర్వకర్మలకు ఫలప్రదాతను నేనే.

**34. మృత్యు స్సర్వహరశ్చాహం ఉద్భవశ్చ భవిష్యతామ్।**
**కీర్తి శ్శ్రీర్వాక్చ నారీణాం స్మృతిర్మేధా ధృతిః క్షమా॥**

సర్వమును లయింప చేయు మృత్యువును నేనే. పుట్టించువాడను నేనే. స్త్రీ శక్తులలో కీర్తిని, వాక్కును, లక్ష్మిని, స్మృతిని, మేధను, ధృతిని, క్షమను అన్నియూ నేనే.

**35. బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛందసామహమ్।**
**మాసానాం మార్గశీర్షోఽహం ఋతూనాం కుసుమాకరః॥**

సామములలో బృహత్సామమును నేనే. ఛందస్సులలో గాయత్రిని నేనే. నెలలలో మార్గశీర్షమును నేనే. ఋతువులలో వసంతము నేనే.

**36. ద్యూతం ఛలయతామస్మి తేజస్తేజస్వినామహమ్।**
**జయోఽస్మి వ్యవసాయోఽస్మి సత్త్వం సత్త్వవతామహమ్।।**

వంచన పరులు ఆడు ఆటలలో జ్యూదమును నేనే. తేజోవంతులలోని తేజమును నేనే. జయమును పొందువారి విజయమును నేనే. కృషి చేయువారి ప్రయత్నమును నేనే. సాత్త్వికులలోని సత్త్వగుణమును నేనే.

**37. వృష్ణీనాం వాసుదేవోఽస్మి పాండవానాం ధనంజయః।**
**మునీనామప్యహం వ్యాసః కవీనా ముశనా కవిః।।**

యాదవులలో వాసుదేవుడను. పాండవులలో అర్జునుడను. మునులలో వ్యాసుడను. కవులలో శుక్రాచార్యుడు నేనే.

**38. దండో దమయతామస్మి నీతిరస్మి జిగీషతామ్।**
**మౌనం చైవాస్మి గుహ్యానాం జ్ఞానం జ్ఞానవతామహమ్।।**

దండించువారిలోని దండనీతియు నేనే. జయించువారిలోని రాజనీతియు నేనే. రహస్యముగా ఉండేవారలలో మౌనమును నేనే. జ్ఞానులలో తత్త్వజ్ఞానమును నేనే.

**39. యచ్చాపి సర్వభూతానాం బీజం తదహమర్జున!।**
**న తదస్తి వినా యత్స్యాత్ మయా భూతం చరాచరమ్।।**

సమస్త భూతములకు బీజమును నేనే. అర్జునా! నేను కానిది అంటూ ఈ ప్రపంచంలో మరొకటి లేదు. అన్నియూ నాయొక్క స్వరూపమే.



**40. నాంతోఽస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప!।**
**ఏషతూద్దేశతః ప్రోక్తః విభూతేర్విస్తరో మయా।।**

నాయొక్క దివ్యవిభూతులకు అంతము లేదు. కొన్నింటిని మాత్రమే నీకు సూక్ష్మముగా తెలియజేశాను.

**41. యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా।**
**తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోంశ సంభవమ్।।**

ఐశ్వర్యముతో కానీ, కాంతులతో కానీ, ఉత్సాహముతో కానీ కూడి ఉన్న వస్తువులన్నీ, నాయొక్క తేజస్సుయొక్క స్వరూపములే అని తెలుసుకో.

**42. అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున!।**
**విష్టభ్యాహమిదం కృత్స్నం ఏకాంశేన స్థితో జగత్।।**

ఇన్ని మాటలు చెప్పుట ఎందుకు? నా తేజస్సులోని ఒక్క కళ మాత్రమే నాచేత ఈ ప్రపంచమునంతా నిండిపోవునట్లు చేయుచున్నది అని తెలుసుకో.

**ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు, బ్రహ్మవిద్యాయాం, యోగశాస్త్రే, శ్రీకృష్ణార్జున సంవాదే, విభూతియోగోనామ దశమోఽధ్యాయః**

అథ ఏకాదశోఽధ్యాయః
విశ్వరూప సందర్శనయోగః

అర్జున ఉవాచ:

1. మదనుగ్రహాయ పరమం గుహ్యమధ్యాత్మసంజ్ఞితమ్।
యత్త్వయోక్తం వచస్తేన మోహోఽయం విగతో మమ॥

అర్జునుడు పలికాడు- నాయందు దయతలిచి, నీవు చెప్పిన రహస్యమైన ఆత్మ, అనాత్మరూపమైన ఆధ్యాత్మిక జ్ఞానము వలన నాయొక్క మోహమంతా నశించిపోయింది.

2. భవాప్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశో మయా।
త్వత్తః కమలపత్రాక్ష! మాహాత్మ్యమపి చావ్యయమ్॥

కమలపత్రాక్షా! నువ్వు చాలా సుస్పష్టముగా భూతములయొక్క ఉత్పత్తి గురించి, ప్రళయము గురించి, అవ్యయమైన నీయొక్క మాహాత్మ్యము గురించి ఎంతో దయతో నీవు చెప్పగా విన్నాను.

3. ఏవమేతద్యథాఽఽత్థ త్వం ఆత్మానం పరమేశ్వర!।
ద్రష్టుమిచ్ఛామి తే రూపం ఐశ్వరం పురుషోత్తమ!॥

నీ మాటలన్నీ నిత్య సత్యములు అని విశ్వసించుట వలన నాకు నీయొక్క ఈశ్వరసంబంధమైన స్వరూపమును చూడాలని కోరికగా ఉంది.

4. మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టు మితి ప్రభో!।
యోగేశ్వర! తతో మే త్వం దర్శయాత్మాన మవ్యయమ్॥

ప్రభూ! నీ దివ్యరూపాన్ని చూచుటకు నేను యోగ్యుడను అని నీవు తలిచినచో యోగేశ్వరా! నాకు నీ అవ్యయమైన నీ జగదాత్మ రూపాన్ని చూపించు.

శ్రీభగవానువాచ:

5. పశ్యమే పార్థ! రూపాణి శతశోఽథ సహస్రశః।
నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ॥

భగవంతుడు చెప్పాడు - పార్థా! అనేక విధములతో కూడినది, అనేక ఆకారములతో ప్రకాశించునది, అనేకానేక వర్ణములు కలది, అలౌకికమైనది, విభిన్నమైనది అయిన నా దివ్యరూపాన్ని చూడు.

6. పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రాన్ అశ్వినౌ మరుతస్తథా।
బహూన్యదృష్టపూర్వాణి పశ్యాశ్చర్యాణి భారత!॥

భారతా! ద్వాదశాదిత్యులను, అష్ట వసువులను, ఏకాదశ రుద్రులను, అశ్వినీ కుమార ద్వయమును, మరుద్దేవతా సప్తకమును చూడు. నీవు గానీ, ఇతరులు గానీ, చూడనటువంటి ఎన్నో అద్భుతాలను ఇప్పుడు నాలో చూడు.

7. ఇహైకస్థం జగత్ కృత్స్నం పశ్యాద్య సచరాచరమ్।
మమ దేహే గుడాకేశ! యచ్చాన్యద్ద్రష్టు మిచ్ఛసి॥

నాయొక్క విరాడ్దేహములో అవయవములవలె ఉన్న ఈ చరాచరములను చూడు. స్థావర జంగమాత్మకమైన విశ్వమునంతటినీ చూడు. జగత్తుయొక్క స్థితిగతులను చూడు. నీవు ఏమి చూడదలుచుకొన్నావో దానినంతటినీ చూడు.

8. న తు మాం శక్యసే ద్రష్టుం అనేనైవ స్వచక్షుషా।
దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్॥

కానీ సామాన్యమైన నీయొక్క పార్థివ నేత్రాలతో నా యొక్క విశ్వరూపాన్ని చూడలేవు. కావున నీకు దివ్యమైన జ్ఞాననేత్రాన్ని అనుగ్రహిస్తున్నాను. అసాధారణమైన నాయొక్క యోగశక్తిని చూడు.

**సంజయ ఉవాచ:**

**9. ఏవముక్త్వా తతో రాజన్! మహాయోగేశ్వరో హరిః।**
**దర్శయామాస పార్థాయ పరమం రూపమైశ్వరమ్॥**

సంజయుడు చెప్పాడు- ధృతరాష్ట్ర మహారాజా! ఈ విధముగా చెప్పిన యోగీశ్వరుడైన శ్రీకృష్ణుడు అర్జునునికి తన దివ్యరూపాన్ని చూపించాడు.

**10. అనేక వక్త్ర నయనం అనేకాద్భుత దర్శనమ్।**
**అనేక దివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్॥**

ఆ విశ్వరూపము అసంఖ్యాకములైన ముఖాలతో, నేత్రాలతో, అద్భుతాకారాలతో, నానావిధములైన అలంకారాలతో ప్రకాశిస్తోంది. పలురకములైన దివ్యాయుధములను ధరించి ఉంది.

**11. దివ్యమాల్యాంబరధరం దివ్యగంధానులేపనమ్।**
**సర్వాశ్చర్యమయం దేవం అనంతం విశ్వతోముఖమ్॥**

ఆ విశ్వరూపము దివ్యమైన మాలలను, వస్త్రములను ధరించి ఉంది. దివ్య గంధమును పూసుకొని ఉంది. అత్యంత ఆశ్చర్యకరముగా ఉంది. దీప్తిమంతమై, అపరిచ్ఛిన్నమై, విశ్వతోముఖముగా ప్రకాశిస్తోంది.

**12. దివి సూర్యసహస్రస్య భవేద్యుగపదుత్థితా।**
**యది భా స్సదృశీ సాస్యాత్ భాసస్తస్య మహాత్మనః॥**

ఆకాశములో ఒకే సమయములో వేయిమంది సూర్యులు ఉదయించినట్లైతే ఎంత కాంతి వస్తుందో, ఆ కాంతి ఈ విరాట్స్వరూపంయొక్క కాంతికి కొద్దిగా సరిపోవచ్చు.

**13. తత్రైకస్థం జగత్ కృత్స్నం ప్రవిభక్తమనేకధా।**
**అపశ్యద్దేవదేవస్య శరీరే పాండవస్తదా॥**

అర్జునుడు ఆ దేవదేవుని యొక్క శరీరములో దేవ, పితృ, మనుష్యాది నానారూపములుగా విభజింపబడిన జగత్తునంతటినీ చూశాడు. ఆ సమూహమంతా ఆయనయొక్క విరాట్స్వరూపంలో ఒక అవయవమువలె కనిపిస్తోంది.

**14. తత స్స విస్మయావిష్టః హృష్టరోమా ధనంజయః।**
**ప్రణమ్య శిరసా దేవం కృతాంజలిరభాషత॥**

విరాట్స్వరూపమును చూచిన అర్జునునికి ఆశ్చర్యముతో, ఆనందముతో, నోట మాట రాలేదు. ఒళ్లంతా గగుర్పాటు పొడిచింది. శరీరము పులకరించింది. రెండు చేతులు జోడించి మనసా శిరసా నమస్కరించాడు.

**అర్జున ఉవాచ :**

**15. పశ్యామి దేవాంస్తవ దేవ! దేహే**
**సర్వాంస్తథా భూతవిశేషసంఘాన్ ।**
**బ్రహ్మాణమీశం కమలాసనస్థం**
**ఋషీంశ్చ సర్వానురగాంశ్చ దివ్యాన్॥**

అర్జునుడు పలికాడు- దేవ దేవా! నీ విశ్వరూపంలో దేవతలందరినీ, చరాచర జగత్తునూ, వశిష్ఠాది మహర్షులను, తక్షకాది సర్ప సమూహాలను, దేవగణములను, భూతగణములను, పద్మముపై ఆసీనుడైనవాడు, సృష్టికర్త అయిన చతుర్ముఖ బ్రహ్మను చూశాను.

**16.** అనేకబాహూదరవక్త్రనేత్రం పశ్యామి త్వా సర్వతోఽనంతరూపమ్
నాంతం న మధ్యం న పునస్తవాదిం పశ్యామి విశ్వేశ్వర! విశ్వరూప!।।

విశ్వేశ్వరా! ఎటు నుంచి ఎటు చూసినా, లెక్కలేనన్ని చేతులు, ఉదరములు, ముఖాలు, నేత్రాలు కలిగిన నీయొక్క విశ్వరూపాన్ని చూడగలుగుతున్నాను. జగత్తు అంతా నీ రూపమే కనిపిస్తోంది. నీ విరాట్స్వరూపమునకు ఆది మధ్య అంతములు లేవు. నీవు సర్వగతుడవు.

**17.** కిరీటినం గదినం చక్రిణం చ
తేజోరాశిం సర్వతో దీప్తిమంతమ్।
పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమంతాత్
దీప్తానలార్క ద్యుతిమప్రమేయమ్।।

అసంఖ్యాకములైన కిరీటములను, గదలను, చక్రములను ధరించి ప్రకాశిస్తున్న సూర్యాగ్నులయొక్క ప్రచండమైన తేజస్సుతో చూచుటకు శక్యము కాని, చెప్పుటకు శక్యము కాని, నీ యొక్క విరాట్స్వరూపాన్ని తెలుసుకొంటున్నాను.

**18.** త్వమక్షరం పరమం వేదితవ్యం
త్వమస్య విశ్వస్య పరం నిధానమ్।
త్వమవ్యయ శ్శాశ్వత ధర్మగోప్తా
సనాతనస్త్వం పురుషో మతో మే।।

నీవు పరబ్రహ్మవు. ఏకమాత్రమైన జ్ఞేయ వస్తువవు. నీవు విశ్వమునకు ఆశ్రయుడవు. సనాతన ధర్మరక్షకుడవు. నిత్యుడవైన పరమాత్మవు.

**19.** అనాదిమధ్యాంతమనంతవీర్యం
అనంతబాహుం శశిసూర్యనేత్రమ్।
పశ్యామి త్వాం దీప్తహుతాశవక్త్రం
స్వతేజసా విశ్వమిదం తపంతమ్।।

నీవు ఆది మధ్య అంతములు లేనివాడవు. అఖండమైన శక్తి కలవాడవు. అసంఖ్యాకమైన బాహువులు కలవాడు. సూర్యచంద్రులే నీయొక్క నేత్రాలు. నీయొక్క ముఖము ప్రకాశిస్తున్న అగ్ని లాగా కనిపిస్తోంది. నీయొక్క తేజస్సుతో ఈ జగత్తునంతటినీ ప్రకాశింప చేస్తున్నావు.

**20.** ద్యావా పృథివ్యోరిదమంతరం హి
వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వాః।
దృష్ట్వాద్భుతం రూపమిదం తవోగ్రం
లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్!।।

నీయొక్క విరాట్స్వరూపము భూనభోంతరాళములను వ్యాపించి ఉంది. అన్ని దిక్కులూ నిండిపోయి ఉంది. అత్యద్భుతము, అతిభయంకరమైన నీయొక్క విశ్వరూపాన్ని చూసి, ముల్లోకములు భయముతో వణికి పోతున్నాయి.

**21.** అమీ హి త్వా సురసంఘా విశంతి
కేచిద్భీతాః ప్రాంజలయో గృణంతి।
స్వస్తీత్యుక్త్వా మహర్షి సిద్ధసంఘాః
స్తువంతి త్వాం స్తుతిభిః పుష్కలాభిః।।

యుద్ధము చేయబోవుచున్న మనుష్య శరీరధారులైన వసువు మొదలగు దేవతలందరూ నీలో ప్రవేశిస్తున్నారు. కొందరు నమస్కారము చేసి, ప్రార్థిస్తున్నారు. మరికొందరు భయపడుతున్నారు. మహర్షులు, సిద్ధులు

స్వస్తి వాక్యములు పలుకుతూ, పలు విధములైన స్తోత్రాలతో నిన్ను పొగుడుతున్నారు.

**22.** రుద్రాదిత్యా వసవో యే చ సాధ్యాః
విశ్వేఽశ్వినౌ మరుతశ్చోష్మపాశ్చ।
గంధర్వయక్షాసురసిద్ధసంఘాః
వీక్షంతే త్వాం విస్మితాశ్చైవ సర్వే।।

రుద్రులు, ఆదిత్యులు, వసువులు, సాధ్యులు, విశ్వేదేవతలు, అశ్వినీదేవతలు, మరుద్గణము, పితృదేవతలు, గంధర్వులు, యక్షులు, అసురులు, సిద్ధులు మున్నగు వారందరూ కూడా ఆశ్చర్యముతో నిన్ను చూస్తున్నారు.

**23.** రూపం మహత్తే బహువక్త్రనేత్రం
మహాబాహో! బహుబాహూరుపాదమ్।
బహూదరం బహుదంష్ట్రాకరాళం
దృష్ట్వా లోకాః ప్రవ్యథితాస్తథాఽహమ్।।

అనేక ముఖములతో, నేత్రములతో, హస్తములతో, పాదములతో, ఊరువులతో, ఉదరములతో, నీ విశ్వరూపం ప్రకాశిస్తోంది. అసంఖ్యాకమైన కోరలతో భయంకరముగా కనిపిస్తోంది. నీయొక్క ఈ రూపమును చూచి, ప్రాణులందరూ భయపడుతున్నారు. నేను కూడా భయపడుతున్నాను.

**24.** నభస్స్పృశం దీప్తమనేకవర్ణం
వ్యాత్తాననం దీప్తవిశాలనేత్రమ్।
దృష్ట్వా హి త్వాం ప్రవ్యథితాంతరాత్మా
ధృతిం న విందామి శమం చ విష్ణో!।।

తెరుచుకొని ఉన్న నీయొక్క ముఖముల కాంతి ఆకాశమంతా వ్యాపించింది. భయంకరమైన, విశాలమైన నీయొక్క నేత్రాలు అగ్ని గోళములలాగా ప్రకాశిస్తున్నాయి. నీ విశ్వరూపాన్ని చూచిన తరువాత నా మనస్సు కలవరపడిపోతోంది. ధైర్యం నశించి పోతోంది. శాంతి లభించుట లేదు.

**25.** దంష్ట్రా కరాళాని చ తే ముఖాని
దృష్ట్వైవ కాలానలసన్నిభాని।
దిశో న జానే న లభే చ శర్మ
ప్రసీద దేవేశ! జగన్నివాస! ।।

దేవదేవా! వాడియైన కోరలతో ప్రకాశిస్తున్నది, ప్రళయాగ్ని వలె మండుచున్న నీయొక్క ముఖములను చూచిన వెంటనే, నాకు దిగ్భ్రమ కలుగుతోంది. జగన్నివాసా! ప్రసన్నుడివి కమ్ము. నన్ను కరుణించు.

**26.** అమీ చ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః
సర్వే సహైవావనిపాలసంఘైః।
భీష్మో ద్రోణ స్సూతపుత్రస్తథాఽసౌ
సహాస్మదీయైరపి యోధముఖ్యైః।।

అనేకమంది రాజులు, కౌరవులు, భీష్మ ద్రోణ కర్ణాదులు, నాయొక్క ప్రధానయోధులు కూడా నీయొక్క భయంకరమైన ముఖములోనికి ప్రవేశించి వెళ్లిపోతున్నారు.

**27.** వక్త్రాణి తే త్వరమాణా విశంతి
దంష్ట్రాకరాళాని భయానకాని।
కేచిద్విలగ్నా దశనాంతరేషు
సందృశ్యంతే చూర్ణితైరుత్తమాంగైః।।

అవసాన కాలము సమీపించినవారై నీలో లయమగుచున్న వారిలో కొందరి శిరస్సులు అతి భయంకరముగా నీ కోరల మధ్య నలిగి చూర్ణములై పోతున్నాయి.

**28.** యథా నదీనాం బహవోఽంబు వేగాః
సముద్రమేవాభిముఖా ద్రవంతి।
తథా తవామీ నరలోకవీరాః
విశంతి వక్త్రాణ్యభివిజ్వలంతి॥

అనేక నదీ ప్రవాహములు, సముద్రము వైపు ప్రవహించి, సముద్రంలో కలియునట్లుగా ఈ వీరపురుషులందరూ నీ ముఖాగ్నిలోనికి ప్రవేశిస్తున్నారు.

**29.** యథా ప్రదీప్తం జ్వలనం పతంగాః
విశంతి నాశాయ సమృద్ధవేగాః।
తథైవ నాశాయ విశంతి లోకాః
తవాపి వక్త్రాణి సమృద్ధవేగాః॥

మిడతలు వేగంగా పరిగెత్తుకొని వచ్చి, నిప్పులో పడుట మరణముకొరకే అయినట్లుగా, ఈ జనులందరూ మృతి చెందుటకై అతి వేగంగా నీయొక్క ముఖంలోనికి ప్రవేశిస్తున్నారు.

**30.** లేలిహ్యసే గ్రసమాన స్సమంతాత్
లోకాన్ సమగ్రాన్ వదనైర్జ్వలద్భిః।
తేజోభిరాపూర్య జగత్సమగ్రం
భాసస్తవోగ్రాః ప్రతపంతి విష్ణో॥

దేవదేవా! దేదీప్యమానమైన నీ వదనసమూహము ఈ వీరులను మ్రింగి వేస్తోంది. అన్ని వైపులకు నాలుకలను చాచుతూ జీవులను ఆస్వాదిస్తోంది. తీవ్రమైన నీయొక్క కాంతులు, ఈ జగత్తును తపింప చేస్తున్నాయి.

**31.** ఆఖ్యాహి మే కో భవానుగ్రరూపః
నమోఽస్తు తే దేవవర! ప్రసీద।
విజ్ఞాతు మిచ్ఛామి భవంతమాద్యం
న హి ప్రజానామి తవ ప్రవృత్తిమ్॥

ఉగ్రమూర్తివైన నీవెవరో నాకు తెలియజేయి. దేవదేవా! నీకు నమస్కారము. నామీద కరుణ చూపించు. ఆది పురుషుడవైన నీ గురించి తెలుసుకోవాలని కోరుతున్నాను. నీ యొక్క అభిప్రాయమేమిటో నేను గ్రహించలేక పోవుచున్నాను.

శ్రీ భగవానువాచ:

**32.** కాలోఽస్మి లోకక్షయకృత్ప్రవృద్ధః
లోకాన్ సమాహర్తుమిహ ప్రవృత్తః।
ఋతేఽపి త్వా న భవిష్యంతి సర్వే
యేఽవస్థితాః ప్రత్యనీకేషు యోధాః॥

భగవంతుడు చెప్పాడు- అర్జునా! అన్ని లోకములను భక్షించుటకై విజృంభించిన కాలస్వరూపుడిని నేను. ఇచట ఉన్న ప్రాణులందరినీ చంపివేయుటకు నిశ్చయించాను. నీవు యుద్ధము చేసినా, చేయకపోయినా శత్రుపక్షములోని వీరులెవరూ జీవించరు.

**33.** తస్మాత్ త్వముత్తిష్ఠ యశో లభస్వ
జిత్వా శత్రూన్ భుంక్ష్వ రాజ్యం సమృద్ధమ్।
మయైవైతే నిహతాః పూర్వమేవ
నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్!॥

కనుక అర్జునా! లే. యుద్ధమునకు సిద్ధముగా ఉండు. శత్రు సంహారము చెయ్యి. మంచి కీర్తిని సంపాదించు. భూమండలమును అనుభవించు. రాజ్యభోగములను అనుభవించు. వీరందరూ పూర్వమే నాచేత చంపబడ్డారు. ఇప్పుడు నీవు నిమిత్తమాత్రుడవు మాత్రమే.

**34.** ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ
కర్ణం తథాఽన్యానపి యోధవీరాన్।
మయా హతాంస్త్వం జహి మా వ్యథిష్ఠాః
యుధ్యస్వ జేతాఽసి రణే సపత్నాన్॥

నీవు ఎవరిని చంపుటకు ఆలోచించుచున్నావో అట్టి భీష్మ ద్రోణ కర్ణ జయద్రథాది యోధులను నేను ఇదివరకే చంపివేశాను. చనిపోయినవారినే తిరిగి నీవు వధించు. భయపడకు. యుద్ధంలో శత్రువులను జయించు. యుద్ధం చెయ్యి. అధైర్యము విడిచిపెట్టు.

సంజయ ఉవాచ-

**35.** ఏతచ్ఛ్రుత్వా వచనం కేశవస్య
కృతాంజలిర్వేపమానః కిరీటీ।
నమస్కృత్వా భూయ ఏవాహ కృష్ణం
సగద్గదం భీతభీతః ప్రణమ్య॥

సంజయుడు చెప్పాడు- ధృతరాష్ట్ర మహారాజా! ఈ విధముగా శ్రీకృష్ణుని మాటలను విన్న అర్జునుడు వణుకుచున్న చేతులను జోడించి, శ్రీకృష్ణుడికి నమస్కరించాడు. ఎంతో భయపడుతూ గద్గద స్వరముతో ఈ విధముగా పలికాడు.

అర్జున ఉవాచ -

**36.** స్థానేహృషీకేశ! తవ ప్రకీర్త్యా
జగత్ప్రహృష్యత్యనురజ్యతే చ
రక్షాంసి భీతాని దిశో ద్రవంతి
సర్వే నమస్యంతి చ సిద్ధసంఘాః॥

అర్జునుడు పలికాడు - హృషీకేశా! నీయొక్క మాహాత్మ్యమును కీర్తిస్తూ, ప్రపంచమంతా ఆనందిస్తోంది. రాక్షసులు దిక్కుతోచక భయభ్రాంతులై పరిగెత్తుచున్నారు. తపోయోగ మంత్రసిద్ధులు నీకు నమస్కరిస్తున్నారు. నీయొక్క ప్రభావము అత్యద్భుతము. నీవు భక్తవత్సలుడవు.

**37.** కస్మాచ్చ తే న నమేరన్ మహాత్మన్!
గరీయసే బ్రహ్మణోఽప్యాదికర్త్రే।
అనంత! దేవేశ! జగన్నివాస!
త్వమక్షరం సదసత్ తత్పరం యత్॥

మహాత్మా! సృష్టికర్త అయిన బ్రహ్మకు కూడా మూలపురుషుడవైన నీకు నమస్కరించనివారు ఎవరుంటారు? జగన్నివాసా! వ్యక్తావ్యక్తములు రెండింటికీ అతీతమైన అక్షరము కూడా నీవే. ఈ ప్రపంచమంతా నీతోనే నిండుకొని ఉంది. (ఈ విధముగా తొమ్మిది కారణములవలన నీవు అందరిచేతా నమస్కరించబడుతున్నావు.)

**38.** త్వమాదిదేవః పురుషః పురాణః
త్వమస్య విశ్వస్య పరం నిధానమ్।
వేత్తాఽసి వేద్యం చ పరం చ ధామ
త్వయా తతం విశ్వమనంతరూప!॥

ఆదిదేవుడవు, పురాణపురుషుడవు, జగత్తుకు ఆధారమైనవాడవు, అంతా తెలిసినవాడవు, అందరిచేతా తెలుసుకొనవలసినవాడవు, ఈ ప్రపంచమంతా నీలోనే ఉంది.

**39.** వాయుర్యమోఽగ్ని ర్వరుణ శ్శశాంకః
ప్రజాపతిస్త్వం ప్రపితామహశ్చ।
నమో నమస్తేఽస్తు సహస్రకృత్వః
పునశ్చ భూయోఽపి నమో నమస్తే॥

యముడు, వాయువు, అగ్ని, వరుణుడు, చంద్రుడు, బ్రహ్మ, అన్ని రూపములు నువ్వే. బ్రహ్మను కన్న తండ్రివీ నువ్వే. నీకు అనేక నమస్కారములు. నీకు మళ్లీ మళ్లీ నమస్కారములు చేస్తున్నాను.

**40.** నమః పురస్తాదథ పృష్ఠతస్తే
నమోఽస్తు తే సర్వత ఏవ సర్వ॥
అనంతవీర్యామితవిక్రమస్త్వం
సర్వం సమాప్నోషి తతోఽసి సర్వః॥

సర్వాత్మా! నీకు ఎదురుగా నమస్కారము చేస్తున్నాను. వెనుక నుండి నమస్కారము చేస్తున్నాను. అన్ని వైపుల నుండి నమస్కారము చేస్తున్నాను. నీ బలపరాక్రమములకు అంతం లేదు. నీవు విశ్వమునంతటినీ వ్యాపించి ఉన్నావు. నీవు సర్వరూపుడవు. నీవు సర్వవ్యాపకుడవు.

**41.** సఖేతి మత్వా ప్రసభం యదుక్తం
హే కృష్ణ! హే యాదవ! హే సఖేతి॥
అజానతా మహిమానం తవేదం
మయా ప్రమాదాత్ ప్రణయేన వాఽపి



నీ మహిమలు గుర్తించలేక, ప్రేమ చేత కానీ, పొరపాటుగా కానీ, చనువుతో కానీ, కృష్ణా! యాదవా! సఖా! అని నిన్ను సామాన్యమానవుని వలె పిలిచేవాడిని.

**42.** యచ్చాపహాసార్థమసత్కృతోఽసి
విహారశయ్యాసన భోజనేషు।
ఏకోఽథవాఽప్యచ్యుత! తత్సమక్షం
తత్ క్షామయే త్వామహమప్రమేయమ్॥

ఆహారమునందు, విహారము నందు, శయ్యా, ఆసనములందు నీతో కలిసి ఉండేవాడిని. రహస్యముగా, ప్రకాశముగా నీతో పరిహాసములు చేసేవాడిని. నన్ను క్షమించు స్వామీ!

**43.** పితాఽసి లోకస్య చరాచరస్య
త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్
న త్వత్సమోఽస్త్యభ్యధికః కుతోఽన్యః
లోకత్రయేఽప్యప్రతిమప్రభావ॥

స్థావర జంగమాత్మకమైన ఈ జగత్తునకు నీవు స్రష్టవు. తండ్రివి. పూజనీయుడవు. గురుడవు. మూడులోకములలో నీకు సమానమైనవారు లేరు. నీకంటే ఎక్కువైన వారు ఏ విధముగా ఉండగలరు?

**44.** తస్మాత్ప్రణమ్య ప్రణిధాయ కాయం
ప్రసాదయే త్వామహమీశమీడ్యమ్।
పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః
ప్రియః ప్రియాయార్హసి దేవ! సోఢుమ్॥

నీకు సాష్టాంగ ప్రణామము చేస్తున్నాను. పూజ్యుడవు, ఈశ్వరుడవు అయిన నిన్ను అనుగ్రహించమని వేడుకొనుచున్నాను. తండ్రి కొడుకుయొక్క, స్నేహితుడు స్నేహితునియొక్క ప్రియుడు ప్రేయసియొక్క లోపములను ఏ విధముగా సహిస్తారో, అదే విధముగా నీవు నా అపరాధములను క్షమించు.

**45.** **అదృష్టపూర్వం హృషితోఽస్మి దృష్ట్వా**
**భయేన చ ప్రవ్యథితం మనో మే।**
**తదేవ మే దర్శయ దేవ! రూపం**
**ప్రసీద దేవేశ! జగన్నివాస!।।**

పూర్వమెప్పుడో గానీ, కనీ వినీ ఎరుగని నీయొక్క అద్భుతరూపమును చూచిన ఆవేశముతో నా మనస్సు కంగారుపడుతోంది. ఆనందపడుతోంది. భయపడుతోంది. ఆశ్చర్యపడుతోంది. దేవాధిదేవా! దయచేసి, నీవు నీ పూర్వరూపాన్ని పొంది, నన్ను అనుగ్రహించు.

**46.** **కిరీటినం గదినం చక్రహస్తం**
**ఇచ్ఛామి త్వాం ద్రష్టుమహం తథైవ।**
**తేనైవ రూపేణ చతుర్భుజేన**
**సహస్రబాహో! భవ విశ్వమూర్తే!।।**

సహస్రాక్షా! నిన్ను వెనుకటి విధముగా కిరీటమును, చక్రమును, గదను ధరించిన నీయొక్క సామాన్యరూపమును చూడవలెనని కోరుచున్నాను. దుర్నిరీక్ష్య మైన ఈ విశ్వరూపాన్ని ఉపసంహరించు. విశ్వమూర్తీ! నీయొక్క చతుర్భుజ రూపాన్ని చూపించు.

**శ్రీ భగవానువాచ:**

**47.** **మయా ప్రసన్నేన తవార్జునేదం**
**రూపం పరం దర్శితమాత్మయోగాత్।**
**తేజోమయం విశ్వమనంతమాద్యం**
**యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్।।**

భగవంతుడు చెప్పాడు-అర్జునా! నీ మీదనున్న ప్రేమతో నాయొక్క యోగశక్తి ప్రభావముతో అనంత తేజోభరితమైన విశ్వరూపమును నీకు చూపించాను. ఇంతవరకూ నాయొక్క విశ్వరూపమును ఇతరులెవరూ చూడలేదు.

**48.** **న వేదయజ్ఞాధ్యయనైర్న దానైః**
**న చ క్రియాభిర్న తపోభిరుగ్రైః।**
**ఏవంరూప శ్శక్య అహం నృలోకే**
**ద్రష్టుం త్వదన్యేన కురుప్రవీర!।।**

వేదాలు చదివినా, యజ్ఞములను చేసినా, వైదిక కర్మలను ఆచరించినా, దానధర్మములను చేసినా, భయంకరమైన తపస్సులు చేసినా, నాయొక్క ఈ విశ్వరూపాన్ని ఇతరులు ఎవరూ ఇంతవరకూ చూడలేదు. నీ ఒక్కడవే నాయొక్క అనుగ్రహంతో దర్శించి ధన్యుడవయ్యావు.

**49.** **మా తే వ్యథా మా చ విమూఢభావః**
**దృష్ట్వా రూపం ఘోరమీదృఙ్మమేదమ్।**
**వ్యపేతభీః ప్రీతమనాః పునస్త్వం**
**తదేవ మే రూపమిదం ప్రపశ్య।।**

అర్జునా! దుర్భరమైన నాయొక్క విరాట్స్వరూపమును చూచి, నీవు చపలుడవు కావద్దు. దుఃఖితుడవు కావద్దు. భయపడవద్దు. ప్రసన్నమైన మనస్సుతో శంఖ, చక్ర, గదా, పద్మములు ధరించిన నాయొక్క చతుర్భుజ రూపమును మాత్రమే చూడు.

సంజయ ఉవాచ:

**50.** ఇత్యర్జునం వాసుదేవస్తథోక్త్వా
స్వకం రూపం దర్శయామాస భూయః।
ఆశ్వాసయామాస చ భీతమేనం
భూత్వా పున స్సౌమ్యవపుర్మహాత్మా।।

సంజయుడు చెప్పాడు- ధృతరాష్ట్ర మహారాజా! ఈ విధముగా పలికిన మహాత్ముడైన శ్రీకృష్ణుడు, జగద్భయంకరమైన తన యొక్క విశ్వరూపమును ఉపసంహరించుకొని సర్వసాధారణము, సౌమ్యము అయిన రూపముతో కనిపించి, అర్జునుని ఓదార్చాడు.

అర్జున ఉవాచ:

**51.** దృష్ట్వేదం మానుషం రూపం తవ సౌమ్యం జనార్దన!।
ఇదానీమస్మిసంవృత్తః సచేతాః ప్రకృతిం గతః।।

అర్జునుడు పలికాడు- జనార్దనా! సౌమ్యమైన నీయొక్క మనుష్య రూపమును చూచి, నా మనస్సు ప్రశాంతత చెందింది. స్థిమితంగా ఉంది. నేను స్వస్థుడనయ్యాను.

శ్రీ భగవానువాచ:

**52.** సుదుర్దర్శమిదం రూపం దృష్టవానసి యన్మమ।
దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శనకాంక్షిణః।।

భగవంతుడు చెప్పాడు- అర్జునా! నీవు చూచిన ఈ విశ్వరూపము ఇతరులకు అత్యంత దుర్లభము. ఇంద్రాది దేవతలు కూడా నాయొక్క విశ్వరూపమును చూడాలని ఎల్లప్పుడూ కోరుతూ ఉంటారు.

**53.** నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా।
శక్య ఏవం విధో ద్రష్టుం దృష్టవానసిమాం యథా।।

నీకు లభించిన ఈ విశ్వరూప సందర్శనభాగ్యము తపో దాన యజ్ఞ యాగములు చేసినవారికి కూడా లభించదు. ఎన్ని పూజలు చేసినా, ఎన్ని దానాలు చేసినా, ఎంత తపస్సు చేసినా దొరకదు.

**54.** భక్త్యా త్వనన్యయా శక్యః అహమేవం విధోఽర్జున!।
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప!।।

అర్జునా! అనన్యమైన భక్తి ఒక్కటే నన్ను తెలుసుకొనుటకు సాధనము. నాలో ప్రవేశించుటకు ఉత్తమమైన ఉపాయము.

**55.** మత్కర్మకృన్మత్పరమః మద్భక్త స్సంగవర్జితః।
నిర్వైరస్సర్వభూతేషు యస్స మామేతి పాండవ!।।

నా కొరకే కర్మలను చేస్తూ, నన్నే పరమ పురుషార్థముగా తలుస్తూ, ధన, మిత్ర, పుత్రాదులయందు ఆసక్తి లేక, నన్నే ఆశ్రయించుకొని సర్వజీవులనూ వైరభావంతో చూడక, ఈ విశ్వమంతా ఎవడైతే నన్ను చూస్తాడో వాడు మాత్రమే నాయొక్క రూపాన్ని పొందగలడు.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు, బ్రహ్మవిద్యాయాం, యోగశాస్త్రే, శ్రీకృష్ణార్జున సంవాదే, విశ్వరూపసందర్శనయోగోనామ
ఏకాదశోఽధ్యాయః

## అథ ద్వాదశోఽధ్యాయః
## భక్తియోగః

**అర్జున ఉవాచ:**

**1. ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే।**
**యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః॥**

అర్జునుడు పలికాడు- శ్రీకృష్ణా! నీయొక్క సగుణస్వరూపమును ఉపాసన చేసిన భక్తులు, కొంతమంది ఉన్నారు. నిన్ను నిర్గుణపరబ్రహ్మముగా ధ్యానించువారు మరికొందరు ఉన్నారు. వీరిద్దరిలో ఎవరు యోగవిదులు? దయచేసి తెలియజేయి.

**శ్రీ భగవానువాచ:**

**2. మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే।**
**శ్రద్ధయా పరయోపేతాః తే మే యుక్తతమా మతాః॥**

భగవంతుడు చెప్పాడు - నిత్యము నన్నే తనయొక్క మనస్సులో నిలిపి, శ్రద్ధతో ఏకనిష్ఠులై, నన్ను ఉపాసన చేసిన భక్తులే శ్రేష్ఠమైన యోగులు.

**3. యే త్వక్షరమనిర్దేశ్యం అవ్యక్తం పర్యుపాసతే।**
**సర్వత్రగమచింత్యం చ కూటస్థమచలం ధ్రువమ్॥**

**4. సంనియమ్యేంద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః।**
**తే ప్రాప్నువంతి మామేవ సర్వభూతహితే రతాః॥**

అవ్యక్తమైన నాయొక్క రూపమును ఉద్దేశించి ఎవరు ఉపాసన చేస్తారో వారు ద్వంద్వాతీతులు. సర్వభూతములయందు ప్రేమను కలిగి, ఇంద్రియనిగ్రహము కలిగి, మనస్సునకు, వాక్కునకు శక్యము కాని సర్వవ్యాప్తము, మాయాకారణము, అచలము, నిత్యసత్యము అయిన నిరాకార బ్రహ్మను ఉపాసించు వారు కూడా నన్నే పొందుతారు.

**5. క్లేశోఽధికతరస్తేషాం అవ్యక్తాసక్త చేతసామ్।**
**అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే॥**

సగుణోపాసన కంటే నిర్గుణోపాసన కొద్దిగా కష్టమైనది. ఇది అవ్యక్తమైన నిర్గుణబ్రహ్మ సత్త్వము. దేహాభిమానం కలవారికి ఇది లభించుట కష్టము. అధికారి అయితే ఇది ఉత్తమం.

**6. యే తు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః।**
**అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంత ఉపాసతే॥**

**7. తేషామహం సముద్ధర్తా మృత్యుసంసార సాగరాత్।**
**భవామి నచిరాత్ పార్థ! మయ్యావేశిత చేతసామ్॥**

పార్థా! ఎవరైతే అన్ని కర్మ ఫలములను నాకే అర్పించి, నన్నే పరమావధిగా నిర్ణయించుకొని ఏకాగ్రతతో ధ్యానిస్తారో, వారిని మృత్యురూపమైన సంసారమనే సముద్రము నుండి నేను దాటింప చేస్తాను. శాశ్వతమైన నన్ను పొందు విధముగా చేస్తాను.

**8. మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ।**
**నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః॥**

మనస్సును, బుద్ధిని, నాయందే లగ్నము చేసి, ధ్యానము చేస్తే నీవు నాయందే ఎల్లప్పుడూ ఉంటావు.

**9. అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్।**
**అభ్యాసయోగేన తతః మామిచ్ఛాప్తుం ధనంజయ!॥**

అర్జునా! నిశ్చలమైన భక్తితో మనస్సును లగ్నము చెయ్యకపోతే, అభ్యాసయోగముతో నన్ను పొందు ప్రయత్నము చేయవచ్చు.

**10. అభ్యాసేఽప్యసమర్థోఽసి మత్కర్మపరమో భవ।**
**మదర్థమపి కర్మాణి కుర్వన్ సిద్ధిమవాప్స్యసి॥**

ఇట్టి అభ్యాసము చేయుటకు నీవు సమర్థుడవు కాకపోయినచో భగవత్ప్రీతికరములైన కర్మలను ఆచరించు. దీనివలన కూడా నీవు సిద్ధిని పొందగలవు.

**11. అథైతదప్యశక్తోఽసి కర్తుం మద్యోగమాశ్రితః।**
**సర్వకర్మఫలత్యాగం తతః కురు యతాత్మవాన్॥**

అదీ చేయలేకపోతే, మనోనిగ్రహముతో నన్ను శరణు పొందు. నీవు చేయు సర్వకర్మ ఫలములను నాకే సమర్పించు.

**12. శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే।**
**ధ్యానాత్కర్మఫలత్యాగః త్యాగాచ్ఛాంతిరనంతరమ్॥**

అభ్యాసము కంటే జ్ఞానము గొప్పది. జ్ఞానము కంటే ధ్యానం గొప్పది. ధ్యానము కంటే కర్మపరిత్యాగము గొప్పది. కావున సర్వసంగత్యాగము వలన ముక్తి లభిస్తుంది.

**13. అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ।**
**నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ॥**

**14. సంతుష్ట స్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః।**
**మయ్యర్పితమనోబుద్ధిః యో మద్భక్తస్స మే ప్రియః॥**

అన్ని భూతములయందు ద్వేషము లేనివాడు, మిత్రభావము కలవాడు, దయ కలవాడు, అహంకార మమకారములు లేనివాడు, క్షమాశీలుడు, నిత్యసంతోషి, ఇంద్రియనిగ్రహము కలవాడు, దృఢనిశ్చయము కలవాడు, మనస్సును, బుద్ధిని నాయందే ఉంచినవాడు ఎవడైతే కలడో, అటువంటి భక్తుడే నాకిష్టమైనవాడు.

**15. యస్మాన్నో ద్విజతే లోకః లోకాన్నోద్విజతే చ యః।**
**హర్షామర్షభయోద్వేగైః ముక్తోయస్స చ మే ప్రియః॥**

లోకములను తాను భయపెట్టక, తాను లోకములకు భయపడక, ఆనందము, విషాదము, భయము, సంక్షోభములు లేనివాడెవడో అట్టి వాడే నాకు ప్రియమైనవాడు.

**16. అనపేక్ష శ్శుచిర్దక్షః ఉదాసీనో గతవ్యథః।**
**సర్వారంభ పరిత్యాగీ యో మద్భక్తస్స మే ప్రియః॥**

కోరికలు లేనివాడు, పరిశుద్ధుడు, బాహ్యాభ్యంతర శౌచ సంపన్నుడు. పక్షపాత సూర్యుడు, సర్వ సకామకర్మలను విడిచిపెట్టినవాడు అయిన భక్తుడు నాకిష్టమైనవాడు.

**17. యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి।**
**శుభాశుభపరిత్యాగీ భక్తిమాన్ యస్స మే ప్రియః॥**

ఎవరికైతే సంతోషము, దుఃఖము, వ్యతిరేకత, శుభాశుభ లక్షణములు ఉండవో, అట్టివాడు నాకిష్టమైనవాడు.

**18. సమశ్శత్రౌ చ మిత్రే చ తథా మానాపమానయోః।**
**శీతోష్ణసుఖదుఃఖేషు సమస్సంగ వివర్జితః॥**

**19.** తుల్యనిందాస్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్।
అనికేత స్స్థిరమతిః భక్తిమాన్ మే ప్రియో నరః।।

శత్రువులయందు మిత్రులయందు సమానమైన భావము కలవాడు, మానాపమానములు లేనివాడు, సుఖదుఃఖములయందు సమానమైనవాడు, కోరికలు లేనివాడు, దొరికిదానితో తృప్తిపడేవాడు, మౌనము నందు ఇష్టం కలవాడు, సుస్థిరమైన చిత్తము కల భక్తుడే నాకిష్టమైనవాడు.

**20.** యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే।
శ్రద్దధానా మత్పరమాః భక్తాస్తేఽతీవ మే ప్రియాః।।

ఎవరైతే నేను చెప్పిన ధర్మములను ఆచరిస్తూ, స్తుతిస్తూ, విశ్వసిస్తూ, నన్నే నమ్మి, నన్ను ఉపాసిస్తారో, వారే నాకు మిక్కిలి ప్రియమైనవారు.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు, బ్రహ్మవిద్యాయాం, యోగశాస్త్రే,
శ్రీకృష్ణార్జున సంవాదే, భక్తియోగోనామ ద్వాదశోఽధ్యాయః

## అథ త్రయోదశోఽధ్యాయః
## క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగః

**శ్రీ భగవానువాచ:**

**1.** ఇదం శరీరం కౌంతేయ! క్షేత్రమిత్యభిధీయతే।
ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః।।

భగవంతుడు చెప్పాడు- కౌంతేయా! ఈ దేహాన్ని క్షేత్రము అంటారు. ఈ క్షేత్రమును తెలుసుకొనినవానిని క్షేత్రజ్ఞుడు అంటారు.

**2.** క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత!
క్షేత్రక్షేత్రజ్ఞయోర్ జ్ఞానం యత్తజ్ జ్ఞానం మతం మమ।।

అర్జునా! అన్ని దేహములయందు నివసించు నన్ను క్షేత్రజ్ఞుడినిగా తెలుసుకో. క్షేత్రాన్ని, క్షేత్రజ్ఞుని గుర్తించటమే యథార్థమైన జ్ఞానము.

**3.** తత్క్షేత్రం యచ్చ యాదృక్చ యద్వికారి యతశ్చ యత్।
స చ యో యత్ప్రభావశ్చ తత్సమాసేన మే శృణు।।

ఈ క్షేత్రము ఎటువంటిదో, ఎటువంటి ఆకార వికారములున్నాయో, దేనివలన ఏవిధముగా కలిగిందో, క్షేత్రజ్ఞుడనగా ఎవడో? ఎటువంటివాడో సంక్షిప్తముగా చెపుతాను, విను.

**4.** ఋషిభిర్బహుధా గీతం ఛందోభిర్వివిధైః పృథక్।
బ్రహ్మసూత్రపదైశ్చైవ హేతుమద్భిర్వినిశ్చితైః।।

ఋషులు క్షేత్ర, క్షేత్రజ్ఞ స్వరూప స్వభావములను అనేక రకాలుగా చెప్పారు. బ్రహ్మసూత్రములు వాటిని విపులముగా వివరించాయి. సంశయమునకు, సందేహమునకు అవకాశమీయకుండగా వ్యాఖ్యానించాయి.

**5.** మహాభూతాన్యహంకారః బుద్ధిరవ్యక్తమేవ చ।
ఇంద్రియాణి దశైకం చ పంచ చేంద్రియ గోచరాః।।

**6.** ఇచ్ఛా ద్వేష స్సుఖం దుఃఖం సంఘాతశ్చేతనా ధృతిః।
ఏతత్ క్షేత్రం సమాసేన సవికారముదాహృతమ్।।

పంచభూతములకు కారణమైన అహంకారము, అహంకారమునకు కారణమైన బుద్ధి, బుద్ధికి కారణమైన మూలప్రకృతి, పది ఇంద్రియాలు, మనస్సు, ఇంద్రియవిషయములైన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ, అను స్థూలభూతములు, ఇచ్ఛ, ద్వేషము, దుఃఖము, శరీరము, దానిలోని చైతన్యము, ధైర్యము ఇవన్నీ కలిసిన దానిని క్షేత్రము అని అంటారు. మహదాది ఇంద్రియ వికారములతో కూడిన ఈ క్షేత్ర తత్త్వము సంగ్రహంగా చెప్పబడుతోంది.

**7.** అమానిత్వమదంభిత్వం అహింసా క్షాంతిరార్జవమ్।
ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః।।

అభిమానము లేకపోవుట, దంభము లేకపోవుట, ఇతరులను పీడించకుండుట, ఓర్పు కలిగి ఉండుట, సరళముగా ఉండుట, గురుశుశ్రూష చేయుట, బాహ్యాభ్యంతరములయందు శుచిగా ఉండుట, మోక్షము సాధించవలెనని ఆత్మనిగ్రహము కలిగి ఉండుట---

**8.** ఇంద్రియార్థేషు వైరాగ్యం అనహంకార ఏవ చ।
జన్మమృత్యు జరావ్యాధి దుఃఖదోషానుదర్శనమ్।।

భోగ్యములైన ఇంద్రియవిషయములపై విరక్తి చెందుట, అభిమానము లేకపోవుట, జన్మ మృత్యు జరా వ్యాధులలోని దుఃఖములయందు ఉండు దోషములను తెలుసుకొని నిమిత్తమాత్రముగా ఉండుట----

**9.** అసక్తిరనభిష్వంగః పుత్రదారగృహాదిషు।
నిత్యం చ సమచిత్తత్వం ఇష్టానిష్టోపపత్తిషు।।

భార్యాపుత్ర గృహాదులయందు ఆసక్తి, మమకారము లేకపోవుట, శుభములు కానీ, అశుభములు కానీ కలిగినప్పుడు, నిగ్రహముగా ఉండుట---

**10.** మయి చానన్యయోగేన భక్తిరవ్యభిచారిణీ।
వివిక్తదేశ సేవిత్వం అరతిర్జనసంసది।।

నాయందు సర్వాత్మదృష్టితో భక్తి కలిగి ఉండుట, చిత్తమునకు శాంతిని కలిగించు ప్రదేశములయందు నివసించుట, మూర్ఖ జనులకు దూరముగా ఉండుట ---

**11.** అధ్యాత్మజ్ఞాననిత్యత్వం తత్త్వజ్ఞానార్థదర్శనమ్।
ఏతజ్జ్ఞానమితి ప్రోక్తం అజ్ఞానం యదతోఽన్యథా।।

ఆత్మజ్ఞానమునందు నిష్ఠ కలిగి ఉండుట, మోక్షముపై గొప్ప కోరిక కలిగి ఉండుట జ్ఞానము అని చెప్పబడుతోంది. వీటికి వ్యతిరేకములైన మానము, దంభము, మొదలగునవి అజ్ఞానరూపములు. జ్ఞానమునకు ప్రతిబంధకములు. కావున విడిచిపెట్టవలసినవే.

**12.** జ్ఞేయం యత్తత్ ప్రవక్ష్యామి యజ్ జ్ఞాత్వాఽమృతమశ్నుతే।
అనాదిమత్పరం బ్రహ్మ న సత్తన్నాసదుచ్యతే।।

తెలుసుకొనుటకు ఏది యోగ్యము? దేనిని తెలుసుకొనినచో అమృతత్త్వము లభిస్తుందో, దాని గురించి చెపుతాను. అది సనాతనమైన పరబ్రహ్మము. దానిని సత్పదార్థముగా గానీ, అసత్పదార్థముగా గానీ చెప్పుటకు వీలుకాదు. అది ఇంద్రియములకు కనిపించదు.

**13.** సర్వతః పాణిపాదం తత్ సర్వతోఽక్షిశిరోముఖమ్।
సర్వత శ్శృతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి।।

ఎరుంగ వలసినదై (వెనుక చెప్పిన) ఆ బ్రహ్మము ఎటు చూసినా అంతటా వ్యాపించి ఉంది. తనయొక్క కాళ్లతో, చేతులతో, తలలతో ముఖాలతో, చెవులతో ఈ ప్రపంచమంతా వ్యాపించి ఉంది.

**14.** సర్వేంద్రియగుణాభాసం సర్వేంద్రియవివర్జితమ్।
అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృ చ।।

ఈ పరబ్రహ్మ తత్త్వము అన్ని ఇంద్రియములయందు కలిసి పోయి ఉన్నట్లు కనిపించినా, కలవదు. దేనితోనూ కలవకపోయినా, కలిసినట్లు ఉంటుంది. అన్నిటినీ ధారణ, పోషణ చేస్తూ ఉంటుంది. నిర్గుణమై ఉండి, త్రిగుణములను పాలిస్తుంది.

**15.** బహిరంతశ్చ భూతానాం అచరం చరమేవ చ।
సూక్ష్మత్వాత్ తదవిజ్ఞేయం దూరస్థం చాంతికే చ తత్।।

ఇది అన్ని భూతములకు, లోపలా బైట ఉంటుంది. చరాచర స్వరూపమైనప్పటికీ, సూక్ష్మాతి సూక్ష్మమగుటచే దీనిని గురించి తెలుసుకొనుట కష్టము. దీనిని గుర్తించినవారికి దగ్గర అవుతుంది. గుర్తించని అజ్ఞానులకు దూరంగా ఉంటుంది.

**16.** అవిభక్తం చ భూతేషు విభక్తమివ చ స్థితమ్।
భూతభర్తృ చ తజ్ జ్ఞేయం గ్రసిష్ణు ప్రభవిష్ణు చ।।

ఈ పరమాత్మ ఆకాశమువలె అఖండంగా ఉంటుంది. పరిపూర్ణముగా ఉంటుంది. చరాచరభూతములయందు భిన్నముగా కనిపిస్తుంది. సర్వభూతములను పోషిస్తుంది. లయం చేస్తుంది. తిరిగి మళ్లీ సృష్టి కాలంలో పుట్టింప చేస్తుంది.

**17.** జ్యోతిషామపి తజ్జ్యోతిః తమసః పరముచ్య తే।
జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్।।

ఈ బ్రహ్మమే సూర్యునికి, అగ్నికి తేజస్సు నిచ్చింది. చీకటికి దూరంగా ఉంటుంది. అదే జ్ఞానము. అదే జ్ఞేయము. జ్ఞానముచే పొందవలసిందదే. సర్వహృదయాంతర్యామి కూడా అదే.

**18.** ఇతి క్షేత్రం తథా జ్ఞానం జ్ఞేయం చోక్తం సమాసతః।
మద్భక్త ఏతద్విజ్ఞాయ మద్భావాయోపపద్యతే।।

క్షేత్ర, జ్ఞాన, జ్ఞేయముల గురించి నీకు సంగ్రహముగా చెపుతాను. నాయొక్క భక్తుడు, ఈ మూడింటినీ తెలుసుకొని బ్రహ్మజ్ఞానమును పొందుటకు యోగ్యుడవుతాడు.

**19.** ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి।
వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతిసంభవాన్।।

ప్రకృతి పురుషులు తెలియబడని అనాదివని తెలుసుకో. దేహేంద్రియ వికారాలు, త్రిగుణాలు, సుఖదుఃఖాలు ప్రకృతి వల్లనే పుడుతున్నాయి.

**20.** కార్యకరణకర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే।
పురుష స్సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే।।

దేహేంద్రియాల కర్తృత్వానికి ప్రకృతి కారణము. సుఖదుఃఖాల అనుభవానికి పురుషుడు కారణము.

**21.** పురుషః ప్రకృతిస్థో హి భుంక్తే ప్రకృతిజాన్ గుణాన్।
కారణం గుణసంగోఽస్య సదసద్యోని జన్మసు।।

ప్రకృతి కృత దేహగతుడై ఉండి కూడా ఈ జీవుడు ప్రకృతి నుండి పుట్టిన గుణములవలన సుఖదుఃఖాలను అనుభవిస్తున్నాడు. వివిధ యోనులయందు పుడుతున్నాడు. తిరిగి మట్టిలో కలిసిపోతున్నాడు. గుణసంగమమే దీనికి కారణము.

**22.** ఉపద్రష్టాఽనుమంతా చ భర్తా భోక్తా మహేశ్వరః।
పరమాత్మేతి చాప్యుక్తః దేహేఽస్మిన్ పురుషః పరః॥

బ్రహ్మము ఈ దేహము నందే ఉన్నప్పటికీ, దేహము కంటే అతీతుడు, స్వతంత్రుడు, అనుకూలుడు, సాక్షిమాత్రుడు, పోషకుడు, భోగి, అంతర్యామి, పరమాత్మ అని చెప్పబడుచున్నాడు.

**23.** య ఏవం వేత్తి పురుషం ప్రకృతిం చ గుణైస్సహ।
సర్వథా వర్తమానోఽపి న స భూయోఽభిజాయతే॥

ఈ విధముగా జీవుడి గురించి గానీ, త్రిగుణములతో కూడిన ప్రకృతిని గురించి గానీ, బాగుగా తెలుసుకొనినవాడు ఎట్టి కర్మలు చేసినా, తిరిగి జన్మించడు.

**24.** ధ్యానేనాత్మని పశ్యంతి కేచిదాత్మానమాత్మనా।
అన్యే సాంఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే॥

కొందరు ఈ పరమాత్మను పరిశుద్ధమైన సూక్ష్మబుద్ధి గల హృదయంతో చూస్తున్నారు. మరికొందరు యోగధ్యానం వల్ల చూస్తున్నారు. మరికొందరు జ్ఞానయోగము ద్వారా చూస్తున్నారు. మరికొందరు నిష్కామయోగము ద్వారా పరమాత్మను దర్శిస్తున్నారు.

**25.** అన్యే త్వేవమజానంతః శ్రుత్వాఽన్యేభ్య ఉపాసతే।
తేఽపి చాతితరంత్యేవ మృత్యుం శ్రుతిపరాయణాః॥



మరికొందరు ఈ ఆత్మతత్త్వమును గురించి తెలియనివారు, తత్త్వ జ్ఞానులైన మహర్షులను సేవ చేస్తూ తెలుసుకొంటున్నారు. వీరు కూడా మృత్యురూపమైన సంసారము నుండి నిస్సందేహముగా తరిస్తారు.

**26.** యావత్సంజాయతే కించిత్ సత్త్వం స్థావరజంగమమ్।
క్షేత్రక్షేత్రజ్ఞ సంయోగాత్ తద్విద్ధి భరతర్షభ!॥

అర్జునా! స్థావర జంగమ రూపమైన చరాచర జీవములతో కూడిన ఈ ప్రపంచమంతా క్షేత్రక్షేత్రజ్ఞుల సంయోగమువలన పుట్టినదే అని తెలుసుకో.

**27.** సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్।
వినశ్యత్స్వవినశ్యంతం యః పశ్యతి స పశ్యతి॥

అన్ని భూతములతో సమానముగా ఉండి, అన్ని భూతములు నశించినా, తాను మాత్రం నశించడు కాబట్టి ఆ పరమేశ్వరుని చూచినవాడే నిజమైన ద్రష్ట.

**28.** సమం పశ్యన్ హి సర్వత్ర సమవస్థితమీశ్వరమ్।
న హినస్త్యాత్మనాఽఽత్మానం తతో యాతి పరాంగతిమ్॥

పరమేశ్వరుని సర్వత్ర సమానముగా చూచువాడు, తనను తాను పాడు చేసుకోడు. అందువలన అతడు ఉత్తమగతిని పొందుతాడు.

**29.** ప్రకృత్యైవ చ కర్మాణి క్రియమాణాని సర్వశః।
యః పశ్యతి తథాఽఽత్మానం అకర్తారం స పశ్యతి॥

అన్ని కర్మలూ ప్రకృతి ద్వారా జరుగుతున్నాయని, ఆత్మకు కర్తృత్వము లేదని తెలుసుకొనినవాడే జ్ఞాని.

**30.** యదా భూతపృథగ్భావం ఏకస్థమనుపశ్యతి।
తత ఏవ చ విస్తారం బ్రహ్మ సంపద్యతే తదా।।

అన్ని భూతములను ఆత్మపరముగా చూస్తూ, అవన్నీ ఆత్మయందే పుట్టి, ఆత్మగతమై సర్వత్ర నిండి ఉన్నాయని గ్రహించినప్పుడు, మానవుడే బ్రహ్మత్వమును పొందుతాడు.

**31.** అనాదిత్వాన్నిర్గుణత్వాత్ పరమాత్మాఽయమవ్యయః।
శరీరస్థోఽపి కౌంతేయ! న కరోతి న లిప్యతే।।

అర్జునా! ఈ పరమాత్మ అనాది. ఉత్పత్తి లేనిది. గుణసంగమము లేనిది. అవ్యయమైనది. అవికారమైనది. అట్టి ఈ పరమాత్మ శరీరంలో ప్రకాశిస్తూ ఉన్నప్పటికీ, దీనికి కర్తృత్వము కానీ, కర్మఫలత్వము కానీ ఉండవు.

**32.** యథా సర్వగతం సౌక్ష్మ్యాత్ ఆకాశం నోపలిప్యతే।
సర్వత్రావస్థితో దేహే తథాఽఽత్మా నోపలిప్యతే।।

అంతటా వ్యాపించిన ఆకాశము సూక్ష్మభావనవలన దేనికీ అంటబడకుండా ఉంటున్నదో, అదే విధముగా ఆత్మ వివిధ శరీరాలలో ఉన్నప్పటికీ వాటి గుణాలు ఆత్మకు అంటవు.

**33.** యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః।
క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత!।।

ఒకే ఒక్క సూర్యుడు జగత్తునంతా ప్రకాశింప చేయునట్లు, క్షేత్రజ్ఞుడైన పరమాత్మ క్షేత్రములైన అన్ని దేహములను ప్రకాశింప చేస్తున్నాడు.

**34.** క్షేత్రక్షేత్రజ్ఞయోరేవం అంతరం జ్ఞానచక్షుషా।
భూతప్రకృతిమోక్షం చ యే విదుర్యాంతి తే పరమ్।।

క్షేత్ర క్షేత్రజ్ఞుల భేదాన్ని సర్వభూత కారణమైన మాయాబంధాన్ని, నివారించు ఉపాయములను తనయొక్క జ్ఞాననేత్రము ద్వారా తెలుసుకొనిన సాధకుడే పరమగతిని పొందుచున్నాడు. అట్టి వారు తిరిగి జన్మించరు.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు,
బ్రహ్మవిద్యాయాం, యోగశాస్త్రే,
శ్రీకృష్ణార్జున సంవాదే, క్షేత్రక్షేత్రజ్ఞ
విభాగ యోగోనామ త్రయోదశోఽధ్యాయః

## అథ చతుర్దశోఽధ్యాయః
## గుణత్రయ విభాగయోగః

శ్రీభగవానువాచ:

**1.** పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞానముత్తమమ్।
యజ్ జ్ఞాత్వా మునయస్సర్వే పరాం సిద్ధిమితో గతాః।।

భగవంతుడు పలికాడు- ఏ జ్ఞానము వల్ల మునులు మోక్షమును పొందుచున్నారో, అట్టి ఉత్తమమైన జ్ఞానమార్గమును నీకు మళ్లీ చెపుతాను విను.

**2.** ఇదం జ్ఞానముపాశ్రిత్య మమ సాధర్మ్యమాగతాః।
సర్గేఽపి నోపజాయంతే ప్రలయే న వ్యథంతి చ।।

ఈ జ్ఞానయోగమును ఆచరించినవారు, నాయొక్క స్వరూపమును తెలుసుకొని, జనన మరణముల నుండి తప్పుకొంటారు.

**3.** మమ యోనిర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్।
సంభవ స్సర్వభూతానాం తతో భవతి భారత!।।

అర్జునా! త్రిగుణాత్మకమైన మాయ అను ప్రకృతియే నాకు గర్భస్థ. అందులో నేను సృష్టి బీజాన్ని ఉంచుతాను. తరువాత సంబంధించిన హిరణ్యగర్భుడి (సృష్టిబీజము) నుండి సర్వభూతాలు సృష్టించబడుచున్నాయి.

**4.** సర్వయోనిషు కౌంతేయ! మూర్తయ స్సంభవంతి యాః।
తాసాం బ్రహ్మ మహద్యోనిః అహం బీజప్రదః పితా।।

అనేక గర్భముల నుండి పుట్టిన శరీరములకన్నింటికీ ప్రకృతియే తల్లి. బీజమును నాటిన నేనే తండ్రిని.

**5.** సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతి సంభవాః।
నిబధ్నంతి మహాబాహో! దేహే దేహినమవ్యయమ్।।

భౌతిక ప్రకృతి సత్త్వరజస్తమములు అనబడే మూడు గుణములతో కూడి ఉంటుంది. నిర్వికారుడైన జీవికి ప్రకృతితో సంపర్కము కలిగినప్పుడు, ఆ త్రిగుణములచేత బంధించబడతాడు.

**6.** తత్ర సత్త్వం నిర్మలత్వాత్ ప్రకాశకమనామయమ్।
సుఖసంగేన బధ్నాతి జ్ఞానసంగేన చానఘ!।।

ఆ విధముగా బంధించిన వాటిలో సత్త్వగుణము నిర్మలము, శాంతము, ప్రకాశస్వభావము అయి ఉంటుంది. ఇది జ్ఞానాసక్తిని, సుఖాసక్తిని కలిగించి, ఆత్మను బంధిస్తుంది.

**7.** రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసంగసముద్భవమ్।
తన్నిబధ్నాతి కౌంతేయ! కర్మసంగేన దేహినమ్।।

అర్జునా! రజోగుణము రాగమయమైనది. కోరిక నుండి పుడుతుంది. ఇది వివిధ కర్మలయందు అనురాగాన్నీ, మోహాన్ని పుట్టిస్తుంది. కామక్రోధాలకు ఇది కారణమౌతుంది. వివిధరకములైన ఫలములను పొందవలెను అను ఆశను పుట్టించి, మానవుని బంధించి వేస్తుంది.

**8.** తమస్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్।
ప్రమాదాలస్యనిద్రాభిః తన్నిబధ్నాతి భారత!।।

అజ్ఞానము నుండి పుట్టిన తమోగుణము, జీవులను భ్రాంతిలో పడవేస్తుంది. సోమరితనము, నిద్ర, పొరపాటు, మతిమరుపు, మొదలగు వాటితో ఇది ఆత్మను శరీరంలో బంధించి వేస్తుంది.

**9. సత్త్వం సుఖే సంజయతి రజః కర్మణి భారత!।**
**జ్ఞానమావృత్య తు తమః ప్రమాదే సంజయత్యుత।।**

అర్జునా! సత్త్వగుణము జీవుని సుఖబద్ధుని చేస్తుంది. రజోగుణము కర్మతునిగా చేస్తుంది. తమోగుణము జ్ఞానమును తొలగింప చేసి, ప్రమాదాలను, దుఃఖములను కలిగింప చేస్తుంది.

**10. రజస్తమశ్చాభిభూయ సత్త్వం భవతి భారత!।**
**రజస్సత్త్వం తమశ్చైవ తమస్సత్త్వం రజస్తథా।।**

అర్జునా! ఒకప్పుడు రజస్తమములను అణచి వేసి, సత్త్వగుణము ప్రబలంగా ఉంటుంది. మరొక సమయంలో సత్త్వరజస్సులను అణచివేసి తమోగుణము ప్రధానంగా ఉంటుంది. వేరొక సమయంలో సత్త్వతమస్సులను అణచి వేసి రజోగుణము ప్రధానంగా ఉంటుంది.

**11. సర్వద్వారేషు దేహేఽస్మిన్ ప్రకాశ ఉపజాయతే।**
**జ్ఞానం యదా తదా విద్యాత్ వివృద్ధం సత్త్వమిత్యుత।।**

శరీర ద్వారములైన జ్ఞానేంద్రియాలు కాంతిమంతమై ప్రకాశిస్తూ ఉంటాయో, అతనిలో సత్త్వగుణము ఎక్కువగా ఉన్నట్లు గ్రహించవచ్చు.

**12. లోభః ప్రవృత్తి రారంభః కర్మణామశమస్స్పృహా।**
**రజస్యేతాని జాయంతే వివృద్ధే భరతర్షభ!।।**

రజోగుణము అభివృద్ధి చెందినవారికి లోభము, మోహము, క్రోధము ఎక్కువగా ఉంటాయి. అశాంతి, ఆశలు కలుగుతూ ఉంటాయి.

**13. అప్రకాశోఽప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవ చ।**
**తమస్యేతాని జాయంతే వివృద్ధే కురునందన!।।**

తమోగుణము అధికముగా కలవారిలో సోమరితనము, మూర్ఖత్వము ఎక్కువగా ఉంటాయి. అవివేకము, ప్రయత్నశూన్యత, మూఢత్వము తమోగుణమునకు లక్షణాలు.

**14. యదా సత్త్వే ప్రవృద్ధే తు ప్రలయం యాతి దేహభృత్।**
**తదోత్తమవిదాం లోకాన్ అమలాన్ ప్రతిపద్యతే।।**

సత్త్వగుణవృద్ధితో జీవితమంతా గడిపి, మరణించినవారు బ్రహ్మజ్ఞానులు ఉండే ఉత్తమలోకాలను పొందుతారు.

**15. రజసి ప్రలయం గత్వా కర్మసంగిషు జాయతే।**
**తథా ప్రలీనస్తమసి మూఢయోనిషు జాయతే।।**

రజోగుణముతో జీవితమంతా గడిపి, మరణించినవారు కర్మాసక్తమైన మనుష్యలోకములో జన్మిస్తారు. అదేవిధముగా తమోగుణము అభివృద్ధి చెందినప్పుడు, మరణించినవారు పశుపక్ష్య క్రిమికీటకాది యోనులయందు జన్మిస్తారు.

**16. కర్మణ స్సుకృతస్యాహుః సాత్త్వికం నిర్మలం ఫలమ్।**
**రజసస్తు ఫలం దుఃఖం అజ్ఞానం తమసః ఫలమ్।।**

సత్త్వగుణముతో సంపాదించిన కర్మఫలము వలన నిర్మలమైన సుఖమును అనుభవిస్తారు. రాజస కర్మల వలన సంపాదించిన ఫలముతో దుఃఖమును అనుభవిస్తారు. తామస కర్మలు చేయుట వలన లభించిన ఫలముతో అజ్ఞానమును, సంతాపమును పొందుతారు.

**17. సత్త్వాత్సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ।**
**ప్రమాదమోహౌ తమసః భవతోఽజ్ఞానమేవ చ।।**

సత్త్వగుణమువలన జ్ఞానము లభిస్తుంది. రజోగుణమువలన లోభము కలుగుతుంది. తమోగుణమువలన అవివేకిత్వము, మూర్ఖత్వము కలుగుతాయి.

**18.** **ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థాః మధ్యే తిష్ఠంతి రాజసాః।**
**జఘన్య గుణవృత్తిస్థాః అధో గచ్ఛంతి తామసాః॥**

సాత్త్వికులు మనుష్య, గంధర్వ లోకమునుండి సత్యలోకము వరకూ గల ఊర్ధ్వలోకముల యందు ప్రయాణం చేస్తూ ఉంటారు. రాజసికులు మనుష్యలోకంలోనే జన్మిస్తారు. తామసికులు అంధతామిస్రాది నరకములలో శిక్షను అనుభవిస్తూ, పశుపక్ష్యాది జంతువులై తిరిగి జన్మిస్తారు.

**19.** **నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టానుపశ్యతి।**
**గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽధిగచ్ఛతి॥**

సమస్త వ్యాపారములలోనూ కూడా ఈ త్రిగుణముల కంటే వేరైన శక్తి, కర్త ఎవడూ లేడని, పరమాత్మ ఈ గుణత్రయమునకు అతీతుడని తెలుసుకొనినవారు, నాయందు లయమవుతారు.

**20.** **గుణానేతానతీత్య త్రీన్ దేహీ దేహసముద్భవాన్।**
**జన్మమృత్యుజరాదుఃఖైః విముక్తోఽమృతమశ్నుతే॥**

దేహమునందు బంధించబడిన జీవుడు, ఈ త్రిగుణములను అతిక్రమించినప్పుడే, జన్మ, మృత్యు, జరాదులు అనెడి దుఃఖములను దాటి, బ్రహ్మానందాన్ని పొందుతాడు.

**అర్జున ఉవాచ:**

**21.** **కైర్లింగైస్త్రీన్ గుణానేతాన్ అతీతో భవతి ప్రభో!।**
**కిమాచారః కథం చైతాన్ త్రీన్ గుణానతివర్తతే॥**

అర్జునుడు పలికాడు- శ్రీకృష్ణా! సత్త్వరజస్తమోగుణములను అతిక్రమించిన వానియొక్క లక్షణములు ఎలా ఉంటాయి? అతడి ఆచరణ ఏవిధముగా ఉంటుంది? ఈ మూడు గుణములను దాటు విధానమేమి? అని అడిగాడు.

**శ్రీభగవానువాచ:**

**22.** **ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహమేవ చ పాండవ!।**
**న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాంక్షతి॥**

భగవంతుడు చెప్పాడు- అర్జునా! ప్రకాశము, ప్రవృత్తి, మోహము అను లక్షణములు గల సత్త్వరజస్తమోగుణములు ఆవిర్భవించినా, గుణాతీత పురుషుడు వాటిని దుఃఖములుగా భావించి స్వీకరించడు. అవి లేనప్పుడు, సుఖములుగా భావించి ఆకాంక్షించడు.

**23.** **ఉదాసీనవదాసీనః గుణైర్యో న విచాల్యతే।**
**గుణా వర్తంత ఇత్యేవ యోఽవతిష్ఠతి నేంగతే॥**

ఎవడు ఉదాసీనుడివలె సాక్షిభూతుడై ఉంటూ, గుణకార్యములైన సుఖదుఃఖములతో చలించకుండగా, గుణములతో నాకు ఎట్టి సంబంధము లేదు అను వివేకజ్ఞానముతో ప్రకాశిస్తాడో, అతడు గుణాతీతుడు.

**24.** **సమదుఃఖసుఖస్స్వస్థః సమలోష్టాశ్మకాంచనః।**
**తుల్యప్రియాప్రియో ధీరః తుల్యనిందాత్మసంస్తుతిః॥**

సుఖదుఃఖములయందు సమబుద్ధి, ఆత్మస్వరూప స్థితుడు, రాయి, బంగారము, మట్టి యందు సమానమైన బుద్ధి కలవాడు, ప్రియము నందు, అప్రియము నందు సమానమైన జ్ఞానము కలవాడు, నిందను, స్తుతిని సమానంగా స్వీకరించువాడు ధీరుడు, గుణాతీతుడు అని చెప్పబడుచున్నాడు.

**25.** మానాపమానయోస్తుల్యః తుల్యో మిత్రారిపక్షయోః।
సర్వారంభ పరిత్యాగీ గుణాతీత స్స ఉచ్యతే।।

మానావమానములయందు శత్రుమిత్రులయందు సమానబుద్ధి కలవాడు, దృష్టఫలములను అదృష్టఫలములను విడిచిపెట్టినవాడు, కేవలము దేహధారణ కొరకై కర్మలు చేయు పురుషుడు త్రిగుణాతీతుడు అని చెప్పబడుచున్నాడు.

**26.** మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే।
స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే।।

ఎవడైతే సర్వభూతములయొక్క హృదయములయందు ఉన్న ఆత్మను తెలుసుకొను చున్నాడో, ఉపాసించు చున్నాడో, అట్టివాడు త్రిగుణములను అతిక్రమించి, బ్రహ్మభావమును పొందుటకు సమర్థుడగుచున్నాడు.

**27.** బ్రహ్మణో హి ప్రతిష్ఠాహం అమృతస్యావ్యయస్య చ।
శాశ్వతస్య చ ధర్మస్య సుఖస్యైకాంతికస్య చ।।

పరబ్రహ్మకు, నాశనము లేని మోక్షమునకు, ధర్మమునకు, సచ్చిదానంద రూపమైన నిరాకార పరబ్రహ్మమునకు, అన్నింటికీ నేనే మూలము. నేనే ఆశ్రయుడను.

ఇతి శ్రీమద్భగవద్గీతాసుపనిషత్సు, బ్రహ్మవిద్యాయాం, యోగశాస్త్రే,
శ్రీకృష్ణార్జున సంవాదే, గుణత్రయవిభాగ యోగోనామ
చతుర్దశోఽధ్యాయః



## అథ పంచదశోఽధ్యాయః - పురుషోత్తమ యోగః

**శ్రీభగవానువాచ:**

**1.** ఊర్ధ్వమూలమధశ్శాఖం అశ్వత్థం ప్రాహురవ్యయమ్।
ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్।।

భగవంతుడు చెప్పాడు- ఈ సంసారవృక్షానికి మూలకారణం పైన ఉంది. దీని శాఖలైన హిరణ్యగర్భుడు మొదలైనవారు క్రింద ఉన్నారు. కర్మకాండ రూపమైన వేదాలు దీని పత్రాలు. అనాది, క్షణికము, అయిన ఈ సంసారమును వేదశాస్త్రములు మాయావృక్షము అని వర్ణించాయి. ఇట్టి సంసార వృక్షమును తెలిసినవాడే వేదజ్ఞుడు.

**2.** అధశ్చోర్ధ్వం ప్రసృతాస్తస్య శాఖాః
గుణప్రవృద్ధా విషయప్రవాలాః।
అధశ్చమూలాన్యనుసంతతాని
కర్మానుబంధీని మనుష్యలోకే।।

ఈ వృక్షముయొక్క శాఖాసముహాలు (జీవులు) సత్త్వరజస్తమో గుణములవల్ల పరిపుష్టి పొందుతూ, అంతటా వ్యాపించి ఉన్నాయి. ఇంద్రియములే ఈ సంసార వృక్షమునకు చిగుళ్లుగా క్రిందకూ పైకీ వ్యాపించి ఉన్నాయి. మనుష్యలోకంలో సకామకర్మలచేత బంధించబడినవై ధర్మ, అధర్మములే దీనికి మూలములైన వ్రేళ్లుగా క్రిందకు పాకి ఉన్నాయి.

**3.** న రూపమస్యేహ తథోపలభ్యతే
నాంతో న చాదిర్న చ సంప్రతిష్ఠా।
అశ్వత్థమేనం సువిరూఢమూలం
అసంగశస్త్రేణ దృఢేన ఛిత్వా।।

ఈ సంసారంలో ఉండే ప్రాణులు, పైన వివరించిన వృక్షంయొక్క స్వరూపాన్ని తెలుసుకొనలేరు. ఆది, మధ్య, అంతములు లేకుండగా, గట్టి వ్రేళ్లతో నాటుకొని ఉన్న ఈ సంసారవృక్షమును తీవ్రవైరాగ్యము అను ఆయుధముతో ఛేదించాలి.

**4.** **తతః పదం తత్పరిమార్గితవ్యం**
**యస్మిన్ గతా న నివర్తంతి భూయః।**
**తమేవ చాద్యం పురుషం ప్రపద్యే**
**యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ।।**

దేనిని పొందితే తిరిగి ఈ సంసారమునకు వచ్చుట జరుగదో, అట్టి పరమపదమును అన్వేషించాలి. ఎవరి నుండి అనాది అయిన ఈ సంసార ప్రవాహము (ప్రారంభమైనదో) అట్టి ఆదిపురుషుడిని శరణుపొందాలి.

**5.** **నిర్మానమోహా జితసంగదోషాః**
**అధ్యాత్మనిత్యా వినివృత్తకామాః।**
**ద్వంద్వైర్విముక్తాః సుఖదుఃఖసంజ్ఞైః**
**గచ్ఛంత్యమూఢాః పదమవ్యయం తత్।।**

దురహంకారము, దుస్సంగము, అవివేకము, ఆసక్తి అను దోషములను జయించినవారు, పరమార్థమైన జ్ఞానమును గ్రహించినవారు, సుఖదుఃఖములనే ద్వంద్వములకు అతీతులైన జ్ఞానులు మాత్రమే ఈ పరమపదమును పొందగలుగుతున్నారు.

**6.** **న తద్భాసయతే సూర్యః న శశాంకో న పావకః।**
**యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ।।**

చంద్రసూర్యాగ్నులు, దేనిని ప్రకాశింప చెయ్యలేరో, దేనిని పొందితే వెనుకకు రాలేరో, అటువంటి స్వయంప్రకాశమైనదే పరమపదము.

**7.** **మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః।**
**మనఃషష్ఠానీంద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి।।**

పురాతనమైన నాయొక్క అవిద్యతో కూడిన అంశయే మనుష్యలోకంలో జీవునిగా మారుతున్నాడు. ప్రకృతిలోని వికారరూపములైన జ్ఞానేంద్రియ పంచకాన్ని, మనస్సును, సంసారభోగముల కొరకై ఆకర్షిస్తున్నాడు.

**8.** **శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః।**
**గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధానివాశయాత్।।**

గాలి సువాసనను తీసుకొని వెళ్లినట్లు, దేహాధికారి అయిన జీవుడు, క్రొత్త శరీరము పొందేటప్పుడు, పూర్వశరీరము నుండి కొన్ని భావ పరంపరలను తీసుకొని వెళ్లిపోతున్నాడు.

**9.** **శ్రోత్రం చక్షు స్స్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ।**
**అధిష్ఠాయ మనశ్చాయం విషయానుపసేవతే।।**

చెవులు, నేత్రములు, చర్మము, ముక్కు, నాలుక అను అయిదు ఇంద్రియములను ఆశ్రయించిన మనస్సును సహాయముగా చేసుకొని జీవుడు శబ్ద, రూప, రస, స్పర్శ గంధములనెడి విషయములను అనుభవిస్తున్నాడు.

**10.** **ఉత్క్రామంతం స్థితం వాఽపి భుంజానం వా గుణాన్వితమ్।**
**విమూఢా నానుపశ్యన్తి పశ్యంతి జ్ఞానచక్షుషః।।**

జీవుడు శరీరమును విడిచిపెట్టుట, త్రిగుణములయొక్క ప్రభావముచేత మరొక శరీరాన్ని స్వీకరించుట మొదలైన వాటిని గురించి మూర్ఖులు తెలుసుకొన లేరు. జ్ఞానసిద్ధులైన అంతర్ముఖులు మాత్రమే జ్ఞాననేత్రముతో జీవాత్మను దర్శిస్తున్నారు.

**11.** **యతంతో యోగినశ్చైనం పశ్యంత్యాత్మన్యవస్థితమ్।**
**యతంతోఽప్యకృతాత్మానః నైనం పశ్యంత్యచేతసః।।**

ఆత్మానుభూతిని పొందిన ధ్యాన అభ్యాసరతులైన యోగులు తమయొక్క బుద్ధి యందు సాక్షిరూపములో ఉన్న ఈ ఆత్మను చూస్తున్నారు. శాస్త్రములను చదివినప్పటికీ మలినచిత్తులైన మందమతులు ఈ ఆత్మను చూడలేరు.

**12.** **యదాదిత్యగతం తేజః జగద్భాసయతేఽఖిలమ్।**
**యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్।।**

ఈ సర్వ జగత్తును ప్రకాశింప చేయు సూర్య, చంద్ర, అగ్నులయందు ఉండు తేజస్సు నాదే అని తెలుసుకో.

**13.** **గామావిశ్య చ భూతాని ధారయామ్యహమోజసా।**
**పుష్ణామి చౌషధీ స్సర్వాః సోమో భూత్వా రసాత్మకః।।**

నేనే ఈశ్వర శక్తిచేత పృథ్వి యందు ప్రవేశించి, చరాచర భూతములను అన్నింటినీ ధరిస్తున్నాను. నేనే రసస్వరూపుడైన చంద్రుడిగా ఓషధులను, పాడిపంటలను పోషిస్తున్నాను.

**14.** **అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః।**
**ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్।।**

నేను జఠరాగ్ని రూపంలో ప్రాణుల శరీరముయందు ఉండి, వారు భుజించు భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్య అను నాలుగు రకముల ఆహారములను ప్రాణవాయువులతో కలిపి, పక్వము చేస్తున్నాను.

**15.** **సర్వస్య చాహం హృది సన్నివిష్టః**
**మత్త స్స్మృతిర్ జ్ఞానమపోహనం చ।**
**వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః**
**వేదాంతకృద్వేదవిదేవ చాహమ్।।**

అందరిలోనూ నేనే అంతరాత్మగా ఉంటున్నాను. జ్ఞాపకము అనగా స్మృతి, జ్ఞానము విస్మృతి అనగా మరిచిపోవుట, నావల్లే కలుగుతున్నాయి. వేదచతుష్టయము చేత ఆయా దేవతల యొక్క రూపముతో తెలియబడువాడను నేనే. వేదవేత్తనూ నేనే. వేద సంప్రదాయప్రవర్తకుడైన జ్ఞానగురువును నేనే.

**16.** **ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ।**
**క్షర స్సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే।।**

ఈ లోకంలో జీవులు క్షరులు, అక్షరులు అని రెండు రకాలు. స్థావర రూపమైన, వినాశశీలమైన జడశరీరములన్నీ క్షర పురుషులు. నిర్వికారుడైన చేతన భోక్త అయిన మాయాశక్తియే కూటస్థుడైన అక్షర పురుషుడు.

**17.** **ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః।**
**యో లోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః।।**

ఈ ఇద్దరికంటే ఉత్తమమైనవాడు పరమాత్మ. అతడే మూడు లోకములను వ్యాపించి, పోషించుచున్న అక్షయుడు, నాశరహితుడు.

**18.** **యస్మాత్ క్షరమతీతోఽహం అక్షరాదపి చోత్తమః।**
**అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః।।**

క్షరునికంటే, అక్షరునికంటే అతీతుడను అగుటచే వేదములు నన్ను పరమాత్మగా పురుషోత్తమునిగా కీర్తిస్తున్నాయి. లోకములయందు కూడా అదే విధంగా కీర్తించబడుచున్నాను.

19. యో మామేవమసమ్మూఢః జానాతి పురుషోత్తమమ్।
స సర్వవిద్భజతి మాం సర్వభావేన భారత॥

భ్రాంతిని విడిచిపెట్టి నన్నే పరమాత్మగా తెలుసుకొనినవాడు, సర్వజ్ఞుడై అన్ని విధములా నన్నే సేవిస్తాడు.

20. ఇతి గుహ్యతమం శాస్త్రం ఇదముక్తం మయాఽనఘ!
ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్ స్యాత్ కృతకృత్యశ్చ భారత॥

అర్జునా! అతి రహస్యమైన ఈ శాస్త్రమును నీకొరకు చెప్పాను. దీనిని నీవు గ్రహించి, జ్ఞానివై కృతార్థుడవు కమ్ము.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు, బ్రహ్మవిద్యాయాం, యోగశాస్త్రే, శ్రీకృష్ణార్జునసంవాదే, పురుషోత్తమ యోగోనామ పంచదశోఽధ్యాయః



అథ షోడశోఽధ్యాయః
దైవాసుర సంపద్విభాగయోగః

శ్రీ భగవానువాచ:

1. అభయం సత్త్వసంశుద్ధిః జ్ఞానయోగ వ్యవస్థితిః।
దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయస్తప ఆర్జవమ్।

2. అహింసా సత్యమక్రోధః త్యాగ శ్శాంతిరపైశునమ్।
దయా భూతేష్వలోలుప్త్వం మార్దవం హ్రీ రచాపలమ్॥

3. తేజః క్షమా ధృతిశ్శౌచం అద్రోహో నాతిమానితా।
భవంతి సంపదం దైవీం అభిజాతస్య భారత॥

భగవంతుడు చెప్పాడు- భయము లేకుండుట, పవిత్రమైన అంతఃకరణము, ఆధ్యాత్మికమైన జ్ఞానము, దానము, ఆత్మనిగ్రహము, యజ్ఞాచరణము, వేదాధ్యయనము, తపస్సు, సరళత్వము, అహింస, సత్యము, కోపము లేకుండుట, త్యాగము, శాంతము ఇతరులయందు దోషములను చూడకుండుట, మృదుత్వము, భూతదయ, లోభము లేకపోవుట, అసూయ లేకపోవుట, గౌరవమునందు ఆశ లేకపోవుట అనబడు ఈ గుణములు కలవారందరూ దైవాంశ సంభూతులుగా తెలుసుకో.

4. దంభో దర్పోఽభిమానశ్చ క్రోధః పారుష్యమేవ చ।
అజ్ఞానం చాభిజాతస్య పార్థ! సంపదమాసురీమ్॥

గర్వము, పొగరుబోతుతనము, దురభిమానము, క్రోధము, పరుష స్వభావము, అవివేకము అనే రాక్షస గుణాలు ఆసురీ సంపత్తి వలన పుట్టినవారికి ఉంటాయి.

**5.** దైవీ సంపద్విమోక్షాయ నిబంధాయాసురీ మతా।
మా శుచస్సంపదం దైవీం అభిజాతోఽసి పాండవ!।।

దైవీ సంపద మోక్షమునిస్తుంది. ఆసురీ సంపద సంసారబంధములను కలిగిస్తుంది. అర్జునా! నీవు దైవీ సంపత్తుతో జన్మించావు. కావున విచారించవలసిన అవసరం లేదు.

**6.** ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మిన్ దైవ ఆసుర ఏవ చ।
దైవో విస్తరశః ప్రోక్తః ఆసురం పార్థ! మే శృణు।।

లోకములోని ప్రాణులన్నీ దైవస్వభావ సంపన్నులు, ఆసుర స్వభావ యుక్తులు అని రెండు రకాలు. దైవీస్వభావం గురించి విపులంగా వివరించాను. ఆసుర స్వభావం గురించి చెపుతాను విను.

**7.** ప్రవృత్తిం చ నివృత్తిం చ జనా న విదురాసురాః।
న శౌచం నాపి చాచారః న సత్యం తేషు విద్యతే।।

ఆసురీ స్వభావము కలవారికి కర్మ, అకర్మ, విచక్షణ జ్ఞానము ఉండదు. శుచిత్వము, సత్యము, సదాచారము వీరికి ఉండవు. ధర్మప్రవృత్తి కలుగదు. అధర్మమునుండి నివృత్తులు కారు.

**8.** అసత్యమప్రతిష్ఠం తే జగదాహు రనీశ్వరమ్।
అపరస్పరసంభూతం కిమన్యత్ కామహైతుకమ్।।

వీరు ఈ ప్రపంచమును మిథ్య, అస్థిరము అంటారు. దేవుడు లేడు అంటారు. స్త్రీ పురుషుల సంయోగము వలననే సృష్టి జరిగినదని, మరే ఇతర కారణములు లేవని చెపుతారు. వీరి దృష్టిలో కామము తప్ప మరొక ఇతర వస్తువు గొప్పది ఏదీ లేదు.

**9.** ఏతాం దృష్టిమవష్టభ్య నష్టాత్మానోఽల్పబుద్ధయః।
ప్రభవంత్యుగ్రకర్మాణః క్షయాయ జగతోఽహితాః।।

అల్పబుద్ధులైన ఈ ఆసురీ స్వభావము కలవారు, సంసారమునకు నిష్ప్రయోజకులు. హాని చేసేవారు. నాస్తికమతమును అవలంబించుటచే పరలోకమునకు పయనించు అవకాశము లేనివారు. క్రూరకర్ములు. అల్పబుద్ధులైన వీరు ప్రపంచ వినాశము కొరకే పుడుతున్నారు.

**10.** కామమాశ్రిత్య దుష్పూరం దంభమానమదాన్వితాః।
మోహాద్గృహీత్వాఽసద్గ్రాహాన్ ప్రవర్తంతేఽశుచివ్రతాః।।

కామాశ్రితులై దంభ, దురభిమాన, మద పూరితులై మూర్ఖపు పట్టుదలలతో, మద్య మాంసాదులతో క్షుద్రదేవతలను ఆరాధిస్తూ, అపవిత్రములైన వ్రతమును చేస్తున్నారు.

**11.** చింతామపరిమేయాం చ ప్రళయాంతాముపాశ్రితాః।
కామోపభోగపరమాః ఏతావదితి నిశ్చితాః।।

వారు మరణించువరకు కష్టములను పొందుతూనే ఉన్నారు. కామభోగమే వీరికి గొప్పదైన పురుషార్థము, దానిని మించినది మరొకటి లేదు అని వీరి విశ్వాసము.

**12.** ఆశాపాశశతైర్బద్ధాః కామక్రోధపరాయణాః।
ఈహంతే కామభోగార్థం అన్యాయేనార్థసంచయాన్।।

అసంఖ్యాకములైన ఆశాపాశములకు బద్ధులై కామక్రోధములతో, విషయభోగములను అనుభవించుటకు, అక్రమముగా ధనార్జనచేసి, ఆపదలలో చిక్కుకొంటారు.

**13.** ఇదమద్య మయా లబ్ధం ఇమం ప్రాప్స్యే మనోరథమ్।
ఇదమస్తీదమపి మే భవిష్యతి పునర్ధనమ్।।

ఈ రోజున నాకు, ఇది లభించినది, నా కోరిక తీరుతుంది. నా దగ్గర చాలా ధనముంది. ఇంకా ఎక్కువ రాగలదు అనుకొంటారు.

**14.** అసౌ మయా హత శ్శత్రుః హనిష్యే చాపరానపి।
ఈశ్వరోఽహమహం భోగీ సిద్ధోఽహం బలవాన్ సుఖీ।।

ఈ శత్రువులను సంహరించాను. మిగిలినవారిని కూడా సంహరించగలను. నేనే అందరికీ మహారాజును. అన్ని భోగములను నేనే అనుభవించాలి. పురుషార్థములన్నీ నావే. నేను బలవంతుడిని. నిత్యభోగిని అనుకొంటారు.

**15.** ఆఢ్యోఽభిజనవానస్మి కోఽన్యోఽస్తి సదృశో మయా।
యక్ష్యే దాస్యామి మోదిష్యే ఇత్యజ్ఞానవిమోహితాః।।

వీరు అనేక రకములైన ఆశలకు బద్ధులై ఈ లోకంలో నాకంటే ధనవంతుడు మరొకడు లేడు. నాకంటే గొప్ప కులమునందు పుట్టినవాడు లేడు. నాతో సమానమైనవాడు లేడు అని ఆనందిస్తారు. యజ్ఞాలు చేస్తాను. దానాలు చేస్తాను. ఆనందిస్తాను అనుకొంటారు.

**16.** అనేకచిత్తవిభ్రాంతాః మోహజాలసమావృతాః।
ప్రసక్తాః కామభోగేషు పతంతి నరకేఽశుచౌ।।

కానీ అవివేకమువలన మనస్సు విక్షిప్తము చెంది, మోహమునందు పడి, సత్కర్మలను చేయక, విషయభోగములందు ఆసక్తులై, అపవిత్రములైన నరకములయందు పడుతున్నారు.

**17.** ఆత్మసంభావితాస్స్తబ్ధాః ధనమానమదాన్వితాః।
యజంతే నామయజ్ఞైస్తే దంభేనావిధిపూర్వకమ్।।

వారు తనను తాను పొగుడుకొంటారు. ఐశ్వర్యమదగర్వంతో, అహంకారంతో, శాస్త్రమర్యాదలను పాడుచేస్తారు. వారు చేయు యజ్ఞముల యందు భక్తి ఉండదు. వినయము ఉండదు. అహంకారము ఉంటుంది.

**18.** అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః।
మామాత్మపరదేహేషు ప్రద్విషంతోఽభ్యసూయకాః।।

సర్వానర్థములకు, సర్వ దోషములకు మూలకారణమైన అహంకారమును విడిచిపెట్టరు. వీరికి స్త్రీవాంఛ ఎక్కువ. క్రోధము ఎక్కువ. అన్ని కర్మలకూ సాక్షినైన నన్ను నిరంతరమూ నిందిస్తారు. ద్వేషిస్తారు. నాయొక్క శాసనమును ధిక్కరిస్తారు. సద్గుణములతో కూడి సత్కర్మలను చేయువారిని పరిహసిస్తారు.

**19.** తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్।
క్షిపామ్యజస్రమశుభాన్ ఆసురీష్వేవ యోనిషు।।

నన్ను ద్వేషించువారు, క్రూరకర్మలు చేయువారు, మహాపాపులు అయినవారికి తిరిగి నేను రాక్షసజన్మనే కలుగజేస్తాను.

**20.** ఆసురీం యోనిమాపన్నాః మూఢా జన్మని జన్మని।
మామప్రాప్యైవ కౌంతేయ తతో యాంత్యధమాం గతిమ్।।

కౌంతేయా! ఇటువంటి మూర్ఖులు ప్రతిజన్మలోనూ, ఆసుర శరీరమును పొంది, సన్మార్గ విముఖులై నన్ను చేరలేక, క్రిమికీటకాది జన్మలను పొందుచున్నారు.

**21.** త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః।
కామః క్రోధస్తథాలోభః తస్మాదేతత్త్రయం త్యజేత్।।

కామము, క్రోధము, లోభము అనునవి నరకమునకు ప్రవేశించు ద్వారములు. ఆత్మజ్ఞానమును నాశనం చేయు స్వభావము కలవి. అందుచేత ఆ మూడింటిని విడిచిపెట్టాలి.

**22.** **ఏతైర్విముక్తః కౌంతేయ తమోద్వారై స్త్రిభిర్నరః।**
**ఆచరత్యాత్మనశ్శ్రేయః తతో యాతి పరాం గతిమ్॥**

కౌంతేయా! నరక ద్వారములైన కామక్రోధ లోభములను విసర్జించిన జీవుడు, తపస్సు, యోగము మొదలగు ధర్మకర్మలవలన ఆత్మజ్ఞానము కలిగి మోక్షమును పొందుచున్నాడు.

**23.** **యశ్శాస్త్రవిధి ముత్సృజ్య వర్తతే కామకారతః।**
**న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిమ్॥**

వేదశాస్త్రములను నిందించు నాస్తికులకు శాంతిగానీ, మోక్షము గానీ లభించదు.

**24.** **తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ।**
**జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి॥**

కావున యుక్తాయుక్త విచక్షణకై వేదశాస్త్రములే నీకు ప్రమాణము. వాటిలో చెప్పబడిన ధర్మములను గ్రహించి, నీవు సత్కర్మలను ఆచరించాలి సుమా! అని ఉపదేశించాడు.

**ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు, బ్రహ్మవిద్యాయాం,**
**యోగశాస్త్రే, శ్రీకృష్ణార్జునసంవాదే**
**దైవాసుర సంపద్విభాగయోగోనామ షోడశోఽధ్యాయః**



**అథ సప్తదశోఽధ్యాయః**
**శ్రద్ధాత్రయ విభాగయోగః**

**అర్జున ఉవాచ:**

**1.** **యే శాస్త్రవిధిముత్సృజ్య యజంతే శ్రద్ధయాన్వితాః।**
**తేషాం నిష్ఠా తు కా కృష్ణ! సత్త్వమాహో రజస్తమః॥**

అర్జునుడు పలికాడు - శ్రీకృష్ణా! శాస్త్ర మర్యాదలను, అతిక్రమించినప్పటికీ, శ్రద్ధతో పూజలు చేయువారు సాత్వికులా? రాజసులా? తామసులా? వారి పూజా విధానము ఎటువంటిది?

**శ్రీభగవానువాచ:**

**2.** **త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా।**
**సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి తాం శృణు॥**

భగవంతుడు చెప్పాడు - పూర్వజన్మల వాసనలను అనుసరించి, ప్రాణులకు సహజముగా సాత్త్విక, రాజస, తామస గుణములతో కూడిన శ్రద్ధలేర్పడతాయి. వాటిని గురించి తెలియజేస్తాను. ఈ మూడు శ్రద్ధలు పూర్వజన్మకు సంబంధించిన ధర్మాధర్మ సంస్కారముల వలన కలుగుతాయి.

**3.** **సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత!।**
**శ్రద్ధామయోఽయం పురుషః యో యచ్ఛ్రద్ధ స్స ఏవ సః॥**

అర్జునా! ప్రాణులందరికీ వారియొక్క అంతఃకరణ సంస్కారమును అనుసరించి శ్రద్ధ కలుగుతోంది. మనిషి శ్రద్ధామయుడు. శ్రద్ధ లేనివాడు లేనే లేడు. పూర్వజన్మలో ఎవడికి ఎటువంటి శ్రద్ధ ఉంటుందో, వర్తమానపు జన్మలో అటువంటి శ్రద్ధనే గ్రహిస్తున్నాడు.

4. యజంతే సాత్త్వికా దేవాన్ యక్షరక్షాంసి రాజసాః।
ప్రేతాన్ భూతగణాంశ్చాన్యే యజంతే తామసా జనాః।।

సాత్త్వికులు దేవతలను, రాజసికులు యక్షరాక్షసులను, తామసికులు భూతప్రేతములను పూజిస్తున్నారు. వారు పూజ చేయు స్వభావమునననుసరించి, వారి సంస్కారము తెలుసుకోవాలి.

5. అశాస్త్రవిహితం ఘోరం తప్యంతే యే తపో జనాః।
దంభాహంకార సంయుక్తాః కామరాగబలాన్వితాః।।

6. కర్శయంత శ్శరీరస్థం భూతగ్రామమచేతసః।
మాం చైవాంతశ్శరీరస్థం తాన్విద్ధ్యాసురనిశ్చయాన్।।

శాస్త్రనిషిద్ధములైన దంభ, అహంకారముతో కూడినవారు, కామ, రాగములతో కూడిన అవివేకులు, దేహములోని పంచభూతములను, అంతర్యామిగా ఉన్న నన్ను, వ్యర్థములైన ఉపవాసాదుల చేత కష్టపెడుతూ తనకు, ఇతరులకు పీడను కలిగించు, తపస్సును చేస్తూ ఉంటారు. అట్టి వారు ఆసుర స్వభావులు.

7. ఆహారస్త్వపి సర్వస్య త్రివిధో భవతి ప్రియః।
యజ్ఞస్తపస్తథా దానం తేషాం భేదమిమం శృణు।।

ఆహారము, యజ్ఞము, తపస్సు, దానము అను గుణములు కూడా వారు అనుసరించు త్రిగుణములకు అనుకూలముగా ఉంటాయి. ఆహారాది నియమములు కూడా వారి గుణభేదమును అనుసరించి ఉంటాయి.

8. ఆయుస్సత్త్వబలారోగ్య సుఖప్రీతి వివర్ధనాః।
రస్యాస్స్నిగ్ధాస్స్థిరా హృద్యాః ఆహారాస్సాత్త్వికప్రియాః।।

ఆయువును, ఉత్సాహమును, బలమును, ఆరోగ్యమును, సుఖమును, చిత్త ప్రసాదమును, సంతోషమును వృద్ధి చేసేవి, రసవంతములైనవి అనగా మంచి రుచి కలిగినవి, ఆవు నేతితో చేసినవి, చెడిపోకుండా ఉండునవి, మనోహరముగా ఉన్న భక్ష్యభోజ్యములు సాత్త్వికులకు ఇష్టమైనవి.

9. కట్వామ్లలవణాత్యుష్ణ తీక్ష్ణరూక్షవిదాహినః।
ఆహారా రాజసస్యేష్టాః దుఃఖశోకామయప్రదాః।।

మిక్కిలి చేదు కలవి, పులుపు, ఉప్పు, వేడి, కారము ఎక్కువగా కలవి, ఎండిపోయినవి, మంటలు కలిగించేవి, దాహమును కలిగించేవి రాజసాహారములు. ఇవి రోగములకు, శోకదుఃఖములకు కారణమవుతున్నాయి.

10. యాతయామం గతరసం పూతి పర్యుషితం చ యత్।
ఉచ్ఛిష్టమపి చామేధ్యం భోజనం తామసప్రియమ్।।

ఒక జాము క్రితము వండినవి రసము ఎండిపోయి, పిప్పిగా మారినవి, పాచిపోయి, దుర్గంధము వెదజల్లునవి, నిన్నటి రోజున వండబడుటచే చద్దిగా మారినవి, ఇతరులు తినగా మిగిలినవి అపవిత్రమైన ఆహారాదులు తామసులకు ఇష్టమైనవి.

11. అఫలాకాంక్షిభిర్యజ్ఞః విధిదృష్టో య ఇజ్యతే।
యష్టవ్యమేవేతి మనః సమాధాయ స సాత్త్వికః।।

శాస్త్రమును అనుసరించి, ఫలకాంక్ష లేని పురుషులు చేయు యజ్ఞమునకు సాత్త్విక యజ్ఞమని పేరు.

12. అభిసంధాయ తు ఫలం దంభార్థమపి చైవ యత్।
ఇజ్యతే భరతశ్రేష్ఠ! తం యజ్ఞం విద్ధి రాజసమ్।।

అర్జునా! ఫలాపేక్షతో సమాజమునందలి గౌరవ మర్యాదలను కోరుతూ దాంభికముగా చేయు యజ్ఞములకు రాజసము అని పేరు.

**13. విధిహీనమసృష్టాన్నం మంత్రహీనమదక్షిణమ్।**
**శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే॥**

శాస్త్రవిధి, అన్నదానము, మంత్రము, దక్షిణ, శ్రద్ధ, లేని యజ్ఞమును తామస యజ్ఞము అన్నారు.

**14. దేవద్విజగురుప్రాజ్ఞ పూజనం శౌచమార్జవమ్।**
**బ్రహ్మచర్య మహింసా చ శారీరం తప ఉచ్యతే॥**

దేవతలను, బ్రాహ్మణులను, గురువులను, పెద్దలను పూజించుట, శౌచము, మృదుత్వము, బ్రహ్మచర్యము, అహింస అనునవి శరీరముతో చేయు తపస్సు అని చెపుతారు.

**15. అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్।**
**స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే॥**

ఇతరులకు భయాన్ని, కష్టాన్నీ కలిగించనది, వినుటకు ఇంపుగా ఉన్నది, సుఖమును చేకూర్చునది, సత్యమైన ప్రియమైన మాటను కలిగినది. వేదాభ్యాసము కలదానిని వాచిక తపస్సు అన్నారు.

**16. మనఃప్రసాద స్సౌమ్యత్వం మౌనమాత్మవినిగ్రహః।**
**భావసంశుద్ధిరిత్యేతత్ తపో మానస ముచ్యతే॥**

నిశ్చలమైన మనస్సు, మృదుత్వము, మౌనము, అంతఃకరణశుద్ధి కలిగి ఉండుట, మనస్సుతో చేయు తపస్సు.



**17. శ్రద్ధయా పరయా తప్తం తపస్తత్త్రివిధం నరైః।**
**అఫలాకాంక్షిభిర్యుక్తైః సాత్త్వికం పరిచక్షతే॥**

ఫలాపేక్ష లేకుండగా, నిశ్చలమైన మనస్సుతో శ్రద్ధాసక్తుడై చేయు ఈ మూడు రకములైన తపస్సును సాత్త్వికము అంటారు.

**18. సత్కారమానపూజార్థం తపో దంభేన చైవ యత్।**
**క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చలమధ్రువమ్॥**

ఇతరుల నుండి గౌరవ మర్యాదలను ఆశించుచూ, ఆడంబరములతో ఇతరుల ప్రశంసలను పొందు, ధనమును సంపాదించుకొనుటకు యోగ్యమైన తపస్సును రాజసికము అంటారు. ఇది అనిత్యము, క్షణికము.

**19. మూఢగ్రాహేణాత్మనో యత్ పీడయా క్రియతే తపః।**
**పరస్యోత్సాదనార్థం వా తత్తామస ముదాహృతమ్॥**

ఇతరులకు హాని కలిగించేది, దురుద్దేశ్యముతో దేహేంద్రియాలను కష్టపెడుతూ, తన తానే హింసించుకొంటూ, మూర్ఖపు పట్టుదలతో చేయు తపస్సును తామసికము అంటారు.

**20. దాతవ్యమితి యద్దానం దీయతేऽనుపకారిణే।**
**దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్॥**

దానము చేయుట మన కర్తవ్యము అను భావనతో ప్రత్యుపకారమును ఆశించకుండా కురుక్షేత్రాది పుణ్యప్రదేశాలలో గ్రహణాది పుణ్యకాలములలో, విద్యా తపస్సంపన్నుడైన బ్రాహ్మణులకు చేయబడిన దానాన్ని సాత్త్వికము అంటారు.

**21. యత్తు ప్రత్యుపకారార్థం ఫలముద్దిశ్య వా పునః।**
**దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్॥**

ప్రత్యుపకారమును ఆశించి, ఆముష్మిక ఫలాన్ని అభిలషించి, ఇష్టము లేకపోయినా కష్టపడుతూ ఇచ్చు దానాన్ని రాజసికము అంటారు.

**22. అదేశకాలే యద్దానం అపాత్రేభ్యశ్చ దీయతే।**
**అసత్కృతమవజ్ఞాతం తత్తామస ముదాహృతమ్॥**

దేశ, కాల పాత్రలను గుర్తించకుండగా, అపవిత్ర ప్రదేశాలలో విట నటాదులకు గానీ, అయోగ్యులకు గానీ, ఇచ్చు దానమును తామసికము అంటారు.

**23. ఓం తత్సదితి నిర్దేశః బ్రహ్మణస్త్రివిధ స్స్మృతః।**
**బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా॥**

'ఓం తత్ సత్' అను మూడు పదములు బ్రహ్మజ్ఞానమునకు సంకేతములుగా నిర్దేశించబడ్డాయి. ఆ సంకేతముల వలననే వేదములు, యజ్ఞములు, బ్రాహ్మణులు కల్పించబడ్డాయి.

**24. తస్మాదోమిత్యుదాహృత్య యజ్ఞ దానతపఃక్రియాః।**
**ప్రవర్తంతే విధానోక్తాః సతతం బ్రహ్మవాదినామ్॥**

అందుచేత బ్రహ్మజ్ఞుల యాగ, దాన, తపో కర్మలన్నీ, ఓంకారముతో ప్రారంభమవుతాయి. కావున అవి సాత్త్వికములు.

**25. తదిత్యనభిసంధాయ ఫలం యజ్ఞతపఃక్రియాః।**
**దానక్రియాశ్చ వివిధాః క్రియంతే మోక్షకాంక్షిభిః॥**

'తత్' అనే బ్రహ్మవాచకమును పలుకుతూ నిష్కాములైన ముముక్షువులు యజ్ఞములను, దానములను, తపస్సులను చేస్తున్నారు. కనుక ఇవి కూడా సాత్త్వికములే.

**26. సద్భావే సాధుభావే చ సదిత్యేతత్ప్రయుజ్యతే।**
**ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్దః పార్థ! యుజ్యతే॥**

పార్థా! బ్రహ్మముయొక్క అస్తిత్వమును, శ్రేష్ఠత్వమును సూచించుటకు సత్ అను పదము వాడబడుతోంది. శుభకర్మలకు కూడా దీనినే వాడుతున్నారు. ఇట్టి సత్పదముతో చేయు యజ్ఞములు సాత్త్వికములు.

**27. యజ్ఞే తపసి దానే చ స్థితి స్సదితి చోచ్యతే।**
**కర్మ చైవ తదర్థీయం సదిత్యేవాభిధీయతే॥**

యజ్ఞము, తపస్సు, దానము ఈ మూడింటికీ సత్ శబ్దముతో ఈశ్వర ప్రీతి కొరకై కర్మలు చేయబడుచున్నాయి. ఈ కర్మలన్నీ ఓం, తత్, సత్ అను బ్రహ్మవాక్యముతో పరమపవిత్రములు అవుతున్నాయి.

**28. అశ్రద్ధయా హుతం దత్తం తపస్తప్తం కృతం చ యత్।**
**అసదిత్యుచ్యతే పార్థ! న చ తత్ప్రేత్య నో ఇహ॥**

పార్థా! శ్రద్ధ లేకుండగా చేసిన హోమము, దానము, తపస్సు, ఇతర కర్మలు అన్నీ అసత్తుగా నిరూపించబడ్డాయి. వాటివలన ఇహలోకము నందు ప్రయోజనము లేదు. పరలోకము నందు ప్రయోజనము లేదు. కొద్దిగా తావన్మాత్ర ఫలమును మాత్రమే ప్రసాదిస్తాయి.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు, బ్రహ్మవిద్యాయాం, యోగశాస్త్రే,
శ్రీకృష్ణార్జున సంవాదే, శ్రద్ధాత్రయ విభాగయోగోనామ
సప్తదశోఽధ్యాయః

## అథ అష్టాదశోఽధ్యాయః
## మోక్షసన్న్యాస యోగః

అర్జున ఉవాచ:

1. సన్న్యాసస్య మహాబాహో! తత్త్వమిచ్ఛామి వేదితుమ్।
త్యాగస్య చ హృషీకేశ! పృథక్కేశినిషూదన!॥

అర్జునుడు పలికాడు- కృష్ణా! సన్న్యాసమంటే ఏమిటి? త్యాగమంటే ఏమిటి? వాటి స్వరూపములేమిటి? వివరముగా చెప్పు? అన్నాడు.

శ్రీ భగవానువాచ:

2. కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయో విదుః।
సర్వకర్మఫలత్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః॥

భగవంతుడు చెప్పాడు- స్వర్గాది ఫలములను ఇచ్చు కామ్యకర్మలను, విడిచిపెట్టుటయే సన్న్యాసమని పండితులన్నారు.

3. త్యాజ్యం దోషవదిత్యేకే కర్మ ప్రాహుర్మనీషిణః।
యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యమితి చాపరే॥

కర్మలన్నీ బంధములను కలిగిస్తాయి కనుక, వాటిని వదిలివేయడమే మంచిదని సాంఖ్యులు అన్నారు. కానీ యజ్ఞ, దాన, తపోరూపమైన కర్మలను విడిచిపెట్టకూడదని మీమాంసకులు అన్నారు.

4. నిశ్చయం శృణు మే తత్ర త్యాగే భరతసత్తమ!।
త్యాగో హి పురుషవ్యాఘ్ర! త్రివిధ స్సంప్రకీర్తితః॥

అర్జునా! త్రివిధములైన ఈ త్యాగముల విషయములో నాయొక్క అభిప్రాయము చెపుతాను, విను.

5. యజ్ఞదానతపః కర్మ న త్యాజ్యం కార్యమేవ తత్।
యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్॥

యాగము, దానము, తపస్సు అను మూడు కర్మలను ఎన్నడూ విడిచిపెట్టకూడదు. అవి చిత్తశుద్ధిని కలిగిస్తాయి.

6. ఏతాన్యపి తు కర్మాణి సంగం త్యక్త్వా ఫలాని చ।
కర్తవ్యానీతి మే పార్థ! నిశ్చితం మతముత్తమమ్॥

యజ్ఞ యాగాది కర్మలను కూడా కర్తృత్వ మమకారమును, ఫలాపేక్షను విడిచిపెట్టి చేయాలని నాయొక్క అభిప్రాయము.

7. నియతస్య తు సన్న్యాసః కర్మణో నోపపద్యతే।
మోహాత్తస్య పరిత్యాగః తామసః పరికీర్తితః॥

విద్యుక్త కర్మలను విడిచిపెట్టుట న్యాయం కాదు. మూర్ఖత్వంతో త్యాగం చెయ్యటం తామస పరిత్యాగము అవుతుంది.

8. దుఃఖమిత్యేవ యత్కర్మ కాయక్లేశభయాత్ త్యజేత్।
స కృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్॥

శరీర కష్టానికి భయపడి, కర్మలను మానివేయుట, రాజస త్యాగము. దీనివలన ఫలితము శూన్యము.

9. కార్యమిత్యేవ యత్కర్మ నియతం క్రియతేఽర్జున!
సంగం త్యక్త్వా ఫలం చైవ స త్యాగ స్సాత్త్వికో మతః॥

అర్జునా! శాస్త్రమున చెప్పిన కర్మలను చేయుచూ, ఆసక్తిని, కర్మఫలమును విడిచిపెట్టినట్లైతే, అది సాత్త్వికత్యాగము అవుతుంది.

**10.** **న ద్వేష్ట్యకుశలం కర్మ కుశలే నానుషజ్జతే।**
**త్యాగీ సత్త్వసమావిష్టః మేధావీ ఛిన్నసంశయః॥**

ఆసక్తిని, ఫలమును విడిచిపెట్టి చేసిన కర్మలు సత్త్వగుణమును పెంచుతాయి. ఆత్మజ్ఞానమును అందిస్తాయి. సందేహములను నివృత్తి చేస్తాయి. దుఃఖములను పోగొడతాయి. సుఖములను ఇస్తాయి.

కామ్యకర్మలను, సంసారకారణములను ఇతడు ద్వేషించడు. మోక్షకారములైన నిత్యకర్మలపై ప్రేమను చూపిస్తాడు. సత్త్వగుణ సంయుక్తుడై ఆత్మజ్ఞానము కలవాడైన సాధకుడు చేయు కర్మలు సాత్త్వికములు.

**11.** **న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్యశేషతః।**
**యస్తు కర్మఫలత్యాగీ స త్యాగీత్యభిధీయతే॥**

దేహధారులకు కర్మలను విడిచిపెట్టుట సాధ్యము కాదు. అందువలన కర్మ ఫలమును విడిచిపెట్టినవాడే త్యాగి.

**12.** **అనిష్టమిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలమ్।**
**భవత్యత్యాగినాం ప్రేత్య న తు సన్న్యాసినాం క్వచిత్॥**

ఇష్టములు, అనిష్టములు మిశ్రమములు అని కర్మలు మూడు విధములు. కోరిక కలవారికి ఆ ఫలములు పరలోకంలో అబ్బుతాయి. కర్మఫలత్యాగులకు ఆ కర్మలు ఎప్పుడూ ఫలితము నీయవు.

**13.** **పంచైతాని మహాబాహో! కారణాని నిబోధ మే।**
**సాంఖ్యే కృతాంతే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్॥**

**14.** **అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్।**
**వివిధాశ్చ పృథక్ చేష్టాః దైవం చైవాత్ర పంచమమ్॥**

ఓ మహాబాహూ! సర్వకర్మలసిద్ధికి చెప్పబోయే ఈ ఐదూ కారణములుగ తెలుసుకో. సాంఖ్య కృతాంతంలో చెప్పబడ్డాయి. వాటిని చెపుతాను. నువ్వు తెలుసుకో. అధిష్ఠానమైన శరీరము మరియు కర్త, ఇంద్రియములు అనేక విధాల చేష్టలు మరియు దైవము - అనేవే ఆ ఐదు.

**15.** **శరీరవాఙ్మనోభిర్యత్ కర్మ ప్రారభతే నరః।**
**న్యాయ్యం వా విపరీతం వా పంచైతే తస్య హేతవః॥**

మనస్సు, వాక్కు, శరీరము అను మూడు కరణములతో చేయు ప్రతి ఉచ్చనీచ కర్మలకన్నింటికీ ఈ ఐదే కారణము.

**16.** **తత్రైవం సతి కర్తారం ఆత్మానం కేవలం తు యః।**
**పశ్యత్యకృత బుద్ధిత్వాత్ న స పశ్యతి దుర్మతిః॥**

ఈవిధముగా ఈ ఐదు ఆయా కర్మలకు కర్తృత్వమును వహించుచుండగా, బుద్ధి పరిపాకము చెందనివాడు అనగా దుర్మతి ఇది అంతయూ తానే చేస్తున్నట్లుగా అహంకారముతో సంచరిస్తాడు.

**17.** **యస్య నాహంకృతో భావః బుద్ధిర్యస్య న లిప్యతే।**
**హత్వాఽపి స ఇమాల్లోకాన్- న హంతి న నిబధ్యతే॥**

ఎవరికైతే ఇది నేను చేస్తున్నాను? అను అభిమానము ఉండదో, ఎవరి బుద్ధి కర్మఫలములయందు ఆసక్తము కాదో, అతడు జగత్తులోని ప్రాణులనందరినీ చంపివేసినప్పటికీ అతనికి హత్యారూపమైన పాపఫలము అంటదు.

**18.** **జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా।**
**కరణం కర్మ కర్తేతి త్రివిధః కర్మసంగ్రహః॥**

జ్ఞానము, జ్ఞేయము, పరిజ్ఞాత అనునవి కర్మలను ప్రోత్సాహపరుచు కారణములు. అదే విధముగా కర్త, కర్మ, సాధనము అనునవి మూడు రకములైన కర్మసంగ్రహములు.

**19.** జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణభేదతః।
ప్రోచ్యతే గుణసంఖ్యానే యథావచ్ఛృణు తాన్యపి॥

జ్ఞానమునే కర్త యని, కర్మయని సాంఖ్యశాస్త్రము మూడు విధములుగా విభజించింది. వాటిని గురించి చెపుతాను విను.

**20.** సర్వభూతేషు యేనైకం భావమవ్యయమీక్షతే।
అవిభక్తం విభక్తేషు తజ్జ్ఞానం విద్ధి సాత్త్వికమ్॥

వేరు వేరు భూతములయందు అవినాశమై, మార్పు లేక, ఒక్కటిగా నున్న ఆత్మను గ్రహించు జ్ఞానమే సాత్త్వికజ్ఞానము.

**21.** పృథక్త్వేన తు యజ్జ్ఞానం నానాభావాన్ పృథగ్విధాన్।
వేత్తి సర్వేషు భూతేషు తజ్జ్ఞానం విద్ధి రాజసమ్॥

విడివిడిగా కనిపించుచున్న అన్ని జీవులలోని ఆత్మలు, వివిధరకములుగా ఉన్నాయని అనుకోవటం రాజస జ్ఞానము.

**22.** యత్తు కృత్స్నవదేకస్మిన్ కార్యే సక్తమహైతుకమ్।
అతత్త్వార్థవదల్పం చ తత్తామసముదాహృతమ్॥

ఒక దేహాన్ని కానీ, ఒక వస్తువును కానీ చూచి, అదే సర్వస్వము అనుకొనుట తామస జ్ఞానము.

**23.** నియతం సంగరహితం అరాగద్వేషతః కృతమ్।
అఫలప్రేప్సునా కర్మ యత్తత్ సాత్త్వికముచ్యతే॥

ఫలాపేక్షను విడిచిపెట్టి, అభిమానము, రాగము, ద్వేషము లేనివాడై చేయు కర్మలు సాత్వికమైనవి.

**24.** యత్తు కామేప్సునా కర్మ సాహంకారేణ వా పునః।
క్రియతే బహులాయాసం తద్రాజస ముదాహృతమ్॥

కర్మఫలాసక్తితో అహంకార అభిమానములతో మిక్కిలి కష్టసాధ్యమైన కర్మలు రాజస కర్మలు.

**25.** అనుబంధం క్షయం హింసాం అనపేక్ష్య చ పౌరుషమ్।
మోహాదారభ్యతే కర్మ యత్తత్తామస ముచ్యతే॥

మంచి చెడ్డలను కర్మనిష్ఠూరములను గమనించకుండగా మోహపరవశుడై మూర్ఖముగా చేయు పని తామసకర్మ.

**26.** ముక్తసంగోఽనహంవాదీ ధృత్యుత్సాహ సమన్వితః।
సిద్ధ్యసిద్ధ్యో ర్నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే॥

ఫలాపేక్ష వదిలి, నిరహంకారియై ఫలితములోని మంచి చెడ్డలకు వికారమును చెందక, ధైర్య ఉత్సాహ విశ్వాసములతో కర్మలు చేయువాడు సాత్త్విక కర్త.

**27.** రాగీ కర్మఫలప్రేప్సుః లుబ్ధో హింసాత్మకోఽశుచిః।
హర్షశోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః॥

కర్మఫలాపేక్షతో అభిమానముతో, లోభగుణముతో హింసాపరుడై అశుచిగా సర్వసుఖమునకు, ద్వంద్వములకు చలించుచూ కర్మలను చేయువాడు రాజసకర్త.

**28.** అయుక్తః ప్రాకృతస్స్తబ్ధః శఠో నైష్కృతికోఽలసః।
విషాదీ దీర్ఘసూత్రీ చ కర్తా తామస ఉచ్యతే॥

స్థైర్యమును పోగొట్టుకొని మూర్ఖత్వపు అభిమానములను పెంచుకొనుచూ మోసకారియై, దీనచిత్తము కలవాడై వ్యర్థముగా కాలమును గడుపుచూ కర్మలు చేయువాడు తామసకర్త.

**29.** బుద్ధేర్భేదం ధృతేశ్చైవ గుణతస్త్రివిధం శృణు।
ప్రోచ్యమానమశేషేణ పృథక్త్వేన ధనంజయ!॥

అర్జునా! బుద్ధి, ధృతి అను రెండు గుణభేదములచేత ఇవి తిరిగి మూడు విధములుగా ఉన్నాయి.

**30.** ప్రవృత్తిం చ నివృత్తిం చ కార్యాకార్యే భయాభయే।
బంధం మోక్షం చ యా వేత్తి బుద్ధి స్సా పార్థ! సాత్త్వికీ॥

ధర్మాధర్మములయందు ప్రవృత్తి నివృత్తులను, కర్తవ్యాకర్తవ్యములను భయాభయములను, బంధన మోక్షములను స్పష్టంగా తెలుసుకొను బుద్ధి సాత్విక బుద్ధి.

**31.** యయా ధర్మమధర్మం చ కార్యం చాకార్యమేవ చ।
అయథావత్ప్రజానాతి బుద్ధి స్సా పార్థ! రాజసీ॥

ధర్మాధర్మములయొక్క, కార్యాకార్యములయొక్క యథార్థ జ్ఞానమును పొందక పొరపాటుగా గ్రహించు బుద్ధికి రాజసబుద్ధి అని పేరు.

**32.** అధర్మం ధర్మమితి యా మన్యతే తమసాఽఽవృతా।
సర్వార్థాన్ విపరీతాంశ్చ బుద్ధి స్సా పార్థ! తామసీ॥

అధర్మమును ధర్మము గానూ, అన్ని విషయములను అపసవ్యము గానూ గ్రహించు బుద్ధికి తామసబుద్ధి అని పేరు.

**33.** ధృత్యా యయా ధారయతే మనఃప్రాణేంద్రియక్రియాః।
యోగేనావ్యభిచారిణ్యా ధృతి స్సా పార్థ! సాత్త్వికీ॥

మనస్సును, ప్రాణమును, ఇంద్రియములయొక్క వృత్తులను నిగ్రహించి చెదిరిపోకుండగా, నిలిపిన పట్టుదలకు సాత్త్వికధృతి అని పేరు.

**34.** యయా తు ధర్మకామార్థాన్ ధృత్యా ధారయతేఽర్జున!॥
ప్రసంగేన ఫలాకాంక్షీ ధృతి స్సా పార్థ! రాజసీ॥

కర్మ ఫలాసక్తి యందు, ధర్మార్థ కామములయందు చూపబడిన అధికమైన పట్టుదలకే రాజస ధృతి అని పేరు.

**35.** యయా స్వప్నం భయం శోకం విషాదం మద మేవ చ।
న విముంచతి దుర్మేధాః ధృతి స్సా తామసీ మతా!॥

స్వప్నము, భయము, శోకము, విషాదము, గర్వము అనే వాటికి వశుడవుతూ మూర్ఖపు పట్టుదలను వీడని ధృతికి తామస ధృతి అని పేరు.

**36.** సుఖం త్విదానీం త్రివిధం శృణు మే భరతర్షభ!॥
అభ్యాసాద్రమతే యత్ర దుఃఖాంతం చ నిగచ్ఛతి॥

**37.** యత్తదగ్రే విషమివ పరిణామేఽమృతోపమమ్।
తత్సుఖం సాత్త్వికం ప్రోక్తం ఆత్మబుద్ధిప్రసాదజమ్॥

అర్జునా! ఇకపై మూడురకముల సుఖముల గురించి చెపుతాను. ప్రారంభ దశలో విషముగా, దుఃఖకరముగా, కనిపించి అభ్యాసము చేసిన కొలదీ, సుఖముగా, సులువుగా నున్నది, అన్ని కష్టములను పోగొట్టి చివరకు అంతులేని ఆనందమును ఇచ్చు అమృతమయమైన బుద్ధితో జనించు సుఖమునకు సాత్త్విక సుఖము అని పేరు.

**38.** విషయేంద్రియ సంయోగాత్ యత్తదగ్రేఽమృతోపమమ్।
పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్॥

ఇంద్రియ సంయోగము వలన పుట్టి, ప్రారంభదశలో అమృతము వలె ఉండి, చివరకు విషముగా పరిణమించు సుఖము రాజస సుఖమని పేరు.

**39.** యదగ్రే చానుబంధే చ సుఖం మోహనమాత్మనః।
నిద్రాలస్యప్రమాదోత్థం తత్తామసముదాహృతమ్॥

ఆద్యంతములలో మోహము కలిగించుచూ, నిద్రా అలసత్వ ప్రమాదములతో కూడిన సుఖమునకు తామస సుఖము అని పేరు.

**40.** న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః।
సత్త్వం ప్రకృతిజైర్ముక్తం యదేభి స్స్యాత్ త్రిభిర్గుణైః॥

ప్రకృతి వలన పుట్టిన ఈ సత్త్వరజస్తమోగుణముల మూడింటికీ చెందనిది ఏదీ కూడా భూలోకములోనూ, స్వర్గాది లోకములోనూ, చివరకు దేవతలలో కూడా ఎక్కడా కనిపించదు.

**41.** బ్రాహ్మణ క్షత్రియవిశాం శూద్రాణాం చ పరంతప!।
కర్మాణి ప్రవిభక్తాని స్వభావ ప్రభవైర్గుణైః॥

స్వభావసిద్ధమైన గుణములను అనుసరించి, బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు కర్మలు వేరు వేరుగా విభజింపబడ్డాయి.

**42.** శమో దమస్తప శ్శౌచం క్షాన్తిరార్జవమేవ చ।
జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం బ్రహ్మకర్మ స్వభావజమ్॥

బాహ్యాంతర ఇంద్రియ నిగ్రహము, తపస్సు, శౌచము, క్షమ, ఋజు స్వభావము, శాస్త్రజ్ఞానము, అనుభవ జ్ఞానము, ఆస్తిక్యము మొదలైన సత్సంపత్తులు స్వభావ సిద్ధముగా బ్రాహ్మణునకు సంక్రమించిన కర్మలు.

**43.** శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యం యుద్ధే చాప్యపలాయనమ్।
దానమీశ్వరభావశ్చ క్షాత్రం కర్మ స్వభావజమ్॥

శౌర్యము, తేజస్సు, ధైర్యము, యుద్ధము నందు పిరికితనము లేకపోవుట, ధర్మపూర్వకమైన దానము, ప్రభు మంత్ర ఉత్సాహ శక్తులు, క్షత్రియులకు సహజకర్మలు.

**44.** కృషిగౌరక్ష్య వాణిజ్యం వైశ్యకర్మ స్వభావజమ్
పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్॥

వ్యవసాయము, గోరక్షణ, వ్యాపారము, వైశ్యులకు సహజకర్మలు. సేవా వృత్తి శూద్రులకు సహజకర్మలు.

**45.** స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః।
స్వకర్మనిరత స్సిద్ధిం యథా విందతి తచ్ఛృణు॥

తన స్వాభావిక కర్మల వలన శ్రద్ధాసక్తులు కలిగి ప్రవర్తించు మానవుడు, జ్ఞానయోగ్యతారూపసిద్ధిని పొందుతాడు.

**46.** యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్।
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః॥

అన్ని ప్రాణుల వృత్పత్తి, వ్యాపారములు ఎవరివలన కలుగుచున్నవో, ఎవడు ప్రపంచమంతా నిండి ఉన్నాడో, ఆ పరమాత్మను తనకు విధించబడిన కర్మల ద్వారా ఆరాధన చేయువాడు చిత్తశుద్ధిని పొందుతాడు.

**47.** శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్।
స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్॥

ఉత్తమ నియమనిష్ఠలతో చేయు పరధర్మానుష్ఠానం కంటే దోషముతో కూడి ఉన్నప్పటికీ, తన ధర్మమును ఆచరించుటయే శ్రేయస్కరము.

**48.** సహజం కర్మ కౌంతేయ! సదోషమపి న త్యజేత్।
సర్వారంభా హి దోషేణ ధూమేనాగ్నిరివావృతాః॥

అర్జునా! సహజధర్మము దోషముతో ఉన్నప్పటికీ విడిచిపెట్టకూడదు. అగ్ని పొగతో ఉన్నట్లుగా అన్ని కర్మలూ ఏదో ఒక దోషముతో కూడి ఉంటాయి.

**49.** అసక్తబుద్ధి స్సర్వత్ర జితాత్మా విగతస్పృహః।
నైష్కర్మ్యసిద్ధిం పరమాం సన్న్యాసేనాధిగచ్ఛతి॥

విషయాసక్తి లేనివాడు, అంతఃకరణను జయించినవాడు, కోరికలు లేనివాడు, స్పృహ లేనివాడు, జ్ఞానమార్గము ద్వారా నైష్కర్మ్యసిద్ధిని పొందుతాడు.

**50.** సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ తథాఽఽప్నోతి నిబోధ మే।
సమాసేనైవ కౌంతేయ! నిష్ఠా జ్ఞానస్య యా పరా॥

అర్జునా! నిష్కామ కర్మానుష్ఠానం వలన జ్ఞానసిద్ధిని పొందినవాడు, ఏ విధముగా పరమాత్మను పొందుతాడో చెపుతాను విను.

**51.** బుద్ధ్యా విశుద్ధయా యుక్తః ధృత్యాఽఽత్మానం నియమ్యచ।
శబ్దాదీన్ విషయాంస్త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ॥

**52.** వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయ మానసః।
ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః॥

**53.** అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్।
విముచ్య నిర్మమ శ్శాంతః బ్రహ్మభూయాయ కల్పతే॥

మాయారహితమైన నిశ్చలమైన జ్ఞానంతో మనస్సును నిగ్రహపరిచి, శబ్దాది విషయములను విడిచిపెట్టి, రాగద్వేషములు లేనివాడై, నిత్యము విరాగియై, ఏకాంత జీవనము చేస్తూ, అల్పాహారియై, మనోవాక్కాయములను నియమబద్ధము చేసి, ధ్యానయోగియై అహంకార, అభిమాన, దంభ, కామ, క్రోధములను విడిచిపెట్టి బాహ్యాభ్యంతర విషయవాంఛలను విడిచి, మమకారము లేనివాడై, ప్రశాంత చిత్తము కలిగినవాడు మాత్రమే బ్రహ్మభావమునకు అర్హుడు.

**54.** బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి।
సమ స్సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్॥

బ్రహ్మభావమును పొందినవాడు మరల మరొకదానిని కోరడు. దేని కొరకు ఇష్టపడడు. దుఃఖపడడు. అన్ని భూతములయందు సమదృష్టి కలిగి ఉంటాడు. ఇట్టి జ్ఞానయోగఫలము వలన నాయందు భక్తిని పొందుతాడు.

**55.** భక్త్యా మామభిజానాతి యావాన్యశ్చాస్మి తత్త్వతః।
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనంతరమ్॥

అటువంటి భక్తిని పొందినవాడు, నాయొక్క స్వరూప స్వభావాదులను పూర్తిగా గ్రహిస్తాడు. చివరకు అట్టి నిశ్చలమైన భక్తి తత్త్వము తోడనే నాలో ఐక్యమైపోతాడు.

**56.** సర్వకర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః।
మత్ప్రసాదాదవాప్నోతి శాశ్వతం పదమవ్యయమ్॥

అన్ని కర్మలను, ఆచరిస్తున్నప్పటికీ నన్నే నమ్ముకొని ఉన్న కర్మయోగి, నాశనము లేని ఇట్టి పరమపదమునే పొందుతాడు.

**57.** చేతసా సర్వకర్మాణి మయి సన్న్యస్య మత్పరః।
బుద్ధియోగముపాశ్రిత్య మచ్చిత్త స్సతతం భవ॥

సర్వకర్మఫలములు నాకే అర్పించి, సమబుద్ధి రూపమైన యోగమును అవలంబించు. నేనే పరమగతిని అని తెలుసుకో. నీ అంతఃకరణమును నాయందు లగ్నం చెయ్యి.

**58.** మచ్చిత్త స్సర్వదుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసి।
అథ చేత్త్వమహంకారాత్ న శ్రోష్యసి వినంక్ష్యసి॥

నన్ను శరణుజొచ్చినట్లైతే నా అనుగ్రహమువలన దాటరాని సంసార దుఃఖములన్నింటినీ దాటి, తరిస్తావు. కాదని అహంకరించితే నాశనమైపోతావు.

**59.** యదహంకార మాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే।
మిథ్యైష వ్యవసాయస్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి।।

దురహంకార బుద్ధితో యుద్ధము మానివేయవలెనని తలిచినప్పటికీ నీ నిశ్చయము వ్యర్థము అవుతుంది. నీయొక్క క్షత్రియధర్మమే నిన్ను యుద్ధానికి నియోగించి తీరుతుంది.

**60.** స్వభావజేన కౌంతేయ! నిబద్ధ స్స్వేన కర్మణా।
కర్తుం నేచ్ఛసి యన్మోహాత్ కరిష్యస్యవశోఽపి తత్।।

అర్జునా! ప్రకృతి జనితమైన ఏ భ్రాంతికి లోనై యుద్ధము చెయ్యనని చెపితివో, సహజ ధర్మ మైన క్షాత్రస్వభావమునకు లోనై నీ నిశ్చయములోని తప్పును తెలుసుకొని నీవు యుద్ధమును చేసి తీరుతావు.

**61.** ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేఽర్జున! తిష్ఠతి!।
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా।।

అర్జునా! సర్వభూతములను నాయొక్క మాయచే కీలుబొమ్మలవలె ఆడించుచున్న ఈశ్వరుడు, అన్ని భూతములయొక్క హృదయాంతరాళముల యందు ఉన్నాడు.

**62.** తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత!।
తత్ప్రసాదాత్ పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్।।

సర్వవిధముల ఆ పరమాత్మను శరణువేడు. వాని దయచే శాంతిని, మోక్షమును పొందగలవు.

**63.** ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యాతరం మయా।
విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథా కురు।।

అతి రహస్యమైన ఇంతటి గొప్ప జ్ఞానమును నీకు చెప్పాను. బాగా ఆలోచించి నీ ఇష్టం వచ్చినట్టు చెయ్యి.

**64.** సర్వగుహ్యాతమం భూయః శృణు మే పరమం వచః।
ఇష్టోఽసి మే దృఢమితి తతో వక్ష్యామి తే హితమ్।।

నీవు నాకు మిక్కిలి ఆప్తుడవు కాబట్టి, నీ శ్రేయస్సును కోరి, మరొక్కమారు చెపుతాను. విను.

**65.** మన్మనా భవ మద్భక్తః మద్యాజీ మాం నమస్కురు।
మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే।।

నా యందే నిశ్చలమైన మనస్సు పెట్టుకో. నన్నే భక్తితో సేవించు. నన్నే పూజించు. నాకే నమస్కారము చెయ్యి. నాకు ఇష్టుడవు కనుక, ప్రతిజ్ఞ చేసి చెపుతున్నాను. నిశ్చయముగా నీవు నన్నే పొందుతావు.

**66.** సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ।
అహం త్వా సర్వపాపేభ్యః మోక్షయిష్యామి మా శుచః।।

అన్ని ధర్మములను విడిచిపెట్టి నన్నే శరణుపొందు. నిన్ను నేను అన్ని పాపముల నుండి రక్షిస్తాను.

**67.** ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన।
న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యోఽభ్యసూయతి।।

తపోరహితులకు, భక్తుడు కానివానికి, శుశ్రూష చెయ్యనివానికి, నన్ను అసూయతో చూచువానికి, ఈ శాస్త్రమును బోధించకూడదు.

**68.** య ఇమం పరమం గుహ్యం మద్భ క్తేష్వభిధాస్యతి।
భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్యత్యసంశయః।।

అతి రహస్యమైన ఈ గీతాశాస్త్రమును నా భక్తులకు అందించువాడు నిశ్చయముగా నా పరమాత్మ భావమును పొందుతాడు.

**69.** న చ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః।
భవితా న చ మే తస్మాత్ అన్యః ప్రియతరో భువి।।

ఈ గీతాశాస్త్ర ప్రచారకుని కంటే నాకు ఏ భక్తుడు ఎక్కువైనవాడు కాదు, ప్రియమైనవాడు కాదు. వాడి కంటే నాకు ఈ లోకంలో మరొకడు లేడు.

**70.** అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాదమావయోః।
జ్ఞానయజ్ఞేన తేనాహం ఇష్ట స్స్యామితి మేమతిః।।

మన సంవాదరూపమైన ఈ గీతను ఎవడు పారాయణ చేస్తాడో వాడి వలన నేను జ్ఞానయజ్ఞముచే ఆరాధించబడినవాడిని అవుతాను.

**71.** శ్రద్ధావాననసూయశ్చ శృణుయాదపి యో నరః।
సోఽపి ముక్త శ్శుభాల్లోకాన్ ప్రాప్నుయాత్ పుణ్యకర్మణామ్।।

శ్రద్ధాసక్తి యుక్తులై, అసూయారహితులై, ఎవరైతే దీనిని వింటారో, వారికి గొప్ప గొప్ప పుణ్యములు చేసినవారికి పొందు ఫలము కూడా లభిస్తుంది. వారు పుణ్యలోకములను అవలీలగా పొందుతారు.

**72.** కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ! త్వయైకాగ్రేణ చేతసా।
కచ్చిదజ్ఞానసమ్మోహః ప్రణష్టస్తే ధనంజయ!।।

అర్జునా! ఇంతవరకూ నేను చెప్పిన విషయములన్నీ మనస్సు లగ్నము చేసి విన్నావు కదా! నీయొక్క అజ్ఞానజనితమైన మోహము నశించిపోయినది కదా!

**అర్జున ఉవాచ:**

**73.** నష్టో మోహ స్స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత!।
స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ।।

అర్జునుడు పలికాడు - శ్రీకృష్ణా! నీ దయ వలన నా అజ్ఞానము తొలగిపోయింది. సందేహము తీరిపోయింది. ఆత్మజ్ఞానము కలిగింది. ఇప్పుడు నువ్వు ఏది చెపితే అది చేయుటకు సిద్ధముగా ఉన్నాను.

**సంజయ ఉవాచ:**

**74.** ఇత్యహం వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః।
సంవాదమిమమశ్రౌషం అద్భుతం రోమహర్షణమ్।।

సంజయుడు చెప్పాడు - ధృతరాష్ట్ర మహారాజా! మహాత్ములైన శ్రీకృష్ణార్జునుల అమృతరూపమైన ఈ సంవాదమును నేను విన్నాను. నా శరీరము పులకరించి పోయింది.

**75.** వ్యాసప్రసాదాచ్ఛ్రుతవాన్ ఇమం గుహ్యతమం పరమ్।
యోగం యోగేశ్వరాత్ కృష్ణాత్ సాక్షాత్ కథయతస్స్వయమ్।।

శ్రీవ్యాసభగవానుని దయవలన యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు స్వయంగా చెప్పిన గీతాయోగశాస్త్రాన్ని ప్రత్యక్షముగా వినే భాగ్యము నాకు కలిగింది.

**76.** రాజన్! సంస్మృత్య సంస్మృత్య సంవాదమిమమద్భుతమ్।
కేశవార్జునయోః పుణ్యం హృష్యామి చ ముహుర్ముహుః।।

మహారాజా! శ్రీకృష్ణార్జునుల పవిత్రమైన సంవాదము జ్ఞాపకమునకు వస్తున్నప్పుడు, మాటిమాటికీ నా మనస్సు ఆనందంతో పొంగిపోతోంది.

**77.** **తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూపమత్యద్భుతం హరేః।**
**విస్మయో మే మహాన్ రాజన్! హృష్యామి చ పునఃపునః॥**

శ్రీకృష్ణుడియొక్క అద్భుతమైన విశ్వరూపాన్ని తలుచుకొంటుంటే నా ఆనందమునకు అవధి లేదు. నేను పరవశించిపోతున్నాను.

**78.** **యత్ర యోగేశ్వరః కృష్ణః యత్ర పార్థో ధనుర్ధరః।**
**తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతిర్మతిర్మమ॥**

యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు, ధనుర్ధారి అయిన అర్జునుడు ఎక్కడైతే ఉంటారో అక్కడే లక్ష్మి, విజయము, ఐశ్వర్యము ఉంటాయని నాయొక్క దృఢమైన నిశ్చయము.

**ఓం తత్సదితి, శ్రీమన్మహాభారతే, శతసాహస్రికాయాం,**
**సంహితాయాం, వైయ్యాసిక్యాం, శ్రీమద్భీష్మపర్వణి,**
**శ్రీమద్భగవద్గీతాసుపనిషత్సు, బ్రహ్మవిద్యాయాం, యోగశాస్త్రే,**
**శ్రీకృష్ణార్జునసంవాదే, మోక్షసన్న్యాసయోగోనామ అష్టాదశోఽధ్యాయః**

**ఈ విధముగా ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రముగా ప్రసిద్ధి**
**గాంచిన శ్రీకృష్ణార్జున సంవాదరూపమైన భగవద్గీతలో మోక్ష**
**సన్న్యాసయోగము అను పదునెనిమిదవ అధ్యాయము సంపూర్ణము.**
శ్రీకృష్ణార్పణమస్తు.

**ఓమ్ తత్ సత్।**

## ఫలశ్రుతి

- శ్రీదత్త విజయానంద తీర్థ స్వామీజీ

శ్రీస్వామీజీవారిని దత్తభక్తుల పిల్లలు ఎంతో ప్రేమగాను, భక్తిగాను, 'తాతాజీ' అని పిలుస్తూ ఉంటారు. తమ తాతాజీకి సంతోషం కలిగే పని చెయ్యాలి అనే ఒక సంకల్పంతో సంపూర్ణ భగవద్గీతను కంఠస్థం చేసి, డల్లాస్ కార్యసిద్ధి ఆంజనేయస్వామి సన్నిధిలో చదివి వినిపించారు. ఆ పిల్లల ప్రేమ భక్తికి మెచ్చి, శ్రీస్వామీజీవారు వారిని సపరివారంగా భగవద్గీతకు జన్మస్థలమైన కురుక్షేత్రానికి తీసుకొని వెళుతూ, వారికి అనుగ్రహ రూపంగా అందించేందుకై భగవద్గీతకు చక్కటి సరళానువాదం చేశారు.

దానిలో రాణీసుబ్బయ్య దీక్షితులుగారు ముద్రణదోషాలు లేకుండా చూసి సేవ చేసుకొన్నారు. అంతటితో ఆగక ఈ పుస్తకానికి ముందు మాట వ్రాసి ఇవ్వాలి అని మా వెంటపడ్డారు. సద్గురువులైన శ్రీస్వామీజీవారే ముందుమాట వ్రాసి అనువదించి, అనుగ్రహించిన గ్రంథానికి ముందు మాట రాయటమనేది సూర్యుడి ముందు మిణుగురు పురుగులాంటిది అని చెప్పాము. అయినా వారు పట్టువదలని విక్రమార్కుడి లాగా మమ్మల్ని పట్టుకొన్నారు.

ఏమి చెయ్యాలా అని ఆలోచిస్తూ ఉండగా, మా నిత్యపారాయణలో పరిమళా పబ్లికేషన్స్ వారి శంకర భాష్యాది ఏకాదశ టీకా సమేతమైన శ్రీమద్భగవద్గీతా గ్రంథంలో వారు ముద్రించిన గీతామాహాత్మ్యం కంటబడింది. అది సద్గురువుల అనుగ్రహమే అని మాకు తోచింది.

గీతాశాస్త్రానికి మోక్షమే పరమప్రయోజనం. అయినా కూడా సాంసారికులైన సామాన్యులు, ధర్మార్థ కామాలనే ఎక్కువగా ఆకాంక్షిస్తారు కనుక వారికి గీతయొక్క పారాయణ, శ్రవణ, పూజనాదుల ద్వారా కలిగే ప్రయోజనాన్ని తెలిపే గీతామాహాత్మ్యాన్ని అనువదించి, అందిస్తే బాగుంటుంది అని తోచింది. ప్రయోజనము, ఫలము లేని పనిని ఎవరూ చెయ్యరు కదా!

ప్రయోజనము, ఫలము తెలిస్తే గీతా పారాయణాన్ని మరింత శ్రద్ధగా చేస్తారు అనే ఒక ఉద్దేశ్యముతో ఈ గీతామాహాత్మ్యము యొక్క అర్థాన్ని మీకు అందించటం జరుగుతోంది. దీనిని దాదాపు ఫలశ్రుతి అని చెప్పవచ్చు.

ఈ గీతా మాహాత్మ్యము పరిమళ పబ్లికేషన్స్ వారికి గుజరాత్ ముద్రణాలయములో హస్తప్రతిగా దొరికింది అని వారే చెప్పుకొన్నారు. ఇందులో మొత్తము 87 శ్లోకాలున్నాయి. కొన్ని శ్లోకాలు వరాహ పురాణంలో ముద్రితంగా కనిపిస్తూ ఉన్నాయి.

ఋషులందరూ ఒక చోట చేరి ఉండగా, ఒక ఋషి సూతమహర్షిని ఇలా అడిగాడు.

1. 'ఓ మహర్షీ! భగవద్గీతయొక్క గొప్పదనాన్ని, దానిని పారాయణ చేస్తేనూ, వింటేనూ కలిగే ఫలాన్ని నాకు పూర్తిగా తెలుపు? గీతామాహాత్మ్యాన్ని పురాణముని అయిన వ్యాసమహర్షి చెప్పి యున్నాడనీ నేను విని ఉన్నాను.'

సూతమహర్షి ఇలా అన్నాడు-

2. 'ఓ మహర్షులారా! మీరు అతి రహస్యమైన, పురాతమైన విషయాన్ని అడిగారు. గొప్పదైన గీతా మాహాత్మ్యాన్ని చెప్పగలిగినవారెవరు?

3. శ్రీకృష్ణుడికి మాత్రమే గీతామాహాత్మ్యము పూర్తిగా తెలుసు. కుంతీపుత్రుడైన పార్థుడు గీతాఫలాన్ని కొద్దిగా తెలుసుకొని ఉన్నాడు. వ్యాసుడు, వ్యాసపుత్రుడైన శుకుడు, యాజ్ఞవల్క్యమహర్షి, మిథిలాధిపతియైన జనకుడు,

4. తక్కినవారు కొందరు మహాత్ములు, గీతను పూర్తిగా విని దాని మాహాత్మ్యాన్ని కొద్దిగానే కీర్తించగలుగుతున్నారు. అందువల్ల నేను కూడా గీతా మాహాత్మ్యాన్ని కొద్దిగానే చెప్పగలను. దీనిని నేను వ్యాసమహర్షి నుండి విని తెలుసుకొన్నాను.

5. ఉపనిషత్తులన్నీ గోవులు. గోపాలనందనుడైన శ్రీకృష్ణపరమాత్మ పాలుపితికే గోపాలకుడు. పార్థుడే దూడ. గీతామృతమే పాలు. మంచిబుద్ధి కలవాడే ఆ పాలను త్రాగే భోక్త.

6. ఆదిలో అర్జునుడికి సారథ్యాన్ని చేస్తూ, గీతామృతాన్ని అనుగ్రహించాడు. ఆ గీతామృతము ముల్లోకాలకు ఉపకారం చేస్తోంది. అటువంటి కృష్ణాత్మకు నమస్కారము.

7. ఘోరమైన సంసార సాగరాన్ని దాటగోరిన జీవుడు, గీత అనే పడవనెక్కి సుఖంగా దాటగలడు.

8. గీతాజ్ఞానాన్ని వినకుండా, తెలుసుకోకుండా, గీతాభ్యాసము చెయ్యకుండా, మోక్షం కావాలి అనుకొనే మూఢుడు, చివరకు పిల్లల అపహాస్యానికి కూడా గురి అవుతాడు. (గీత లేకుండా రాత మారదు.)

9. ఎవరైతే నిరంతరమూ గీతాశాస్త్రాన్ని వింటూ పఠిస్తూ ఉంటారో, వారిని సామాన్యమానవులవలె చూడరాదు. వారు దేవతాస్వరూపులై ఉన్నారు. అందులో సందేహమే లేదు.

10. గీతా జ్ఞానంతో శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి జ్ఞానోదయాన్ని కలిగించి, మోక్షస్థానాన్ని ప్రసాదించాడు.

11. కొన్ని చోట్ల సగుణబ్రహ్మను, మరికొన్ని చోట్ల నిర్గుణ బ్రహ్మను చెపుతూ, 18 అధ్యాయాలను, 18 మెట్లగా చేసుకొన్నవాడు శారీర, మానస, మలాలను పోగొట్టుకొని, నిర్మలుడై పరబ్రహ్మను పొందుతాడు. జలస్నానంతో బైటి మలం మాత్రమే పోతుంది.

12, 13- ఒక్కసారి గీతాజలంలో స్నానం చేస్తే జన్మజన్మల మలము కొట్టుకొని పోతుంది. ఎవరైతే గీతాశాస్త్రాన్ని వినలేదో, ఎవరికైతే గీతాజ్ఞానంలో శ్రద్ధ లేదో, ఎవరైతే గీతాసారాన్ని భావన చేయరో, ఎవరికైతే భగవద్గీతను గురించి బొత్తిగా తెలియదో, ఎవరైతే భగవద్గీతను చదవరో, చదివించరో వారు పశుసమానులు.

14. భగవద్గీతను తెలుసుకోనివారు అధములు. అటువంటి దేహము వ్యర్థము. వారి జ్ఞానము గొప్ప వంశంలో పుట్టామని చెప్పుకోవటం అన్నిటికీ ధిక్కారము.

15. గీతార్థాన్ని తెలుసుకోని అధమజనుల శరీర, శీల, వైభవ, గృహ, ఆశ్రమాలకు ధిక్కారము.

16. గీతాశాస్త్రము తెలియనివాడికన్నా అధముడు మరొకడు ఉండడు. వాడి ప్రగల్భాలు, కీర్తి, వాడందుకొనే గొప్ప పూజలు, గౌరవ మర్యాదలు, అన్నిటికీ ధిక్కారము.

17. గీతాశాస్త్రములో ప్రీతి లేకపోతే అన్నీ నిష్ఫలమే అయిపోతాయి. అటువంటి జ్ఞానము, ఆచారము, వ్రతము, నిష్ఠ తపస్సు, యశస్సు అన్నిటికీ ధిక్కారము.

18. గీతను, గీతార్థాన్ని చదవనివాడికన్నా అల్పుడు మరొకడు ఉండడు. భగవద్గీత లేని జ్ఞానయజ్ఞాన్ని ఆసురబుద్ధి కలవారు మాత్రమే అంగీకరిస్తారు.

19. ధర్మము లేని దానిని వేదవేదాంతాలు పాపమని నిందిస్తాయి. ధర్మమయమైన భగవద్గీత సర్వజ్ఞానాలను కలిగిస్తుంది.

20, 21- అన్ని శాస్త్రాలూ గీతలోనే ఇమిడి ఉన్నాయి కనుక, గీతాశాస్త్రము అన్ని శాస్త్రాలకన్నా గొప్ప శాస్త్రము. దీనిని ఎవరైతే రాత్రింబవళ్లు యథార్థముగా పడుకొని, మేల్కొని, నడుస్తూ, కూర్చొని, నిలబడి అయినా చదువుతారో వారికి శాశ్వతమైన మోక్షము లభిస్తుంది. సాలగ్రామ సన్నిధిలో కానీ, పూజాగృహంలో కానీ, శివాలయంలో కానీ--

22. తీర్థ క్షేత్రాలలో కానీ, నదీతీరంలో కానీ పఠించినవారు వైకుంఠానికి వెళ్లి తీరుతారు. గీతాపఠంతో శ్రీకృష్ణ పరమాత్మ తృప్తి చెందుతాడు. ఆనందిస్తాడు.

23, 24. శ్రీకృష్ణునికి గీతాపఠంతో కలిగేంత సంతోషము, వేదపారాయణల తోనూ, దానాలతోనూ యజ్ఞతీర్థ వ్రతాదులతోనూ కలుగదు. ఎవరైతే గీతను భక్తి నిండిన మనస్సుతో అధ్యయనము చేస్తారో వారు అన్ని వేదాలను, శాస్త్రాలను, పురాణాలను కూడా చదివినట్టే. యోగుల నివాసస్థానంలోనూ, సిద్ధ పీఠంలోనూ, గొప్ప సభలలోనూ --

25,26. యజ్ఞాలలోనూ, విష్ణుభక్తుడి సన్నిధిలోనూ, గీతను చదివితే సద్గతి కలుగుతుంది. భగవద్గీతను చదవటము, వినటము అనేవి, ప్రతిరోజూ ఆచరించేవాడు, ఆయా ఋతువులలో చేయవలసిన అశ్వమేధాది యాగాలను



సదక్షిణంగా చేసిన ఫలాన్ని పొందుతాడు. గీతను విన్నా, గీతార్థాన్ని తెలుసుకొని చెప్పినా, యజ్ఞఫలం లభిస్తుంది.

27. భగవద్గీతను వినిపించినవాడు బ్రహ్మపదాన్ని పొందుతాడు. భగవద్గీతా పుస్తకాన్ని ప్రతిరోజూ సాధనంగా, భక్తిభావంతో, యథావిధిగా అర్చించినవాడి పుణ్యఫలాన్ని గురించి చెపుతాము, విను.

28. వారికి సమస్త యజ్ఞాలు చేసి, భూమినంతా దానం చేసిన ఫలం లభిస్తుంది.

29. భగవద్గీతను పూజించినవారు, అన్ని తీర్థయాత్రలు చేసిన పుణ్యఫలాన్ని పొందుతారు. వారికి సమస్త దానఫలము లభిస్తుంది. భగవద్గీత వినిపించే ప్రదేశంలో భూత ప్రేత పిశాచాదులు ప్రవేశించనే లేవు.

30. దొంగలవలన కలిగిన విపరీతమైన దుఃఖము, శత్రువుల వలన కలిగిన బాధ అన్నీ కూడా భగవద్గీతా పారాయణవలన తొలగిపోతాయి. గీతా పుస్తకాన్ని అర్చించబడుతున్న గృహంలోకి ఏ దుష్టశక్తులు ప్రవేశించలేవు.

31. తాపత్రయాలవల్ల కలిగే పీడ, వ్యాధులవల్ల కలిగే భయము, గీతా పూజలు జరిగే ఇంటిలో ఉండవు. గీతను పూజించినా, పఠించినా, శాపాలు ఉపశమిస్తాయి. పాపపరిహారమవుతుంది. దుర్గతి కలుగదు.

32, 33. దేహోర్ములు అనబడే పై ఆరు గీతాపఠకుడిని బాధించలేవు. గీతాపారాయణ వల్ల పరమేశ్వరుని యందు అచంచలమైన భక్తి కలుగుతుంది. గీతా పుస్తకానికి, గీతాచార్యుడికి నమస్కరించినా భక్తియోగము కలుగుతుంది.

34, 35, 36- ప్రారబ్ధాన్ని అనుభవిస్తున్నప్పటికీ భగవద్గీతను అభ్యసించటంలో ప్రీతి కలవాడు ముక్తుడే అవుతున్నాడు. సుఖంగా జీవించగలుగుచున్నాడు. లోకంలో కర్మలకు తగులుకోకుండా ఉంటున్నాడు. గీతాధ్యయనం చేసేవాడు, మహాపాపాది పాపాలను చెయ్యకుండా ఉండగలుగుతున్నాడు. పూర్వం చేసిన పాపాలను కడిగి వేసుకొంటున్నాడు. అతడికి పాపస్పర్శ అనేదే ఉండదు. అతడు తామరాకుపై నీటిబిందువు లాగా లోకంలో జీవిస్తున్నాడు.

37. అనాచారం వల్ల కలిగిన పాపము, ఆడకూడని మాటలు ఆడినందువల్ల కలిగిన పాపము, తినకూడదని తిన్న పాపము, తగలకూడని దానిని తగిలిన పాపము, ఇలా తెలిసీతెలియక చేసిన సమస్త ఇంద్రియముల పాపము కూడా గీతాపాఠముతో నశిస్తుంది.

38. గీతను చదివేవారికి దానం పుచ్చుకొన్న దోషము కూడా పోతుంది. గీతను పారాయణ చేసేవారు ప్రతిగ్రహము చేసినా కూడా వారికి పాపము లేదు.

39. రత్నాలతో నిండిన భూమినంతా దానంగా గ్రహించినా కూడా గీతాపాఠము చేసేవాడు, క్షణంలో స్ఫటికం లాగా శుద్ధుడవుతున్నాడు.

40. ఎవరి మనస్సు భగవద్గీతలో నిలిచి ఆనందిస్తూ ఉంటుందో వారే నిత్యాగ్నిహోత్రులు. వారే జపతపాది నిష్ఠావంతులు. వారే పండితులు. అటువంటి వారినే దర్శించాలి. వారే ధనవంతులు. వారే యోగులు. వారే జ్ఞానులు.

41. గీతను చదివేవాడే యాజ్ఞికుడు. సర్వవేదార్థాలను తెలుసుకొన్నవాడు.

42. ఎక్కడ భగవద్గీతా పుస్తకముంటుందో, ఎక్కడైతే దాని నిత్య పారాయణ జరుగుతూ ఉంటుందో అదే ప్రయాగ మొదలైన సమస్త తీర్థస్థానము అయి ఉంది.

43. గీతను చదివేవారి దేహములో దేవతలు, ఋషులు, యోగులు, నాగదేవతలు ఎల్లప్పుడూ నివసిస్తారు.

44. గోపాల బాలుడైన శ్రీకృష్ణుడు, నారదుడు, ధ్రువుడు, విష్ణుసేవకులు వీరందరూ గీతను చదివేవాడి శరీరంలో సూక్ష్మంగా ఉంటారు. గీతావిచారము పఠన పాఠనాదులవల్ల కష్టాలలో శీఘ్రంగా సహాయం లభిస్తుంది. కష్టాలు దూరమవుతాయి.

45. శ్రీకృష్ణుడిలా చెప్పాడు. ఓ పార్థా! ఎక్కడైతే భగవద్గీత ఉంటుందో, అక్కడ నేను నివసిస్తూ ఉంటాను. భగవద్గీతయే నాకు గొప్ప స్థానము. ఇందులో సందేహమే లేదు. భగవద్గీతకన్నా గొప్ప నివాసస్థానము నాకు



లేనే లేదు.

46. నాదైన ఆత్మరహస్యాన్ని తెలపటంలో గీత కన్నా గొప్ప శాస్త్రము లేదు. అర్జునా! ఇంకొక రహస్యాన్ని చెపుతాను, విను. భగవద్గీతే నాకు పరమగురువు. నేను గీతలోనే ఉంటాను. గీతే నా రహస్య స్థానము.

47. ఓ పార్థా! గీతయే నాకు హృదయము. నా సారమంతా గీతలోనే ఉంది. నా జ్ఞానమంతా గీతయే. తరగని జ్ఞానము నా గీతాశాస్త్రము.

48, 49. నేను గీతాజ్ఞానాన్ని ఆశ్రయించి, మూడు లోకాలను పరిపాలిస్తూ ఉన్నాను. నన్ను తెలిపే బ్రహ్మవిద్య గీతాశాస్త్రమే అయి ఉంది. గీతలోని ఒక అక్షరాన్ని సగం పలికినా కూడా దాని ఫలాన్ని చెప్పలేము. అందుకే దానిని అర్ధమాత్రా అని పిలుస్తారు. ఇక నీకు గీతానామాలను చెపుతాను, విను. ఇవి పరమ రహస్యాలు.

50, 51, 52. ఓ అర్జునా! ఈ గీతానామాలను పఠిస్తే సర్వపాపాలు నశిస్తాయి. గీతా, గంగా, గాయత్రీ, సీతా, సత్యా, సరస్వతీ, (పతివ్రతా) బ్రహ్మావలీ (బ్రహ్మవల్లి), బ్రహ్మవిద్యా, త్రిసంధ్యా, ముక్తిగేహినీ, అర్ధమాత్రా, చిదానందా, భవఘ్నీ, భ్రాంతినాశినీ (భయనాశినీ), వేదత్రయీ, పరా, అనంతా, తత్త్వార్థజ్ఞానమంజరీ-

53. అనే ఈ పేర్లను నిశ్చలమైన మనస్సుతో చెప్పేవాడు, జ్ఞానసిద్ధిని శీఘ్రంగా పొంది, దేహాన్ని చాలించిన తరువాత ముక్తిని పొందుతాడు.

54. గీతను పూర్తిగా చదవలేనివారు అందులో సగం చదివినా కూడా గోదాన ఫలాన్ని పొందుతారు.

55. ఆరేసి అధ్యాయాలలో మూడు భాగాలుగా ఉన్న 18 అధ్యాయాల గీతను పూర్తిగా చదివినట్లైతే సోమయాగ ఫలము కలుగుతుంది. ఆరు అధ్యాయాలను చదివేవారు గంగాస్నాన ఫలాన్ని పొందుతారు.

56. ప్రతిరోజూ రెండు అధ్యాయాలను పారాయణ చేసేవారు ఇంద్రలోకాన్ని పొంది ఒక కల్పాంతమూ అక్కడే నివసిస్తారు. సందేహమే లేదు.

57. అధ్యాయంలో సగభాగం ప్రతిరోజూ చదివేవాడు, సూర్యలోకాన్ని పొంది, వంద మన్వంతరాలు అక్కడ సుఖంగా జీవిస్తాడు.

58, 59. గీతలో పదిశ్లోకాలు కానీ, ఏడు, ఐదు, నాలుగు శ్లోకాలు కానీ, లేదా మూడు, రెండు, ఒకటి శ్లోకాలు కానీ లేదా శ్లోకంలో సగభాగం కానీ చదివేవాడు చంద్రలోకాన్ని పొంది, పదివేల సంవత్సరాలు అక్కడ జీవిస్తాడు.

60. గీతలో ఒక పాదానికి కానీ, శ్లోకానికి కానీ, అధ్యాయానికి కానీ, అర్థాన్ని స్మరిస్తూ ఉండేవాడు, దేహాంతంలో పరమపదాన్ని పొందుతాడు.

61. పర్వదినాలలో గీతార్థాన్ని స్మరించినా, గీతా పాఠం చేసినా, మహాపాపాల నుండి ముక్తుడై ముక్తిని పొందుతాడు.

62. గీతా పుస్తకాన్ని చేత పట్టుకొని ప్రాణాలు విడిచినవాడు, వైకుంఠాన్ని పొంది మహావిష్ణువుతో ఆనందిస్తాడు. (పూర్వకాలంలో అందరూ తమ సంచులలో భగవద్గీతా పుస్తకాన్ని కలిగి ఉండేవారు.)

63. గీతను చదువుతూ మృతి చెందినవారు, అమృతత్వాన్ని పొందుతారు. మనిషై పుట్టినవాడు గీతాభ్యాసం చేసి తీరాలి. దానివల్ల ఉత్తమమైన ముక్తి లభిస్తుంది. మరుడు అమరుడవుతాడు.

64. గీతా అని పలుకుతూ మరణించినవాడు, ఉత్తమ గతిని పొందుతాడు.

65. శాస్త్రాలు చెప్పిన ఉత్తమ కర్మల ఫలము, గీతా పాఠంతో లభిస్తుంది. గీతాపాఠకుడు నిర్దోషుడై పూర్ణత్వాన్ని పొందుతాడు.

66. శ్రాద్ధకాలంలో పితృదేవతలను ఉద్దేశించి, గీతా పాఠం చెయ్యటంవల్ల, పితృదేవతలు చాలా సంతోషిస్తారు. వారికి స్వర్గప్రాప్తి కలుగుతుంది. శ్రాద్ధకాలంలో గీతాపాఠం చేస్తే పితృదేవతలు తృప్తి చెందుతారు.

67. శ్రాద్ధంలో గీతాపాఠం చేసిన సంతానాన్ని పితృదేవతలు బాగా ఆశీర్వదించి పితృలోకానికి వెళతారు.

68,69. గోదానంతో పాటుగా గీతా పుస్తకాన్ని పండితుడికి దానం చేస్తే కృతార్థుడవుతాడు. స్వర్ణంతో పాటుగా గీతాపుస్తకాన్ని శుద్ధమైన మనస్సుతో విద్వాంసుడైన బ్రాహ్మణుడికి దానం చేస్తే పునర్జన్మ ఉండదు. (కామబాధలు తొలగిపోతాయి.)

70. వంద గీతా పుస్తకాలను దానం చేస్తే బ్రహ్మలోకం కలుగుతుంది. దాదాపు పునర్జన్మ ఉండదు.

71. గీతా దాన ప్రభావంతో ఏడు కల్పాలు విష్ణులోకంలో విష్ణువుతో ఆనందంగా జీవించవచ్చు.

72. గీతార్థాన్ని బాగా వినినా, పుస్తకాన్ని దానం చేసినా, వారి విషయంలో భగవంతుడు ఆనందించి మనోరథాలను ఈడేరుస్తాడు.

73. చతుర్వర్ణాలలో మనిషిగా పుట్టినవాడు ఎవడైనా సరే, గీతను చదవకుండా, వినకుండా ఉన్నట్లైతే వాడు, అమృతస్వరూపిణి అయిన గీతను చేతి నుండి జారవిడుచుకొని విషాన్ని పట్టుకొంటున్నాడు.

74. గీతామృతాన్ని త్రాగి, మోక్షాన్ని పొంది, సుఖంగా ఉండాలి.

75. సంసారదుఃఖంలో నలిగిపోతున్నవారు, గీతాజ్ఞానాన్ని వింటే, అమృతం వంటి సుఖం కలుగుతుంది. హరిధామమైన వైకుంఠాన్ని వారు పొందుతారు.

76. జనకుడు మొదలైన మహారాజులెందరో గీతను ఆశ్రయించి, సమస్త దోషాలను పోగొట్టుకొన్నవారై ముక్తిని పొందారు.

77. అన్ని జ్ఞానాలలోకి గీతాజ్ఞానము చాలా గొప్పది, ఇది బ్రహ్మస్వరూపమైనది.

78. దీని విషయంలో అసూయ చెందినా, గీతను నిందించినా, సృష్టి అంతం వరకూ, నరకాన్ని అనుభవించవలసి వస్తుంది.

79. అహంకారంతో మూఢుడై, గీతార్థాన్ని తెలుసుకోకపోతే, కుంభీపాక నరకంలో పడతాడు. ఇక కల్పాంతం వరకూ దానిని నుండి బైట పడలేడు.

80. గీతార్థాన్ని ఎవరైనా చెపుతూ ఉండగా, దగ్గరగా కూర్చొని విననివాడు, కుక్కల నక్కల జన్మలను పొందుతాడు.

81. భగవద్గీతా పుస్తకాన్ని దొంగిలించి చదివినా కూడా అది నిష్ఫలం కాదు. సుఫలాన్నే ఇస్తుంది.

82. ఎవరైతే గీతార్థాన్ని విని కూడా ఆనందించరో, వాడికి లోకంలో ఏ

ఫలమూ రాదు.  వాడి కర్మలన్నీ శ్రమగానే మిగిలిపోతాయి. గీతను వినిపించినవారిని స్వర్ణాది దానాలతో తృప్తి పరిచి ఊరేగించాలి. వారికి మంచి ఆహారాన్ని నివేదించటంతో పరమాత్మ సంతోషిస్తాడు.

83. భగవద్గీతను నేర్పేవారిని భక్తిగా పూజించి, ధన, కనక, వస్తు వాహనాదులతో సత్కరించాలి. అలా చెయ్యటంతో భగవంతుడైన శ్రీహరి సంతోషిస్తాడు.

84. భగవద్గీతయొక్క ఈ మాహాత్మ్యాన్ని శ్రీకృష్ణుడు చాలా పూర్వమే చెప్పాడు.

85. భగవద్గీతను పూర్తిగా పఠించి ఈ ఫలశ్రుతిని చదివితే ఇందులో చెప్పిన ఫలాలన్నీ లభిస్తాయి.

86. గీతను పఠించి, ఈ మాహాత్మ్యాన్ని పఠించనట్లైతే గీతా పాఠము వ్యర్థమైపోతుంది. అది కేవలము శ్రమగానే మిగిలిపోతుంది.

87. ఈ గీతామాహాత్మ్యముతో పాటుగా చదివినట్లైతే, గీతాపారాయణము ఫలాలనిస్తుంది. దీనిని శ్రద్ధగా విన్నట్లైతే గొప్పవారికి కూడా లభించని సద్గతి లభిస్తుంది. గీతను, గీతామాహాత్మ్యాన్ని చదివినా, విన్నా, గొప్ప పుణ్యఫలము కలుగుతుంది. ఇష్టకామ్యార్థసిద్ధి చేకూరుతుంది.

ఇంతటితో శ్రీమద్భగవద్గీతా మాహాత్మ్యము సమాప్తము.

ఈ గీతామాహాత్మ్యాన్ని సకాలంలో అందించి, అనువదించే శక్తిని అనుగ్రహించిన సద్గురుదేవులైన శ్రీశ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీవారు పాదపద్మాలకు దండవత్ప్రణామాలను అర్పిస్తూ......

జయగురుదత్త.

ఇతి
శ్రీదత్తనారాయణ స్మరణమ్
శ్రీదత్తవిజయానంద తీర్థ స్వామీజీ



## శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీవారు రచించిన గీతాసారము

*(ఇందులో ఒక్కొక్క అధ్యాయానికి ఒక్కొక్క చరణం చొప్పున **18** చరణాలు ఉన్నాయి.)*

ప: గీతాసారం శృణుత సదా
మనసి వికాసం వహతముదా
కామం క్రోధం త్యజత హృదా
భూయాత్ సంవిత్ పరసుఖదా

**1.** విషాద యోగాత్ పార్థేన
భణితం కించిన్మోహ ధియా
తం సందిగ్ధం మోచయితుం
గీతాశాస్త్రం గీతమిదం ...**1**

**2.** సాంఖ్యం జ్ఞానం జానీహి
శరణాగతి పథ మవాప్నుహి
ఆత్మా నిత్యస్సర్వగతో
నైనం కించిత్ క్లేదయతి ...**2**

**3.** ఫలేషు సక్తిం మైవ కురు
కార్యం కర్మ తు సమాచర
కర్మాబద్ధః పరమేతి
కర్మణి సంగః పాతయతి ...**3**

4. కర్మాకర్మ వికర్మత్వం
చింతయచాత్మని కర్మగతిం
నాస్తి జ్ఞానసమం లోకే
త్యజచాహంకృతి మిహ దేహే ...4

5. వహ సమబుద్ధిం సర్వత్ర
భవ సమదర్శీ త్వం హి సఖే
యోనసురక్తో న ద్వేష్టి
యోగీయోగం జానాతి ...5

6. మిత్రం తవ తే శత్రురపి
త్వమేవ నాన్యో జంతురయి!
యుక్తస్త్వం భవ చేష్టాసు
ఆహారాదిషు వివిధాసు ...6

7. అనాత్మరూపా మష్టవిధాం
ప్రకృతిమవిద్యాం జానీహి
జీవస్సైవ హి పరమాత్మా
యస్మిన్ ప్రోతం సర్వమిదం ...7

8. అక్షర పర వర పురుషం తం
ధ్యాయన్ ప్రేతో యాతి పరం
తతస్తమేవ ధ్యాయన్ త్వం
కాలం యాపయ నశ్యంతం ...8

9. సర్వం బ్రహ్మార్పణ బుద్ధ్యా
కర్మ క్రియతాం సమబుద్ధ్యా
భక్త్యా దత్తం పత్రమపి
ఫలమపి తేన స్వీక్రియతే ...9

10. యత్ర విభూతి శ్శ్రీయుక్తా
యత్ర విభూతి స్సత్త్వయుతా
తత్ర తమీశం పశ్యంతం
నేర్ష్యా ద్వేషౌ సజ్జేతే ...10

11. కాలస్తస్య మహాన్రూపో
లోకాన్ సర్వాన్ సంగ్రసతి
భక్త్యా భగవద్రూపం తం
ప్రభవతి లోక స్సంద్రష్టుం ...11

12. భక్తిస్తస్మిన్ రతిరూపా
సైవ హి భక్తోద్ధరణచణా
భావం తస్యా మాధాయ
బుద్ధిం తస్మిన్ నివేశయ ...12

13. క్షేత్రం తద్జ్ఞం జానీహి
క్షేత్రే మమతాం మా కురుచ
ఆత్మానం యో జానాతి
ఆత్మనిసోయం నసురమతే ...13

14. సాత్త్విక రాజస తామసికా

బంధన హేతవ అథవర్జ్యాః
త్రయం గుణానాం యోతీత-
సైవ బ్రాహ్మం సుఖమేతి ...14

15. ఛిత్వా సాంసారిక వృక్షం
పదం గవేషయ మునిలక్ష్యం
తత్కిల సర్వం తేజో యత్
వేదైస్సర్వైస్సంవేద్యం ...15

16. సృష్టిర్దైవీ చాసురికా
ద్వివిధా ప్రోక్తాలోకేస్మిన్
దైవే సక్తా యాంతి పరం
ఆసురసక్తా అసురగతిం ...16

17. నిష్ఠా యజ్ఞే దానే చ
తపసి ప్రోక్తా సదితి పరా
సత్కిల సఫలం సశ్రద్ధం
తత్కిల నిష్ఫల మశ్రద్ధం ...17

18. ధర్మాన్ సర్వాన్ త్యక్త్వాత్వం
శరణం వ్రజ పర-మాత్మానం
మోక్షం ప్రాప్స్యసి సత్యం త్వం
సంతత సచిదానంద ఘనం ...18

ప: గీతాసారం శృణుత సదా
మనసి వికాసం వహతముదా
కామం క్రోధం త్యజత హృదా
భూయాత్ సంవిత్ పరసుఖదా